ఆంధ్రసచిత్రవార

# పత్రిక


29-11-63

కార్తీక దీపోత్సవం



25 నయాపైసలు

# మీ వంటను
# ఉత్తేజవంతంగా
# తయారుచేయండి




*the kind hearted cooking medium*

# సఫోలా

లేత బంగారు రంగులోగల పరిశుభ్రమైన కుసుమపువ్వు నూనె—సఫోలాతో
సరికొత్త రుచులతో మీ వంటకములను యిప్పుడు తయారు చేయండి
వైద్యవృత్తిలో వుండువారిచే యీ కుసుమ పువ్వునూనె బ్రహ్మాండముగా పొగడబడింది—
ఎందుకనగా దానిలో దమనులు గడ్డపడడము లేక గట్టిపడే వ్యాధిని (ఆర్టీరియో
స్క్లెలరోసిస్) తరుచు కలిగించే, సంతృప్త క్రొవ్వు ఆమ్లములు
చాలా కొద్దిగా కలిగియుండుటే యిందుకు ముఖ్యకారణము.

♥ 92% అసంతృప్త ఆమ్లములు, పైత్యరస కోశము దరి చెడునిల్వల తగ్గించును.

దిట్టంగా భుజిస్తే యేమోననే భయము దూరంచేయండి—పరిశుభ్రమైన బంగారురంగు
సఫోలాతో వంటలుచేయండి—ఇది మీకు మిక్కిలి మంచిచేసే వంటసాధనం.

## సఫోలా ♥

సఫోలా మీకు దొరకడం కష్టంగావుంటే మాకు వ్రాయండి—
మీకు సమీపంలోవుండే మా స్టాకిస్టు పేరు తెలుపుతాము.

**ది బొంబే ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్**
కన్స్యూమర్ హౌస్, బొంబాయి-

(OBO-8A)

ఆ డం బ రా ల ను వి డ నా డం డి
దే శ సం ప ద ను వృ ధా కా నీ య కం డి

# ఉత్తరాలు

## దీపావళి సంచిక

దీపావళి (ప్రత్యేక సంచిక) ముఖచిత్రం నన్ను ఎంతో ఆకర్షించినది. ముఖచిత్రమును చిత్రించిన 'గంగాధర్' గారికి నా హృదయపూర్వక అభివందనములు.

జి. వి. స్వామినాయుడు (కాకినాడ)

## రామచరిత మానస్

"తులసీదాస్ 1532 లో జన్మించి 1623 వ సంవత్సరంలో మరణించాడు" అని మీ 18—10—63 వ సంచికలో "మనలో మాట" క్రింద ప్రచురించారు. 1532—1623 వ సంవత్సర కాలమందు ఢిల్లీని పాలించిన మొగలాయి చక్రవర్తులు, అక్బరు, అతని కుమారుడు జహంగీరు పాదుషాలు, కాని షాజహాను కాదని హిందూదేశ చరిత్ర సప్రమాణముగా నుడువుచున్నది. ఈ చారిత్రక దోషమును సవరించుకొన ప్రార్థన.

ఎ. సుబ్బరాయగుప్త (మద్రాసు)

**'భక్తమాల'లో ఇటువంటి కథ ఉన్నదని మాత్రం వ్రాశాము.**

## క్రిస్టిన్ కీలర్ చరిత్ర

'క్రిస్టిన్ కీలర్' కథ చెప్పిన జాన్ హొగాన్ అనుభూతుల — అనువాదంలో గూడా అంతా బాగానే ఉత్తమంగా ఉన్నాయి. నిజానికి వాస్తవిక జీవితసత్యాలు—అందునా రాజకీయం పిరోచితం, సామాజిక సాంస్కృతికం—వినోద విజ్ఞాన వికసితమైనది కాగా వ్యభిచార చరిత్రలోని దైన్య నికృష్టమైనదై గూడ "మానవ ప్రవృత్తి", "అసహ్యం" చాటున ఎంత విశృంఖలంగా విపరీత పరిణతికి పోతుందో అనిపించింది ఇది చదువుతూంటే.


రామావా (రాజమహేంద్రవరం)

## సరాగమాల పోటీ

దీపావళి పత్రిక ఎప్పుడొస్తుందా అని ఎదురు చూచాం. అందుకు ముఖ్య కారణం, "సరాగమాల పోటీ", విషయాలు చూడాలనే కుతూహలమే. అయితే ఆ పోటీ మొదటినుండి చివరి వరకు చదివేసరికి ఈ పోటీ వ్యర్థ మనిపించింది. ఎందుచేతంటారా ? "లలిత సంగీత ప్రియులకు చక్కని పోటీ" అని వ్రాశారు కదా ! మరి అందులో శాస్త్రీయ సంగీతానికి సంబంధించినవి, ప్రయివేటు గీతాల గురించి చేర్చారు. అంటే లలిత శాస్త్రీయ సంగీతాలకు తేడా లేదనా ఉద్దేశ్యం. లలితసంగీతం చాలవరకు (ముఖ్యముగా ప్రేక్షకులకు) చిత్రాలకు సంబంధించియే ఉంటుంది. ఏ ప్రయివేటు గీతం ఎవరు పాడారో ఎంత మందికి తెలియగలదు ? ఇలాగే థియరీలో రెండు, అయిదు ప్రశ్నలు. అందుచేత దీనికి 'లలిత సంగీత ప్రియులకు పోటీ' అనేకన్న "చాచా సంగీత పోటీ" అంటే బాగుంటుందేమో ! ఇంక బహుమతులు సరేసరి. ప్రతివారి వద్దా గ్రామఫోన్ ఉంటుందని భావించారేమో.

**వి. సుందరరాజమౌళి (శ్రీకాకుళం)** ★

# సేవింగ్స్ బ్యాంక్ ఖాతా మొదలుపెట్టండి




## నేషనల్ అండ్ గ్రిండ్లేస్

నేషనల్ అండ్ గ్రిండ్లేస్ బ్యాంక్‌లో సేవింగ్స్ బ్యాంక్ ఖాతా ప్రారంభించడం అతి తేలిక. ఇందుకు అయిదే అయిదు రూపాయలు చాలు. దీనికి సాలీనా నూటికి 3 రూపాయలు వడ్డీ లభిస్తుంది.

నేడే మీకు సమీపంలోగల స్థానిక బ్రాంచికి వెళ్ళి పూర్తి వివరాలు తెలుసుకోండి. మీ బ్యాంకింగ్ సమస్యలు ఏలాంటివి అయినా సమర్థవంతంగా, సాదరంగా మీ సమస్యలు పరిష్కరించేవారు మీకు స్వాగతమిస్తారు.

**1863** **1963**

*ఇండియాలో బ్యాంకింగ్ వ్యాపారంలో నిండిన 100 సంవత్సరాలు*

## నేషనల్ అండ్ గ్రిండ్లేస్ బ్యాంక్ లిమిటెడ్

NGB-59 TEL

యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇన్‌కార్పొరేట్ చేయబడింది • మెంబర్ల బాధ్యత పరిమితం

**బ్రాంచీలు: మద్రాసు: 3, నార్త్ బీచ్ రోడ్డు; 378 నేతాజీ సుభాస్ చంద్రబోస్ రోడ్డు. (లాయిడ్స్ బ్రాంచి); 6, ఆర్మీనియన్ స్ట్రీట్; 158, మౌంట్ రోడ్డు. హైదరాబాద్: అబీద్ రోడ్.**

# ఆంధ్రసచిత్రవార పత్రిక


వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

*

శుక్రవారం: 29—11—63

శోభకృన్నామసం॥ నిజకార్తిక మార్గశిర్ష శు॥త్ర॥
సంపుటము 56 సంచిక: 13

స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా
వివరాలు

ఇండియా: రూ. 13.00 ఇతర దేశాలు: ఓడమీద (Sea Mail) రు. 20.00. (విమానం ద్వారా (Air Mail): బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు— రూ. 114.00. అమెరికా రూ. 176.50. ఆస్ట్రేలియా 135.00.)

*

విడిప్రతి: 25 న.పై.
సంవత్సర చందా: 13-0-0.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1




నటి: [illegible]

## మనలోమాట

క్రిస్టిన్ కీలర్ గురించి 'జాన్ హాగన్ చెప్పిన 'కథలు' (యథార్థమయినవి.) ఈ వారంతో అయిపోతున్నాయి. ఇవి ప్రచురించినందుకు పొగడ్తలే ఎక్కువగా వచ్చినా తిట్లు కూడా కొన్ని తగలక పోలేదు.

* * *

పోయినవారం 'తమిళనాడు వీధి నాటకాలు' వ్యాస రచయిత శ్రీ ఎస్. రామకృష్ణ ఉండే ఊరు మయూరం. గత సంచికలో పొరబాటున కోయంబత్తూరు అని ప్రచురించాము.

* * *


సీరియల్ నవల 'ప్రేమకు పగ్గాలు' ఈ వారంతో అయిపోతోంది. త్వరలో మరొక నవల ప్రచురణ ప్రారంభించగలము.

* * *

సరాగమాల పోటీ "గంధర్వ ప్రశ్నలు" ముగింపు తేదీ ఈ నెల 30 వ తేదీయేనని పోటీలో పాల్గొనదలిచిన వారందరినీ మరొకసారి హెచ్చరిస్తున్నాము!...

★

## లోకంపోకడ



"మానాన్న చుట్టలు కాలిస్తే నేను మాత్రం కాల్చలేనా?..."

---

మహిళల పొదుపు రక్షణ నిధికి మదుపు
పురుషుల శక్తి దేశానికి రక్షణ నిధి

---

## విషయాను క్రమణిక


**కథలు:**


కంసకథ — 12
పట్టుపరికిణీ — 20
నాకొత్తబాబాయి — 26

**సీరియల్ కథలు:**

మనిషి - మిథ్య — 18
క్రిస్టిన్ కీలర్ కథ — 28
రామచరిత మానస్ — 32
ప్రేమకు పగ్గాలు — 36

**శీర్షికలు, వ్యాసాలు:**

ఉత్తరాలు — 3, ఉమెన్ కార్టూన్ — 6, ధర్మలేఖ — 7, సరాగమాల సినిమా — 8, 9, రాజధానికబుర్లు-10, మనము మనదేహస్థితి-11, వనితాలోకం — 16, వారఫలాలు — 24, ఆపీ ఇవీ అన్నీ — 52, బొమ్మలకథ — 56.


భాగ్యం కాబినెట్‌లోకి వస్తాడట
అయ్యో! కర్మ! మా కాంగ్రెస్ కాని వాడికా ఈ పదవి- ఎంత అన్యాయం...
మీ మిత్రులంతా మా శత్రువులు
పాక్ ఆక్రమణలో వున్న కాశ్మీరులో మా వాళ్ళ బొమ్మల దగ్ధం
ఎస్. కే. పాటిల్ గారు బంగారు నియంత్రణ మీద దాడి చేశారు
సార్ సార్! మిమ్మల్ని కొట్టాలనుకోలేదు
పై సొంటు వరకు సరిగా నిలబెట్టాలని హర్ష...
పంజాబ్ వరకు కూడా నిలబెట్టాలని తాపత్రయం
కైరాన్ పాలన

శ్రీ కృష్ణ

# ఢిల్లీలో ఉత్సవాలు: బహదూర్ షా జన్మదినం!

**ఢిల్లీ ఉత్సవాలలో మునిగి తేలుతోంది. ఇప్పటినుంచి మార్చి వరకూ అంగళ్ళ వాళ్ళకి, పెత్తందార్లకి, కీర్తికండూతికలవారికి, పదవి వ్యామోహంకలవారికీ మంచికాలం.**

తక్కిన పెద్ద నగరాలవలెనే ఢిల్లీ తన కీర్తి కండూతి కల నగరస్తులంటే చూసి గర్వపడేది. పడుతోంది కూడా. బ్రిటిషు వారి కాలంలోనే 'బిరుదు వేటగాళ్లు' అని పిలిచేవారు. బిరుదులున్న వారు కూడా ఈ తరహానికి చెందినవారే. మన కొత్త రాజ్యాంగంతోపాటు బిరుదులు రద్దయి పోయాయి. పాత వేటగాళ్లంతా ఇప్పుడు సంఘ సేవకులయి పోయారు. గ్రామఫోను అదే, రికార్డు మాత్రం మార్చారు.

ఇంకా విడమర్చి చెప్తాను. పాత రోజుల్లో—ఇంకా ఇండియా బానిస దేశంగా ఉన్నప్పుడన్న మాట — 'బ్రిటిష్ ఛీఫ్ ఈటర్‌లు' (బాగా తినే సేవకులకి పర్యాయపదం — సం.) అంటే ఢిల్లీ చీఫ్ కమిషనర్ పదవికి మించిన వారు కాదు, రామలీలా ఉత్సవాలలో 'అతి ముఖ్య వ్యక్తులు' (వి. ఐ. పి. లు) గా వచ్చేవారు. ఇప్పుడు వారు రాష్ట్రపతిని ప్రధాన మంత్రిని, ఇతర కాబినెట్ మంత్రులని ఊరేగిస్తున్నారు రామలీలా ఉత్సవాలలో.

స్వతంత్రం వచ్చిన తర్వాత మొదటి సారిగా రాష్ట్రపతి వెళ్లి 'రాముడి' నుదురుమీద తిలకం పెట్టే పద్ధతిని మానుకుని తమ పదవికి తగిన మర్యాదతో ప్రవర్తించారు.

దీనిని బట్టి మనకి అర్థం అయ్యేది ఏమిటంటే మంత్రులు, విదేశ రాయబార వర్గంవారు లేనిదే ఢిల్లీలో ఏ మత, సాంఘిక ఉత్సవమూ జరగదని. వానలు ప్రారంభం అయిన తర్వాత "ఫెయిర్ ఆఫ్ ఫ్లవర్ సెల్లర్స్" అనే వేడుక జరుపుతారు. ఈ వేడుకకి ప్రధాన మంత్రి హాజరు అవుతారు. మంత్రులకి ప్రచారం, ప్రజలను కలిసే అవకాశం కావాలి. కీర్తి కండూతి కలవారికి, పదవీ వ్యామోహం ఉన్నవారికి ఎవరో ఒక ప్రముఖుడితో — చివరికి పార్లమెంటరీ సెక్రటరీ అయినా సరే— ఫొటో తీయించుకోవటం కావాలి. ప్రధాన మంత్రితో ఒక ఫొటోలో 'దిగట'మే వీరందరికీ ముఖ్యోద్దేశం కాబట్టి అది ఎలా వీలవుతుందో చూడటమే వారి వృత్తి అయిపోయింది ఢిల్లీలో. ప్రధానితో కరచాలనం రామేశ్వరం యాత్రతో సమానం. 1947 వరకూ ఢిల్లీ కలెక్టర్‌కి పెద్ద హోదా ఉండేది.

ఇక వార్తా పత్రికలు 'పురాతన చిహ్నాలు' వెతకటంతో పడిపోయాయి. ఒక పత్రిక 'ఘలీబ్' (కవి) ఉన్న ఇల్లు ఒకటి అమ్మకానికి సిద్ధంగా ఉందని తెలుసుకుని అదొక 'జాతీయ స్మృతిచిహ్నం' అనీ, దానిని అమ్మరాదనీ ప్రచారం చేసింది. అసలు **ఘలీబ్ భాష ఉర్దూని ఒకపక్క నాశనం చేస్తూ** మరొక పక్క ప్రజల డబ్బుతో ఇటువంటి విలువ ఏ మాత్రం లేని ఇళ్ళు కొనిపించటం ఒక పెద్ద వింత.

వేడుకల సంగతి మరొకసారి ఆలోచిద్దాము. ఇటీవలే ఢిల్లీలో చివరి మొగల్ చక్రవర్తి బహదూర్‌షా శత జన్మదినోత్సవం జరిపారు. బహదూర్‌షా ఎముకలు తిరిగి ఢిల్లీకి తీసుకురావాలని ఒక పత్రిక చెబుతోంది. ఎవరో ఇతన్ని నెపోలియన్‌తో పోల్చారు. ఉత్సవాలు ప్రారంభించిన వారు ప్రధాన మంత్రి.

భారత దేశంలో మొగల్ సామ్రాజ్యం నెలకొల్పింది బాబర్. 1526 లో, ఇబ్రహీంలోడీని జయించిన యుద్ధం ఇంకా ప్రారంభం అయ్యే ముందు శత్రువు బలం గురించి ఎవరో హెచ్చరించగా అన్నాడుట: సింహాసనం అధిష్టించటం కాని భూస్థాపితం అవటంకాని జరగాలికాని **కాబూల్‌కి తిరిగి పోవటం మాత్రం జరగదు అని.**


బహదూర్‌షా అతని వంశం చివరివాడు. అతని ముందున్న షా ఆలం రాజ్యం ఢిల్లీ నుంచి పాలం వరకూ ఉండేది. ఢిల్లీ ఎర్ర కోటలో బహదుర్‌షా ఏకైక సామ్రాజ్యాధిపతి. బ్రిటిషు వారు అతనికి పింఛను ఇప్పించారు. 1857 తిరుగుబాటు అతను లేవదీసింది కాదు. వద్దో అంటే ఆ భారం అతని మీదికి తోశారు. బ్రిటిషువారు ఢిల్లీని దోచుకుంటున్న సమయంలో బహదూర్‌షా హుమాయూన్ సమాధిలో దాక్కున్నాడు.

తర్వాత జరిగినవి : ఒకానొక కాప్టెన్ హాడ్సన్ ఏభయి మంది సైనికులతో బహదూర్‌షా దాక్కున్న చోటికి వెళ్ళాడు. ఆ సంఘటనని ఒక పెద్ద చరిత్రకారుడు ఇలా వర్ణించాడు :

"పారిపోవటం కాని, ఎదురు తిరగటం కాని వీలయ్యేదికాదు. రాజాగారు తన భార్య జీనత్ మహల్ చెప్పినట్లు, లొంగిపోవటానికి మంతనాలు జరుపటం ప్రారంభించాడు. హాడ్సన్ తన రాయబారులని రాజాగారి వద్దకు పంపాడు. రెండు గంటలు గడిచిన తర్వాతగాని సమాధానం తీసుకు రాలేదు వారు. రాజాగారు తన జీవితానికి ప్రమాదం లేదని కాప్టెన్ హాడ్సన్ స్వయంగా చెప్పిన మీదట లొంగి పోవటానికి అంగీకరించాడు.


"హాడ్సన్ తన విడిది నుంచి వెళ్లి, అందరి సమక్షంలో, అందమయిన సమాధి 'గేటు' దగ్గర ఉన్న బయలు ప్రదేశంలో నుంచున్నాడు. అప్పుడు అతను ఒంటరిగా ఉన్న శ్వేత జాతివాడు, ప్రపంచంలో కెల్లా అద్భుతమయిన వంశం యొక్క ప్రతినిధి లొంగిపోయి తన వంశం నిర్మూలనకి దారి తీయటానికి సిద్ధంగా ఉన్నాడు. అతనికి ఒక బిరుదు, సంప్రదాయమే మిగిలాయి కాని మొగల్ సామ్రాజ్యాధిపత్యం ప్రభావం భారత దేశంలోని మహమ్మదీయుల గుండెలలో ఇంకా సజీవంగానే ఉంది. కేవలం ఒక బ్రిటిషు 'సబాల్టర్న్' వంటరిగా మొగల్ చక్రవర్తులలో చివరి వాడి కత్తి తీసుకొనటంకన్నా గొప్ప చరిత్రాత్మక దృశ్యం ఎక్కడ కనుపిస్తుంది ? తామర్లేన్ (తైమూర్) వంశం ఇలా పతనమయిపోయి, తమ అయిశ్వర్యా లన్నీ నాశన మయిపోతూ ఉంటే చూస్తూ ఉండ వలసి వచ్చింది అతని అనుచరులకి. ఈ సంఘటన

51 వ పేజీ చూడండి




పశ్చిమరంగంలో సమష్టి వైమానిక శిక్షా విన్యాసాలలో పాల్గొంటున్న అమెరికన్ ఎఫ్ 100 సూపర్ శాబర్ విమానం. ఢిల్లీలోని పాలం విమానాశ్రయంలో ఇటీవల శిక్షా విన్యాసాల ప్రదర్శన జరిగింది. విమానం సమీపాన ఉన్నవారు అమెరికన్ 356 వ టాక్టికల్ ఫైటర్ స్క్వాడ్రన్‌కు చెందిన వైమానికులు.

# సరాగమాల



**వి.ఎ.కె. రంగారావు**

క్రిందటి వారం చెప్పుకోదగ్గ విషయమే జరిగింది. అనుపమాన గాయకీమణి, అమర కోకిలా సదృశ, అమల గాంధర్వ విద్యాధురీణ లతా మంగేష్కర్ మద్రాసులో ఎ. వి. ఎం. వారి "మై భీ లడ్కీ హూఁ" అనే హిందీ చిత్రానికి రాజేంద్ర కృష్ణ వ్రాసిన యుగళ గీతాన్ని చిత్రగుప్త వరస వేయగా పాడింది. ఇందులో చెప్పుకోదగ్గ విషయమేమిటి! అంత వరకు యేమీలేదు. కాని ఆ యుగళ గీతం పాడిన దెవరితో అన్న ప్రశ్నకు వచ్చే సమాధానంలో ఉన్నది ఆ వింత. ఆ రెండవ కంఠం తెలుగు చిత్రసీమలో ప్రవేశించి, తమిళ చిత్రరంగంతో పరిచయం వృద్ధి పొందించుకుంటూ, మలయాళ చిత్రభూమిలో ప్రవేశించి, కన్నడ చిత్రదేశాన్ని అసమాన గాత్ర సంపద లక్ష్మీ సమేతుండై పరిఢవిల్లుతున్న నేపథ్య గాయకుడు పి. బి. శ్రీనివాస్‌ది.



పి. బి. శ్రీనివాస్, లతామంగేష్కర్.

ఇంతకు పది సంవత్సరాల ముందు, ఫిల్మిస్తాన్ వారి "మిస్టర్ సంపత్" అనే హిందీ చిత్రంలో గీతాదత్ పాడిన బృందగానంలో ఒక చరణమున్నది శ్రీనివాస్‌కే. ఇరువురు ప్రఖ్యాత హిందీ సినిమా రంగ గాయకులతో పాడిన ఘనత దక్షిణ భారత సినిమా రంగంలో పి. బి. శ్రీనివాస్‌కే దక్కింది.

రికార్డింగ్ దివాన శ్రీనివాస్ పాటను విన్న లత, సంగీత దర్శకుడు చిత్రగుప్త, రచయిత రాజేంద్రకృష్ణ, తెరపై ఈ పాటకు పెదవులు కదపబోయే ధర్మేందర్, అందరూ విన్నారు. శ్రీనివాస్ చక్కని ఉచ్చారణను మెచ్చుకున్నారు. ఈ సంగతి వీరెవ్వరికి తెలియదు కాని నాకేనాడో తెలుసు. శ్రీనివాస్ ఉర్దూ ఉచ్చారణ లక్నో గవైయాలా ఉంటుందని. ఏమయితేనేం ఈ అవకాశం శ్రీనివాస్‌కి ఇచ్చిన మెయ్యప్పన్ అభినందనీయులు.

* * *

సుశీల కంఠంలో సురకన్యల సుతారపు సితారులు మేళవింపబడి ఉన్నాయంటే, ఆమె స్వర వాహినిలో వియద్గంగా ప్రవాహపు సరళత్వం ఉందంటే, మహతీ విపంచికా మృదు మాధుర్యాలు ఆమె నాల్కపై నివసిస్తాయంటే, చాలా స్వల్పమైన అతిశయోక్తులే అవుతాయి. నిజానికి ఆమె కంఠంలో అంత ప్రతిభ, హాయీ, రెండూ ఉన్నాయి. అందుకనే ఆమెను సుశీల అన్నారు.

ఇప్పటికి ఆమె తెలుగు చిత్రాలలో కొన్ని వందల పాటలేనా పాడి ఉంటారు. ఆ వందల సంఖ్యలో ఈ మూడు పాటలు అత్యుత్తమమైనవి అని చెప్పటం అసాధ్యం : నారద తుంబురులకు కాని ఇతరులకు కాదు. కాని సంగీత సాహిత్య స్వరాలు ఉత్తమంగా రంగరించబడి ఆమె కంఠంలో ప్రాణం పోసుకున్న వివరాలు నాకు తెలుసా అంటే, తెలుసు. అవి అనుకుంటున్నాను మరి. అవి ఇవి.

సుశీల కంఠం యెప్పటి నుంచో ఎ. వి. ఎం. చిత్రాలలో వింటున్నా, అప్పటి నుంచి అందరి మాధుర్యం నన్నాకర్షించినా ఆ కళా ప్రతిపత్తి అంటే ఒక విధమైన భక్తి భావం యేర్పడింది. "భాగ్య రేఖ"లో "నీ వుండేదా కొండపై" విన్న తరువాతనే, నాలో ఇంతటి భావాన్ని పెంపొందింప జేయటానికి కారణం ఆ రచనలో, ఆ వరుసలో, ఆ పాడటంలో ఉన్న అసమానమైన, అనుపమమైన అందం, రచన, భక్తి గీతాలు వ్రాయటంలో సిద్ధహస్తులైన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిది.

"నీ ఉండేదా కొండపై, నే నుండేదీ నేలపై
ఏ తీరు సేవింతునో"

ఇంత చక్కటి ఊహను, ఇంత ప్రశాంతంగా, ఇంత సుబోధకంగా వ్రాయగలిగిన వారెందరో ఉండరు. వారిలో దేవులపల్లి అగ్రగణ్యులు. ఆ సలలిత రచన సుధ ప్రతి చరణంలోనూ పరిమళిస్తుంటుంది. ప్రతి పదం లోనూ ప్రకాశిస్తూ ఉంటుంది. ఇంతటి రచనకు పెండ్యాల చేసిన వరస యేమయినా తీసిపోయిందా ? లేదు. వీలయితే, ఆ అందానికి నగిషీలు చెక్కింది. ఆ కాంతితో ఇంకా వింత రంగులు కాఫీ రాగచ్ఛాయతో పొదిగింది. ఈ స్వరసుమమాల సుశీల కంఠాన వేయి వెన్నెల కాలహోయియై అమరింది. సంగీతాకాశంలో ఒక ప్రమోద భరితేంద్ర చాపము విరిసింది. శ్రోతోవళి మురిసింది. గంధర్వ గానమంటే యేమిటో మర్త్యలోకం చవిచూసింది. (జి. ఇ. 27866.)

పై పాటకు అన్నింటా ఈడైనది భక్త శబరి చిత్రంలో "నిన్ను జూచునందాక కనుల వెలుగుండేనా" అన్నది. రచన, వరస, కంఠం, పై పాటకు కారణమైనవే. దేవులపల్లి, పెండ్యాల, సుశీల, వశొబ్దాలుగా తన ఆరాధ్యరాముని రాకకై యెదురు తెన్నులు చూచి, అవసాన సమయంలో శబరి రాముని, తన మనోభిరాముని వేసే ప్రశ్న ఈ పాటకు సాహిత్యం,

"బడలిన పువ్విది వాడును
తొడిమవీడి పడి రాలును
అడుగుల కడ రామా యని
పడితే అంతే చాలును"

పై చరణంలో ధ్వనించిన వయసుకు తగ్గట్టు, ఒదుగు బదుగులో ముదిమి తెలిసేటట్టు పాడటం సుశీల గొప్పతనం. పాడించటం పెండ్యాల ఘనత. కానడ రాగంలో ఉన్న ఆ వరసలు, భక్తి భావంలో ఉన్న ఆ పాటను విని ఆనందించి ఓహో అనుకునే భాగ్యం మనది. కాదా మరి (జి. ఇ. 35073).

పై రెండు పాటలకు ఒక తేడా ఉంది. మొదటి పాట కథా సందర్భం తెలియని వారు కూడా ఆనందించవచ్చును. రెండవది ఆ సందర్భ శుద్ధి తెలిసిన వారికి, పండరీబాయి మనోజ్ఞమైన నటన తెరపై చూసిన వారికి మరింత ఆనందదాయి కాగలదు.

సుశీల ఇంత సొగసుగా భక్తిగీతాలే పాడగలదు అన్న భ్రమ పై వాక్యాలు కలిగిస్తే అది కేవలం భ్రమే అవుతుంది. భక్తికి సూక్ష్మంగా చాల దగ్గరైనా స్థూలంగా చాలా దూరమైన ఒక శృంగారగీతాన్ని జ్ఞప్తికి తెచ్చుకోనండి.

"మదనా సుందర నా దొరా నా
మది నిన్ను గని పొంగినదిరా
నన్నే దొరా"

ఎవరు, యెందులో, యెప్పుడు ? "గులేబ

కావలి కథ''లో జ్యోతి నృత్యానికిది. నారాయణ రెడ్డి వ్రాయగా, వేలూరి కృష్ణమూర్తి, జోసఫ్, త్రివిక్రమరావు పర్యవేక్షణలో వరస చేయగా సుశీల శృంగార రసోత్పుల్ల నవమానినీ మానసోత్పలా హ్లాదాంత మధువును చిలికి పాడిన పాట అది. ప్రతి చరణంలోను యెనలేని శృంగార ధోరణి గిలిగింతలు పెడుతున్నది.

"మిసిమి వెన్నెలలోన పసిడి తిన్నెలపైన
రసకేళి దేలి పరవశమౌదమీ వేళ''
"గిలిగింత లిడయింత పులకింత లేదేమి
ఉడికించ కింక చూడౌకమూరు నా వంక''



సుజాతచిత్ర ప్రథమచిత్రంలో రాజసులోచన

రచనకు పోటీగానే ఉంది బలహంస కౌదార రాగాల మనోహరమైన వరస. కాని వాద్యగోష్ఠిలో వినిపించిన శబ్దజాలం సినిమాలో చూపించిన విన్యాసానికి తగినట్లుగా ఈ రచనకు తగనట్లుగా అనవసరంగా జానపద ధోరణిని ఘోషించినది. ఈ శమణ్మాత్రి కళంకంతోనైనా ఈ పాట పూర్ణశశి బింబ సమాన ప్రకాశితమే. (బి. కు. 35239).

ఇక పాఠకులు యే మూడు పాటలను ఎన్నుదారు, వా మాటలో యేకీభవిస్తారు! ★

# హైదరాబాద్ సినిమా వార్తలు

## హిందీ చిత్ర సమీక్ష :

# "మేరే మెహబూబ్"

అందమైన హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్, ఆహ్లాదకరమైన నౌషాద్ సంగీతం అతిలోకసుందర వర్ణాలలో చిత్రీకరించబడిన దృశ్యాలు, అత్యున్నత స్థాయికి చెందిన నటన, అతి మధురమైన ప్రేమ ఘట్టాలు—ఇవన్నీ కలిసి రాహుల్ థియేటర్స్ వారి ఈస్ట్మన్ కలర్ చిత్రం "మేరే మెహబూబ్" ను చిత్రంగా రూపొందించాయి.

సూక్ష్మంగా కథ ఇది : కథానాయకుడు అన్వర్ అందమైన యువకుడేకాదు, భావ కవి కూడా. అతని రమ్యమైన భావాల రూప కల్పనకు తగ్గట్లుగా, కథానాయకి హుస్నా నవాబుల ఇంటి అమ్మాయి.

అన్వార్‌కు ఒక సోదరి మినహాయించి 'నా' అన్న వాళ్ళెవ్వరూ లేరు. ఆ ఒక్క సోదరి కూడా చిన్నారి తమ్మునికి ఉన్నత విద్యలు చెప్పించాలన్న పట్టుదలతో కాలికి గజ్జెకట్టి, ప్రదర్శనలు ఇస్తూ ఉంటుంది. సినిమా కారణాలవలన కథానాయికి హుస్నా, సోదరుడు నవాబు నర్తకి 'నజ్మా'ను ప్రేమిస్తాడు. 'నజ్మా'ను పెళ్లి చేసుకోవాలని నవాబు కలలు కంటున్న పేరొకమైన వారి వంశ గౌరవం అతని ప్రయత్నాలకు అడ్డుగా నిలుస్తుంది.

ఈ కథ ఇలా ఉండగా — అన్వార్ ఒక రోజున రైల్లో ప్రయాణం చేస్తుండగా నవాబును కలుస్తాడు. అతని ప్రవర్తన, వేష భాషలు, మర్యాద రీతి చూచి నవాబు మురిసిపోయి, తన సోదరి 'హుస్నా'ను ఇచ్చి వివాహం చేయటానికి నిశ్చయించుకొంటాడు. అన్వార్, హుస్నాను ప్రేమించినట్లు నవాబుకు తెలియదు. అంతేకాదు. అన్వార్, తాను ప్రేమించిన 'నజ్మా' సోదరుడని కూడా నవాబుకు తెలియదు. కథ మంచి రసపట్టులో ఉండగా, రహస్యం వెల్లడవుతుంది. ఆ తరువాత అందరూ అగమ్యగోచర స్థితిలో ఉంటారు.

వంశ ప్రతిష్ఠ, ప్రేమల సంఘర్షణల మధ్య నలిగిపోతున్న నవాబు చివరకు ఒక నిర్ణయానికి వచ్చి 'పవిత్రమైన ప్రేమ' యొక్క గొప్పతనాన్ని గుర్తించడంతో కథ సుఖాంత మవుతుంది.

కథలో చెప్పదగినంత విశిష్టత ఏమీ లేదు— అయినా, చిత్రీకరించిన విధానం అందంగా ఉన్నది. ఘట్టాలను రసవత్తరంగా చిత్రీకరించారు. కథ చుట్టూ 'ప్రేమ' సుళ్ళు తిరిగినా, ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా సాగింది. లక్నో నవాబుల సాంఘిక, ఆర్థిక స్థితిని, వైభవ ప్రాభవాలను రమణీయంగా చిత్రీకరించిన డైరెక్టరు హెచ్. ఎస్. రావేల్, అతని ఆలోచనాశక్తి నిజంగా అభినందనీయాలు. వినోద్ కుమార్ కథ, సాహిత్య ప్రధానమైన అతని సంభాషణలు బాగున్నాయి. పాటల రచనలో కవిత్వమూ, ప్రేమా సమానంగా గోచరిస్తాయి.

నౌషద్ సంగీతం, చెవులకు విందును చేకూర్చు విధంగా ఉన్నది. ముఖ్యంగా రెండు, మూడు పాటలు బాగా జనాకర్షణ పొందవచ్చును. 'మేరే మెహబూబ్'—టైటిల్‌సాంగ్ ఈసరికే ప్రజాదరణ పొందింది. 'ఈస్ట్మన్' రంగులన్నీ చిత్రానికి నవ్యత చేకూర్చాయి.

దీనిలోని ముఖ్యమైన ఆకర్షణ హైదరాబాదు దృశ్యాలు. ప్రేమ 'ఘట్టా' లన్నింటికీ 'పబ్లిక్ గార్డెన్స్'నే ఎంచుకోవటం ముదావహం. ఇండోర్ దృశ్యాలను కూడ హైదరాబాదులోని రాజా ధనరాజ్ గిర్జిగారి ప్యాలెస్‌లోనే చిత్రీకరించటంవలన నవాబు సంసారపు వాతావరణం బాగా తీర్చిదిద్దబడింది.

ఇక నటనకు వద్దాం. అశోక్‌కుమార్ నటన అద్భుతంగా ఉంది. పాతకాలపు లక్నో నవాబే తెరపై అవతరించాడా అన్నట్లున్నది. రాజేంద్రకుమార్,



"అమరశిల్పి జక్కన''లో బి. సరోజాదేవి, నాగేశ్వరరావు.

అన్వార్‌గా, ఆవేశ పూరితమైన ఘట్టాలలో బాగా నటించాడు. అతని సోదరిగా నిమ్మి, కరుణాప్లావితమైన నటనను ప్రదర్శించింది. అందాలతార సాధన తన సహజమైన లలిత ధోరణిలో ఉత్తమ నటనను ప్రదర్శించింది. అమితా జానీవాకర్ తదితరులు వాళ్ళ పాత్రలకు సరిపోయారు.

మొత్తంమీద "మేరే మెహబూబ్" ప్రేక్షకులకు మనోహరమైన అనుభవం.

* * *

అన్నపూర్ణా సంస్థవారు తమ కొత్త చిత్రం "డాక్టర్ చక్రవర్తి" షూటింగుకు విజయదశమి శుభ ఘడియల్లో ప్రారంభోత్సవంచేసి, శరవేగంతో కొనసాగిస్తున్నారు.

ఇంతవరకూ అన్నీ ఔట్—డోర్ దృశ్యాలనే చిత్రీకరించారు. రాజధానీ నగరంలో కొండ మీద జానకి, తదితరులతోను, నాగార్జునసాగర్‌లో మరికొన్ని దృశ్యాలను చిత్రీకరించటం జరిగింది.

54 వ పేజీ చూడండి

# అసెంబ్లీ శీతాకాల సమావేశం ప్రారంభం!

ఈ మధ్య జరిగిన ఆర్. టి. డి. బస్సు పని వారల 'హఠాత్తు సమ్మెను' అందరూ నిశితంగా విమర్శించారు. కార్పొరేషన్ అధ్యక్షులు కటారీ గారే, ఈ సమ్మెను బాధ్యతా రహితమైన ప్రవర్తనగా వర్ణించారు. విద్యార్థులకు, బస్సు కండక్టరుకు జరిగిన ఘర్షణ ఆసరాగా తీసుకుని, విద్యార్థులు భారీ ఎత్తున ఊరేగింపును ఒకటి లేవదీశారు. ఇలాంటి ఊరేగింపులు, నినాదాలు, రాజధాని ప్రజలకు కొత్తేమీ కాదు. కార్మిక సంఘాలు బోలెడన్ని ఉన్నాయి. వాళ్ల కనీసపు కోర్కెలు తీర్చాలంటూ అప్పుడప్పుడు కార్మిక నాయకులు, వాళ్లను ఉత్సాహ పరుస్తూనే ఉంటారు. అయితే ఈసారి ఓ కొత్త వర్గం వారు తమ కోర్కెలు తీర్చాలంటూ నినాదాలు చేస్తూ, జంట నగరాలలో ముఖ్యవీధుల గుండా పచార్లు చేశారు. దర్జీ పనివారల నాయకుడు శ్రీ కె. కిశోర్ దత్తు దీనికి నాయకత్వం వహించారు. వీళ్ల కోర్కెలు చాలా మందికి వింతగానూ, ఆశ్చర్యంగానూ తోచింది. ఏమైనప్పటికి, ఏ రాజకీయ పార్టీ అండదండలు లేకుండా, ఇంత క్రమశిక్షణ గానూ, శాంతియుతం గానూ, నడిచి వెళ్లిన ఊరేగింపు అందరి దృష్టిని ఆకర్షించింది.

## 'తెలిసిన విలువలు'

'ఆడ, మగ భేదమున్నప్పటికి, మనో ప్రవృత్తులు, వయస్సు ప్రభావాలు, హృదయ స్పందనాలు, ఇద్దరికీ ఒకేరీతిగా ఉంటాయి. కాని రచనల్లో మాత్రం స్పష్టమైన తారతమ్యం కనిపిస్తుంది. యువతి, నింపాదిగా, స్థాయిగా ఆలోచించి, నిగ్రహశక్తితో రచనలు సాగిస్తే, అదే వయస్సులోని యువకుడు ప్రేమకలాపాల్లో విశృంఖలంగా ప్రవర్తిస్తాడు. ఇది ఒక్కొక్కరి ప్రత్యేకతేమోనని చెప్పచ్చేమొ గాని, నిజానికి ఈ కృత్రిమ నిగ్రహశక్తిని వదిలేసి, మహిళామణులు గూడా తమ రచనల్లోనూ, కవితలోనూ, వారి హృదయాల్లో రేగిన భావ పరంపరను, నిజాయితీగానూ, నిర్మొహమాటంగానూ, ప్రకటించాల్సిందే, కొంతమంది మగువలు నిర్భయంగా రచనలు సాగించినా, ప్రచురించటానికి మాత్రం సిగ్గు పడుతున్నట్లు కనిపిస్తుంది.' ఇది డాక్టరు బెజవాడ గోపాలరెడ్డిగారి అభిప్రాయం స్త్రీల రచనలను గురించి.

కాని డాక్టరు బూర్గుల రామకృష్ణారావుగారు మాత్రం స్వానుభవం వలన, పైదానికి విరుద్ధమైన అభిప్రాయం వెలిబుచ్చారు. ఈ మధ్య వస్తున్న రచనలు చూస్తే, వనితాలోకం, యేమాత్రం వెనుకబడలేదని, వారు కూడా, 'యువతీ యువకుల సమస్యల్లో' స్వేచ్ఛ గానూ, ఉత్సాహంతోనూ, ఆవేశంతోనూ, రచనలు సాగిస్తూనే ఉన్నారు. పైగా స్త్రీల రచనలే యెక్కువ వెలువడుతున్నాయి కూడా, అన్నారు. బహుశా గోపాలరెడ్డిగారు ఇలాంటి రచనలు చదివే ఉంటారని అనుమానాన్ని కూడా వెల్లడించారు.

అందరికీ అందుబాటులో ఉండే రచనలు చెయ్యాలంటారు. కాని కవితను గాని, రచనను గాని, అర్థం చేసుకోవటానికి, తగిన మనస్సు పరిపక్వం ఉన్నప్పుడే, దాని అనుభూతి పొంద కలుగుతారు. అన్నింటిలో వస్తున్న తీవ్రమైన పరిణామాలతో పాటు, సాహిత్యంలో గూడా, గత ఇరవై సంవత్సరాల్నుంచి చూస్తుంటే, ఎన్నో మార్పులు వచ్చాయి, మార్పు అనేది అభివృద్ధికి సూచన, ఇలాంటి చైతన్యానికి ప్రజలే బాధ్యులు. ఏది ఉత్తమ సాహిత్యం అనే విషయాన్ని కూడా ప్రజలే నిర్ణయిస్తారు. రచయిత చనిపోయిన యాభై ఏళ్ల తరువాత కూడా ఆయన రచనను గురించి చర్చించటం జరుగుతే, అది ఒక స్థాయికి వచ్చిన ఉత్తమ రచనని పరిగణించవచ్చు. ఈ నాడు మడుగులంటూ లేవు. అన్ని సెలయేర్లు, కాలవలు. అతి వేగంగా ప్రవాహం కొట్టుకుపోతూ ఉంటుంది. ఈ కాల ప్రవాహంలో ఎన్నో రచనలు కొట్టుకు పోతూ ఉంటాయి. అయితే రచనల్లో, నిజాయితీ, విశ్వాసం ఉండాలి. అంటే రచయితల్లో కూడానూ, ఈ అభిప్రాయాలు కూడా గోపాల రెడ్డి గారివే.

1961 సంవత్సరం జులై నెలలో 'తెలిసిన విలువలు' అనే పేరుతో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో, శ్రీమతి యద్దనపూడి సులోచనా రాణిగారి కథానిక ప్రచురింపబడింది. ఆ సంవత్సరంలో వివిధ పత్రికల్లో ప్రచురింపబడిన కథానికల్లో, ఆ కథానికను ఉత్తమమైన దాన్నిగా ఎన్నిక చేసి, నవ్యసాహితీ సమితివారు రచయిత్రికి నూటపదహారు రూపాయలు బహుమానం ప్రకటించారు. ఈ బహుమాన ప్రదానోత్సవంలో సాహితీ వేత్తలు, సాహితీ బంధువులు, సినిమా ప్రముఖులు ఇంకా ఇతర పెద్దలు విచ్చేశారు. పైన వెలిబుచ్చిన మాజీ 'ఆంధ్ర' ముఖ్యమంత్రుల అభిప్రాయాలు ఈ సందర్భంలోవే.

ఇక కృష్ణమీనన్‌గారు (మాజీ కేంద్ర మంత్రి) హైదరాబాదు వచ్చారు. రక్షణ మంత్రిత్వ శాఖ బాధ్యతలు వదిలి పోయినప్పటి నుంచి, న్యాయవాద వృత్తిని చేపట్టారు. వృత్తి ధర్మాన్నిబట్టి, అదివరకొకసారి ఇక్కడకు వచ్చారు. ఈసారి కూడా అదే పని మీద వచ్చినట్టున్నారు. అయినా సికింద్రాబాదు కాంగ్రెసువారు, బహిరంగసభ ఏర్పాటుచేసి ఆయన్ను తన అమూల్యమైన అభిప్రాయాలను వెలిబుచ్చమన్నారు. మహబూబ్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ సభకు చలికి వణుకుతూ ఉన్నాకూడా, ఆయన వాగ్ధాటి వినాలనే కుతూహలంతో చాలా మంది వచ్చారు. అనర్గళంగా, ఇంగ్లీషులో చేసిన ఆయన ఉపన్యాసం వింటానికి బాగానే ఉంది. ఈ దీపావళికి, కమ్యూనిస్టు చైనా, మన దేశం మీదికి వచ్చిపడి ఏడాదయింది. ఇంకా ఆ ప్రమాదం తొలిగిపోలేదని పెద్దలే హెచ్చరిస్తూ ఉంటారు. ఒకప్పుడు 'దండయాత్ర' సమయంలో ప్రముఖ పాత్ర వహించిన, మీనన్‌గారు, ఆ ప్రమాదాన్ని గురించి యేమైన చెపుతారేమో అనుకుంటే అదేమీ లేదు. ఆయన ఉపన్యాసం ఇంచుమించు కాంగ్రెసు సోషలిజాన్ని గురించి చెప్పటంతోనే సరిపోయింది. పైగా, 'నన్ను కొంతమంది కమ్యూనిస్టని అంటున్నారు. కాని నేను మాత్రం కమ్యూనిస్టును కాదు' అన్నారు.

ఆచార్య రంగాగారు, ఢిల్లీ వెళుతూ, ఇక్కడ మూడు రోజులపాటు ఆగారు. పత్రికా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, మన దేశ ఉత్తర సరిహద్దుల్లో, శత్రువుల ప్రమాదం ఇంకా ఏ మాత్రం తగ్గలేదు. కేవలం చైనా దేశమే మన మీద దండెత్తటానికి సిద్ధపడితే, మనం ఎదుర్కొని తరిమివేయగలం, కాని ఈనాడు మన మీద ఆకారణంగా వస్తున్నది కమ్యూనిస్టు చైనా అని మాత్రం గుర్తుంచుకోవాలి.

రైతు కూలీ ప్రజలను బానిసలుగా మార్చడమే గాకండా, భారత జాతి ప్రాథమిక పౌరసత్వ హక్కుల భంగపుచ్చే రాజ్యాంగ చట్ట 17వ సవరణను తీవ్రంగా ప్రతిఘటించాలని, అవసరమయితే ప్రత్యక్ష చర్య కూడా తీసుకోవల్సి వస్తుం

51 వ పేజీ చూడండి

# మనము - మన దేహస్థితి

## జీర్ణకోశంపై స్వచ్ఛందనరాశియు ప్రభావము

డా॥ గాలి బాలసుందరరావు

శరీరంలో గ్రంథులు స్యందించాలన్నా, కండరములు సంకోచ వ్యాకోచములు జరపాలన్నా స్పర్శేంద్రియము ద్వారా ఒక అనుభూతి మెదడుకు చేరాలి. మెదడులో సెన్సరీ భాగము దానిని మోటారు భాగానికి అందజేయాలి. మోటారు భాగము ఆ పరిస్థితులలో ఏ చర్య తీసుకోవాలో నిర్ణయించి తదనుగుణంగా గ్రంథులకో, కండరములకో ఆదేశం పంపాలి. అవి ఆ ఆదేశాన్ని అమలు జరపాలి. స్పర్శేంద్రియ భాగములు శరీరమంతటా వ్యాపించి ఉన్నవి. డాబామీద ఎక్కి వంగి చూస్తూ పడిపోబోతూంటే, కొన్ని కండరములలో టెండన్లలో ఉన్న స్పర్శేంద్రియ భాగములు, ఆ సంగతి మెదడుకు తెలియజేస్తవి. బాధ, శీతోష్ణస్థితి వ్యత్యాసములు, ఇది పావలా, ఇది రూపాయి అని చూడకుండానే తడిమి చెప్పగల అనుభూతులూ ఇవన్నీ చర్మంలో ఆరంభమవుతవి. మిగతావి శరీరంలో ఉంటవి. పిన్ను మింగితే, ఇక్కడ పిన్ను చేరిందన్న వార్త ప్రేగుల నుండి మెదడుకు పోదు. అంతరంగముల నుండి బాధానుభూతి మాత్రమే మెదడుకు చేరుతుంది. ప్రేగులను ముట్టుకున్నా సూది పెట్టి గ్రుచ్చినా ఏమీ తెలియదు. అది సాగినప్పుడో రక్తపుష్కలమై ఉబ్బినప్పుడో (Congestion) అక్కడ ఉండే నరములకు వత్తిడి తగిలి బాధ తెలుస్తుంది.

ఈ కార్యకలాపమును 'రిఫ్లెక్సు' అంటారు దీనిలో పాల్గొనే అంగ సముదాయమును "రిఫ్లెక్సు ఆర్క్" అంటారు. చిత్రంలో ఈ భాగములు చూపబడ్డవి.

మెదడులో గౌర వస్తువు (Gray Matter) బహిర్భాగములో ఉంటుంది. ధవళ వస్తువు అంతర్భాగంలో ఉంటుంది. మెడుల్లా ఆంబ్లాగేటాలో ఈ గౌరవ వస్తువు క్రమంగా కేంద్రగతమవుతుంది. ఎడమవైపున ఉన్న న్యూరానుల ఏగ్జానులు కుడివైపుకు పోయి అక్కడ ఉన్న న్యూరానుల కూడలితో సంధించుతవి. కుడివైపువి ఎడమవైపుకి పోతవి. ఇల్లా ఎందుకు జరుగుతుందో తెలియదు. సింపతెటిక్ దండలు, తిన్నగా పోయి పయామేటరులో అంతమౌతవి. వెన్నుపాములో గౌరభాగము 'H' ఆకారముగా ఏర్పడి ఉంటుంది. 'H' లో ముందు రెండు కొమ్ములూ, వెనుక రెండు కొమ్ములూ మధ్య గీత ఉంటవి గదా. ముందు కొమ్ములలో ఉండే న్యూరానులు మోటారు ఆదేశములను మెదడు నుంచి స్వీకరించి కండరములకూ గ్రంథులకూ పంపుతవి. వెనుక కొమ్ములలో ఉండే న్యూరానులు శరీరానుభూతులను (Sensations) సేకరించి తమ ఏగ్జానుల ద్వారా మెదడులో సెన్సరీ భాగానికి పంపుతవి. కుడిప్రక్క నుంచి వచ్చే అనుభూతి వార్తలు ఎడమ సెన్సరీ భాగానికి పోతవి. ఎడమ మోటారు భాగం నుంచి వచ్చే ఆదేశములు, వెన్నుపాములో కుడివైపున ఉండే ముందు కొమ్ముకు పోతవి. మధ్యలో ఉండే వంతెన వంటి భాగంలో నాళాకృతి గల ఖాళీ ప్రదేశము ఉన్నది. దీనిని 'సెంట్రల్ కెనాల్' అంటారు. మన ఋషులు దీనినే సుషుమ్న ద్వారము అంటారు. ఇంట్లో వివిధ భాగములకు పోయే ఎలక్ట్రిక్ తీగలు, కట్టలుగా ఏర్పడిపోయి నట్లు వివిధ వార్తలను తీసుకుపోయే నర తంతువులు కట్టలుగా ఏర్పడి గౌరభాగము చుట్టూ ఉంటవి. మెదడు ఆదేశములు, మెదడుకు చేరే వార్తలు ఇచ్ఛాధీన ప్రదేశముల నుండి రావచ్చు, అనిచ్ఛాధీన ప్రదేశములనుండి రావచ్చు. కాని, అనిచ్ఛాధీన భాగములకు పోయేవీ, వచ్చేవీ అయిన వార్తలు సింపతెటిక్ దండలో ఉన్న గేంగ్లియానులకు చేరి వాటి ద్వారా మెదడుతో సంబంధం కలిగిఉంటవి.


శరీర కార్యక్రమమంతా 'రిఫ్లెక్సు' ల ద్వారానే జరుగుతుంది. ఈ కార్యములు మనకు తెలిసి జరగవచ్చు. తెలియకుండానూ జరుగవచ్చును. కాని అధికంగా తెలియకుండానే జరిగిపోతూ ఉంటవి. ప్రక్కవారితో మాట్లాడుతూ పరాయత్తమైన మనస్సు గల కారు డ్రైవరు, కారు కడ్డం రాగానే తనకు తెలియకుండానే బ్రేకు వేస్తాడు. ఇది రిఫ్లెక్సు కార్యము. ఘుమఘుమలాడే తినుబండారము కంటబడగానే, చక్షురింద్రియం నుండీ, ఘ్రాణేంద్రియం నుండి ఆ వార్తలు మెదడుకు పోతవి. మన నోరూరుతుంది. ఇదీ మనకు తెలియకుండానే జరుగుతున్నది. వంటిమీద ఈగ వాలింది అది మనకు తెలిసి, చేతితో దానిని తోలేస్తాము.

జీర్ణకోశంలో జరిగే కార్యకలాపమంతా సింపతెటిక్ పేరా సింపతెటిక్ నరముల ద్వారా రిఫ్లెక్సుగానే జరిగిపోతున్నది. సింపతెటిక్ భాగములో వార్తా స్వీకరణము, ఆదేశము సింపతెటిక్ దండలో గేంగ్లియానుల ద్వారా జరుగుతుంది. పేరా సింపతెటిక్ నరము, ఏ శరీర భాగానికి తన ఆదేశమును అందజేయాలో ఆ భాగంలో ఉన్న గేంగ్లియానుకు సరాసరి పోతుంది. దాని ద్వారా వార్తలను అందజేస్తుంది, స్వీకరిస్తుంది. సింపతెటిక్ నరాగ్రములు 'సింపతిన్' (Sympathin) అనే పదార్థమును ఉత్పత్తి చేస్తవి. పేరా సింపతెటిక్ నరాగ్రములు "ఎసిట్యైల్ కోలిన్" (Acytyl choline) అనే పదార్థమును ఉత్పత్తి చేస్తవి. ఈ రెండూ వ్యతిరేక కార్యములను సాధిస్తవి.

మెదడు క్రింద పిట్యూయిటరీ అనే అనాళికా గ్రంథి ఉన్నది. అది అన్ని అనాళికా గ్రంథులకు రాజు వంటిది. దానిలో ఎడ్రినల్ గ్రంథిని ప్రేరేపించే హార్మోనులు తయారౌతవి. ఆ హార్మోను ప్రభావంచేత ఎడ్రినలిన్ గ్రంథి స్యందనములు అధికమౌతవి. ఎడ్రినల్ గ్రంథి స్యందనములు రక్తం ద్వారా పిట్యూయిటరీకి చేరినప్పుడు దాని స్యందనం అధికమౌతుంది. ఈవిధంగా అవి అన్యోన్యమూ సహకరించుకుంటూ పనిచేస్తవి. ఎడ్రినలిన్ గ్రంథి స్యందనము "సింపతిన్" శక్తిని అధికం చేస్తుంది.


ఇప్పుడు సింపతెటిక్ — పేరా సింపతెటిక్

54 వ పేజీ చూడండి



ఢిల్లీ దర్బార్:

# కంసకథ




వాకాటి పాండురంగరావ్...

"ఓరర్నీ బంగారుసామీ !" .... అని హర్షాతిశయంతో—కనాట్ ప్లేస్‌లో రీగల్ టాకీసు వద్ద నిల్చున్న క్రొత్తయ్య వీపు తట్టాడు. ఉండవిల్లివారి మూడో అబ్బాయి వీరవెంకట సత్యనారాయణసుందరం... ఒక (కాకపోతే ఇంకొక) నిముషకాలం క్రొత్తవాడి దేహం చుట్టూ ఒక పొర ఏర్పడింది. అతడికి ఈ విశాల మానవ ప్రపంచమంతా మసక మసకగా ఓ విధమయిన ఎరుపు రంగులో ఉన్నట్లనిపించింది.... కళ్ళు తిరుగుతున్నాయేమో నన్న భయం వచ్చింది క్రొత్తయ్యకు.

వీపు తట్టిన వీరసుందరం ఆ రెండు నిముషాలూ కాస్త అసింటా నిల్చుని .... మళ్ళీ నవి విస్తూ అడిగాడు— "ఏంవోయ్ .... ఏమిటిది ఇలా వచ్చావు ?"

క్రొత్తయ్య పాత మిత్రుడిని దేశ రాజధానిలో హఠాత్తుగా కలిసినందుకు మురిసిపోయి, తను ఏవిధంగా రెండు రోజుల ముందు, ఢిల్లీలోకి దిగుమతి అయిందీ వివరించాడు.

మాటల మధ్య అడిగాడు క్రొత్తయ్య : 'ఏమోయ్ ఉండవిల్లి ! ఇందాక నువ్వు నా వీపు తట్టావు గుర్తుందా, అప్పుడు నాకు అంతా మసక మసకగా కన్పించింది .... ఎందుకని, శైత్యం చేసిందంటావా?

“కాదురా అబ్బీ ! అది ధూళి ! ప్రసిద్ధి చెందిన ఢిల్లీ దుమ్ము !! నువ్వు పొద్దుటినుండి వీధులను కొలుస్తున్నావేమో, ఈ ఢిల్లీ మార్గ పరాగమంతా నీమీద ఓ రెండంగుళాల మందానికి పేరుకుపోయింది.... ఏం, నే నిలా ముట్టుకునేసరికి ఓ అయిదారు పొండ్ల పుప్పొడి విన్నాదిలి బయలుదేరింది. అదే ఆ పొగ. అందుకే ఆ మసక !—” అని ఆత్మ పరమాత్మల స్వరూపం భేదం వివరిస్తున్న ధోరణిలో చెప్పాడు ఉండవిల్లి.

అదీ ఇదీ అయింతర్వాత—“దాహమేస్తుందోయ్” అన్నాడు క్రొత్తయ్య.

భళ్లున ఢిల్లీ ఎండలా నవ్వాడు ఉండవిల్లి— “వెనకటి కెవడో కొండమీద కూర్చుని రాళ్లకోసం ఏడిచాట్ట ....” అన్నాడు.

క్రొత్తయ్య కేమీ అందలేదు.

“ఢిల్లీలో మంచినీళ్లు .... అందులోనూ ప్రియురాలి పరిష్వంగం లాంటి చల్లటి నీళ్లు నట్టనడి రోడ్డుమీద కూడా దొరుకును—” అని ప్రకటించాడు ఉండవిల్లి.

క్రొత్తయ్య దృష్టి నడిరోడ్డు మీదకు వెళ్లితే, తెల్లటి సున్నం గీతలు పలకరించాయి.

ఈలోపుగా ఉండవిల్లి ఒక బండి దగ్గర నిల్చుని “దో గ్లాస్ పానీ!” అన్నాడు. ఆ బండివాడు, తెల్లటి రేకు పెట్టెమీద ఉన్న ఒక బటన్‌ను నొక్కేసరికి— అంపశయ్యమీద ఉన్న భీష్ములవారికి అర్జునుడు బాణాలతో తెప్పించిన నీటి వూట లాటిది—గొట్టం గుండా గ్లాసులలోకి జారింది. ఆ హిమనీ నదోదకాన్ని ముదముతో గ్రోలినాడు క్రొత్తయ్య.

“అబ్బ ! ఢిల్లీవాళ్లెంత ఉదారులోయ్ ! వెనకటికి అశోకుడుడూ వగైరా మాత్రమే ఇలా మంచి నీళ్ల ఏర్పాటు చేశారు. మన దేశంలో—” అన్న క్రొత్తయ్య వాక్యం ముగియకుండానే ఉండవిల్లి ఇచ్చిన నాలుగు పైసలను బండివాడు పుచ్చుకోవడం కంటబడింది.

“పంతులూ ! ఇక్కడ అశోకు డెవడూ లేడు.... అంతా శోకుడూ, పోకుడూ మాత్రమే .... గ్లాసు నీళ్లు రెండు నయాపైసలు. కనుక మరీ తెనుగు వాడిలా ఆశ్చర్యపడకు ....” అని మందలించాడు ఉండవిల్లి.

“అయితే .... నీళ్లతో వ్యాపారమా !!?”

“ఆహా, బేషుగ్గానూ .... వీళ్లకి నెలకు సుమారు రెండు వందల రూపాయలు వస్తాయిట .... అందుచేత అలా మాటిమాటికీ ఆశ్చర్యపడిపోయి గుడ్లని బయట పెట్టకు. కళ్లకు మంచిదికాదు....”

.... ఎల్. డి. క్లర్కుగా తన జీతం కన్నా ఈ మొత్తం ఎక్కువే నన్పించింది క్రొత్తయ్యకి.

ఉండవిల్లి అడిగాడు—“అయితే మరి నువ్వుండడం ఎక్కడ ?”

“నేను కరోల్‌బాగ్‌లో మా మామయ్య ఇంట్లో దిగాను ప్రస్తుతానికి—”

“అయితే ప్రస్తుతానికేం .... అలానే అక్కడే ఉండిపోయి అన్ని ఏర్పాట్లూ చేసేసుకో .... అదృష్టం కలిసొచ్చిన వాడివోయ్ ... ఢిల్లీలో మామయ్యలు అందరికీ ఉంటారేమిటి ?” అని క్రొత్తయ్య వీపు మళ్లా తట్టాడు. ఈసారి ధూళి కొద్దిగా మాత్రమే రేగింది.

“అబ్బే .... మా మామయ్యకు పెళ్లి కాలేదోయ్ .... వాడూ నా వయస్సువాడే—” అని పెదవి విరిచాడు క్రొత్తయ్య.


“ఎట్టెట్టూ ? మీ మామయ్యకు పెళ్లి కాలేదన్నమాట .... అయితే కూతురు లేదన్నమాట—” అని చాల బాధపడ్డాడు. ఉండవిల్లి .... “సర్లే .... నువ్వేమిటి, టాంగావా, స్కూటరా, ఫట్‌ఫటియా?” అన్నాడు.

క్రొత్తయ్య బెదిరిపోయాడు.... “నే నదేదీ కాను నీ ఫ్రెండునిరా ! ఒరేయ్ .... గుర్తులేదూ ....”

“అహ్హ !” అని రాక్షసుడిలా నవ్వి ఉండవిల్లి వివరించాడు—” అరె భయ్యా ! నువ్వు ఇంటికి—అదిగో చూడు (ఆటోరిక్షాని చూపిస్తూ) అలాటి స్కూటర్ మీద వెళ్తావా, లేక ఇదిగో ఇప్పుడు భూకంపంతో వెళ్లిందే (అని నలుగురులు కూర్చోగల ఆటోరిక్షా లాటి దాన్ని చూపించి) ఆ “ఫట్ ఫటి” లో వెళ్తావా అని అడిగాను. టాంగా అంటే గుర్రపు బండన్న మాట !”

“అబ్బే ! .... నేను బస్సే !” అని విశ్లేషించి నవ్వేశాడు క్రొత్తయ్య ఢిల్లీవాసుడినన్న వాసనతో.

“అయితే సరేనోయ్ .... నేను నీకు రేపో ఎల్లుండో ఫోను చేస్తా .... ఏం ఆదివారం ఇండియా గేటుకేసి వెడదాం .....” అని క్రొత్తయ్య యొక్క ఆఫీసు ఫోన్ నెంబరు రాసుకుని— “జాగ్రత్త .... ఆరో



నెంబరో .... ఇరవైఏడో నెంబరో .... ఎక్కి .... కరోల్‌బాగ్ చేరుకో .... వస్తా—” అని వెళ్లిపోయాడు ఉండవిల్లి.

క్రొత్తయ్య నిదానంగా వెనక్కొచ్చి తా నెక్కవలసిన బస్సు నెంబరున్న ఒక బోర్డుని చూసి—దాన్ని అంటిపెట్టుకుని ఉన్న పొడుగాటి—కనీసం రెండు వందల మంది గల ‘క్యూ’ చివర చేరాడు. బస్సు క్యూలలో నిల్చుని నిల్చుని “ఎందుకొచ్చిన మనుష్య జన్మ ....” అని విసుగెత్తిపోయి చెట్లుగా మారినట్లుగా, ఎదుటివైపు వరుసగా నిలబడి ఉన్న నేరేడు చెట్ల నిండా మిలమిల లాడుతున్న పండ్లను చూశాడు క్రొత్తయ్య. లాలాజల గ్రంధులూ అవి అల్లరి మొదలెడితే—“ష్ .... ఇది రోడ్డు ! ఇది ఢిల్లీ !” అని మందలించాడు క్రొత్తయ్య .... “అటు చూడు .... బాగా చూడు !” అన్నాయి లాలాజల గ్రంధులు .... సూట్లు తొడుక్కున్నవారు, జరీ చీరలవారు, రాలిన నేరేడు పళ్లని ఏరుకుంటుండడం కనపడింది.

.... “సరేలెండి .... ఇపుడు మీమాట విని వాటి కోసం వెడితే బస్సు పోతుంది....నేను రేపు మీకో పావుశేరు కొనిపెడతాగా—” అని వాటిని బుజ్జగించాడు క్రొత్తయ్య.

పదిహేను నిమిషాల తర్వాత ఒక బస్సొచ్చింది. ఒకరో ఇద్దరో ముందువైపు నుండి దిగారు. ‘క్యూ’ కాస్తా ‘అక్యూ’ అయింది. జనం చీమల్లా, మిడతల్లా, శత్రువుమీదికి సైనికుల్లా ఎగబడ్డారు. భుజాలతో తోసేవాళ్లు, పీకలు మాత్రం లోపలికి జాచి రెండు చేతులతో ఈద జాచేవాళ్లు, మోచేత్తో గుంపుని పొడుస్తూ దారిచేయ యత్నించేవాళ్లు, కమ్ములు పట్టుకుని వేలాడుతూ గబ్బిలాలని గుర్తుకు తెచ్చేవాళ్లు .... అన్నిటికన్న ఆశ్చర్యం ఈ కోలాహలం గరిమనాభిలో ఉన్న ఆడవాళ్లు .... (అవును .... వాళ్లు ఆడవాళ్లే !)

ఈలోగా బస్సు కదిలింది.

చెట్టునించి రాలే ఆకుల్లాగా కొంతమంది క్రింద పడబోయారు. బస్సు గుమ్మంలో కాస్త ఖాళీ ఏర్పడినది చూచి వేగంగా పరుగెడుతున్న బస్సులోకి—అతి లాఘవంగా ఇద్దరెక్కారు. మూడోవాడెక్కపోగా బస్సు కండక్టర్ గురిచూచి కుడికాలిని బస్సు బయటి గాలిలోకి విసిరాడు. ఆ విసురుకు బస్సెక్కబోయిన మూడోవాడు బస్సెక్కడం మాని, రోడ్డుమీద నిలవబోయి, ఆపని చెయ్యలేక, రోడ్డు మీద తన పొడవును కొలచుకుని, లేచి బట్టలు దులుపుకుని, అప్పుడే లండన్ నుండి విమానంలో దిగినవాడిలా బోలెడు ప్రకాశవంతమైన చిరునవ్వుతో—‘అబ్బే ఇది మామూలే—’ అన్నట్లుగా నడిచివచ్చి మళ్లీ బ్రతికి నిల్చిన క్యూలోకి చేరాడు.

ఇంతా చేస్తే రెండు నిముషాలసేపు కాలేదు.

ఇదంతా చూసి సంభ్రమాశ్చర్యాందోళనాది రసాలలో తడిసి ముద్దయి చలికి వణకిపోతున్న క్రొత్తయ్యలోకి రెండు ప్రశ్నలు వచ్చాయి. (1) ఆవిధంగా ప్రయాణీకుల వైపు పాదాన్ని పంపే కండక్టర్ గొప్ప ఫుట్‌బాల్ ఆటగాడా ? (2) బస్సు కదిలాక ఆ వేగంలోనే బస్సులు ఎక్కడానికి యత్నించే ప్రయాణీకులు బహుశ సర్కసులో విద్యలు ప్రదర్శించేవాళ్లయి వుంటారా ?

ఈ ప్రశ్నలు అతడిని వేధిస్తుండగానే ఒక్కుమ్మడిగా నాలుగు బస్సులు రావడంతో ‘క్యూ’ అంతా కరిగిపోయింది. క్రొత్తయ్య కూడా ఒకదానిలో ఇరుక్కుని, ‘సత్రా’ పైసా లిచ్చి కరోల్‌బాగ్ చేరాడు. ఇంటికి వెళుతూ దారిలో తినుబండారాలమ్మే బళ్ల చుట్టూ, ‘నాగరీకులు’ నిల్చుని నానా రకాల గ్రాసవహా మేస్తూండడం గమనించాడు. “ఓహో .... వీళ్లిలా తిండి ఎక్కువగా వీధుల్లో తింటారు గనుకనే—ఈ ఊరి ఇళ్లల్లో వంటగది చాల చిన్నదిగా, మనవైపంతటి ప్రాముఖ్యం లేనిదిగా—ఉంటుంది....” అన్న ధియరీ చాల రోజుల తర్వాత మెరిసింది క్రొత్తయ్య మెదడులో.

సరే, ప్రస్తుతానికి ఇల్లు చేరాడు క్రొత్తయ్య.


రెండంతస్తుల మేడమీది హాటాలో ఉంటున్నాడు క్రొత్తయ్య వాళ్ల మామయ్య అనబడే చలపతిరావు. ఆ అరవైమూడు మెట్లూ ఎక్కి గది చేరేసరికి ఆయాసం వచ్చింది. క్రొత్తయ్యకు.... “వెధవ గదులూ వీళ్లూను—” అని తిట్టుకున్నాడు. ఇలాటి డాబామీది గదుల్ని ఈ ఊళ్లో “బర్సాతీ” అంటారట. ‘బర్సాత్’ అంటే వర్షం కదూ, వర్షం వస్తే మామూలుగా ఈ గదులు చిన్నసైజు వెనిస్ నగరంలా అయిపోతాయి. అందులోనూ ఈ ఊళ్లో గదుల గుమ్మాలకు ‘గడప’ ఉండవు .... కనక వర్షపునీరు గదిలోకి బయటికి

# కంసకథ

నిరాటంకంగా, పుట్టింటి కొచ్చిన ఆడకూతురిలా తిరుగుతుంటుంది. సరే .... 'గడప' అంటూ ఉండదు గనుక ప్రక్కింటబ్బాయితో లేచిపోతున్న కూతురిని ఉరిమిచూస్తూ—"మళ్ళీ నా గడప తొక్కకు! ...." అని తండ్రిగారు కోప్పడే డైలాగులకు ఇక్కడ అవకాశం తక్కువ....

....అని ఆలోచిస్తున్న క్రొత్తయ్య కంటికి—ఎదురింటి క్రిందివాటా గుమ్మంలో నిల్చుని తల దువ్వుకుంటున "ఏకవీర" కన్పించింది. మామూలుగా ఆవిడ కిటికీదగ్గర కనపడుతుంది. లేదా, జుట్టు దువ్వుకోవడానికి ఇంట్లో చోటే లేనట్లుగా, జుట్టు విరబోసుకుని వీధిలోకి వచ్చి నిల్చుంటుంది. ఓ అర ఘంటలో ఆ పని ముగించి, మొహం కడుక్కుని, పౌడరద్ది, తిలకం దిద్ది ఇస్త్రీ చీర కట్టి పువ్వులా నిల్చుంటుంది రోజూ సాయంకాలం .... అంతే అలా రాత్రి ఎనిమిది గంటలకు ఆమె భర్త (అదేం ఉద్యోగమో ఆ మానవుడికి) .... వచ్చేదాక ఆమె అలా గుమ్మాని కివతల నిల్చుని ఉంటుంది ఒంటరిగా .... అందుకని రిఫరెన్సు నిమిత్తం ఆవిడకు 'ఏకవీర' అని పేరు పెట్టాడు చలపతి. ఈ నామకరణం పద్ధతి అదీ ఆలోచిస్తున్న క్రొత్తయ్యకు నవ్వొచ్చింది. 'ఫక్కు' మని శబ్దం వినిపిస్తే ప్రక్కకు తిరిగి చూచాడు.

పైజామా మీద గళ్ళ చొక్కా వేసుకున్న



పంజాబీ పిల్ల ప్రక్క డాబామీద నిల్చుని జుత్తు ఆరబెట్టుకుంటోంది.

గొంతు సరిచేసుకుని మెడ విదిలించుకుని గది తాళం తీసి లోపలికి అడుగుపెట్టాడు క్రొత్తయ్య. గది బయట గుమ్మం దగ్గర ఉన్న పాలసీసా అందుకని, దాని కాగితం మూతని చింపివేసి గిన్నెలోకి పాలు పోశాడు. మంచి మనసు పలికిన మాటలా ఉన్నాయి గిన్నెలోని పాలు. స్టవ్ వెలిగించాడు. పాలు కాగేలోగా స్నానం చేసి బట్టలు మార్చుకున్నాడు. అవును మరి .... ఢిల్లీలో రోజుకు కనీసం రెండు స్నానాలన్నా చేయాలి. లేకపోతే ఒళ్ళు అనబడే దేహం ఉంది చూశారూ—అది చింతపండు బస్తాలా ఉంటుంది. సంవత్సరంలో ఆరు నెలలు ఇట్లా అయితే మిగతా ఆరు నెలలూ ఉల్లిపాయమీది పొరల్లాగా బనియనుమీద చొక్కామీద, స్వెట్టర్ మీద కోటు తొడిగినా తొడగాల్సి వస్తుంది. అది చలికాలం. అప్పు డిహ ప్యూనేమిటి, ప్రధాన మంత్రేమిటి—అందరూ ఉలెన్ సూట్లు తొడిగేవాళ్లే! అంటే చలికాలంలో బట్టలని బట్టి వాడు 'వీడు' అనుకోవడానికి వీలులేదన్నమాట. అనగా శీతాకాలము సోషలిస్టు వ్యవస్థకు చాలా అనుకూలమయినది.—అని సిద్ధాంతీకరించ వచ్చును.... అనుకుంటూ కాఫీ త్రాగాడు క్రొత్తయ్య. రేడియో పెట్టుకున్నాడు. జీర జీరగా గోల గోలగా హైదరాబాద్ స్టేషన్ వినపడింది. అమ్మయ్య! తెనుగు మాట వినపడుతూంది.—అదే పదివేలు—అని మురిశాడు తెనుగు గడ్డని విడిచి వారమయినా కాని తెనుగుబిడ్డ.

ఈలోగా బూట్లు టకటక లాడించుకుంటూ చలపతి వచ్చేశాడు..... "ఏరా! కంసుడూ! ఏవి టేవిటి చూశావ్ ఈవేళ?" అని అడుగుతూ.

(క్రొత్తయ్య యొక్క అసలు పేరు కందాళ పాలెం సుబ్బరామయ్య. ఆ పేరులోని రెండు పదాల మొదటి అక్షరాలను కలిపేసి 'కంసు' డన్నాడు పేర్లు పెట్టటంలో అసమాన ప్రజ్ఞా ధురీణుడయిన చలపతి. ఈ విషయంలో ఇంచుమించు 'పోస్టు గ్రాడ్యుయేటు' స్థాయి నందుకున్న చలపతి ప్రతిభా సంపత్తికి మరి రెండు ఉదాహరణలు,—ఆఫీసు టైపిస్టు గాయత్రిని 'జందెప్పోగు' అని పిలవడమూ, ధర్మపత్నిని ఢిల్లీలో 'ఢిరోమపత్ని' అనాలని సూచించడమూను.)

నావుడు. కంసు డిట్లనియె.

"పొద్దున్న కుతుబ్‌ని చూచి ఆఫీసు చేరాను. సాయంకాలం ఆఫీసు దగ్గరగా అదేదో భవన్‌లో చిత్రకళా ప్రదర్శన్ ఉంటే వెళ్ళి వచ్చాను.

"ఇదిగో అబ్బాయ్! .... పోస్టాఫీసు పనులు, బాకీలకు వెళ్ళడాలు, టెలిఫోన్ పిలుపులు, చిత్రకళా ప్రదర్శనాలు .... లాటి వన్నీ ముగించడాని కెప్పుడూ కెప్పుడూ కూడా నీ టైముని వృథా చెయ్యకు .... ఆ కార్యా లన్నిటికినీ ఆఫీసు టైమునే వాడుము... అదీ ఇక్కడి ఆనవాయితీ ...." అని సూతుడి తాతలా చెప్పాడు చలపతి.

కంసుడు నవ్వాడు.

వెంటనే 'ఠాప్'మని చప్పుడయింది. ఉలిక్కిపడ్డాడు కంసుడు.

చలపతి చిరునవ్వేసి—"వత్సా! భయంపడకుము .... ఇవ్వాళ గురువారం కదూ, వార పత్రిక వచ్చి ఉంటుంది—" అని వివరించాడు.

"వారపత్రిక మా ఊళ్లో ఇంత చప్పుడు చెయ్యదే ..... ?" అన్న సందేహం వెలిబుచ్చాడు కంసుడు.

"వారపత్రిక చాల మంచిది. ఏ ఊళ్ళోనూ చప్పుడు 'చెయ్యదు' కాని, ఈ ఊళ్లో మాత్రం చప్పుడుతో 'వస్తుంది'—" అని వీధి వరాండాలో కెళ్లి వారపత్రికను తెచ్చాడు చలపతి. వారపత్రిక చుట్టగా చుట్టబడి ఉంది. దాని చుట్టూ చిన్న జనపనార బంధం ఉంది.

"ఇది చూశావా .... ఇలా గొట్టంలా కట్టేసి 'వార' కాదు, 'దిన' కాదు 'మాసిక', 'వార్షికా' ల్ని కూడా గ్రెనేడ్లు బాంబులు విసిరినట్లు వీధిలోంచి రెండంతస్థుల మీదికి విసిరేస్తాడు పేపరువాడు. వాడి ఆ నైపుణ్యం, ఆవేగం, ఆ గురి, ఎంత అద్భుతమైనవంటే .... చూడ చక్కని శివితో, రాములవారి బాణంలా, బెంగాలీ అమ్మాయి చూపులా ఏటవాలుగా వచ్చి గబుక్కున ఆ మేడ గోడను దాటి మన గది గుమ్మం ముందర—(వన్స్ అగైన్—) రాములవారి పాదాల దగ్గర అహల్య వలె—పడుతుంది పత్రిక. అదీ ఆ చప్పుడు—!!"

అంతకంతకూ పుంతలుగా వర్షిస్తున్న ఢిల్లీ వింతల క్రింద ఊపిరాడదేమో నన్పించింది కంసుడికి. మామూలు విషయం ఏదయినా మాటాడితే కొంత గాలి ఆడుతుందేమో ననిపించింది.

"ఏరా చలపతీ! రాత్రి సత్యజిత్‌రాయ్ సినిమా ఉంటుందిట .... వెళ్దామా—?" అని అడిగాడు.

"సత్యజిత్‌రాయా? చూడాల్సిందే కాని .... ఇవ్వాళ ఏం వారం, గురువారం కదూ .... రాను .... నేను గురువారం రాత్రిళ్ళు ఎక్కడికీ రాను...."

"ఏం ... సాయిబాబా భక్తుడివా?" అని అడిగాడు కంసుడు.

"అబ్బే .... అదేమీ కాదు. నేను అందానికి మాత్రమే భక్తుడిని, ఆనందం మాత్రమే భుక్తిగా కలవాడిని....." అని అదేదో ధోరణిలోకి పడబోయి తట్టుకుని—"అబ్బే! అది కాదోయ్.... గురువారం రాత్రిళ్లు నేను పాంట్లకూ, చొక్కాలకు బొత్తాలు కుట్టుకోవాలి!"

కంసుడి భ్రుకుటి ముడివడింది.

"అవునోయ్ కంసా! ఈ ఊళ్లో చాకలాళ్లకూ బొత్తాలకూ పడదు. ఎంత పడదూ అంటే—ఆంధ్రులకూ, ఐకమత్యానికీ ఎంత పడదో, అంత పడదు. వారానికి పది బట్టలు చాకలాడికి వేస్తావనుకో. సగటున పది 'ఇన్‌టూ' రెండు—కనీసం ఇరవై బొత్తాలయినా పోతాయి. ఒకవేళ పోకుండా ఉన్నాయా అంటే అవి బటన్లలా ఉండవు. అటుకు లుంటాయి చూశావూ అటుకులు—అల్లా ఉంటాయి. ముట్టుకుంటే ముక్కలయిపోతాయి. అంచేత ఈ బెడద లెదుర్కోడానికని .... వారంలో ఒకరోజు రెండు గంటలసేపు బొత్తాల పునరుద్ధరణకు కేటాయించాను. అది ఇవ్వాళే!" అని సూది దారం ఉండ, బొత్తాలు, కత్తెర తెచ్చుకుని దుకాణం తెరిచాడు చలపతి.

కంసుడు నిట్టూర్పు విడవబోయి — అటువంటి గొప్ప సన్నివేశానికి కేవలం నిట్టూర్పు లాటిది చాల అమర్యాదకరంగా ఉంటుందనుకుని వీధి వరండాలోకి వెళ్లి నిల్చున్నాడు. 'ఏకవీర' కూరలు బేరమాడతూంది. ఎదురింటి మేడమీది నాటాలో ఒకమ్మాయి టేబిలుమీద కాళ్ళుంచి చదువుకుంటూంది. ఇంకా వెనకాల ఆ అమ్మాయి అక్కయ్య కాబోలు వంటచేస్తున్నట్లుంది. పక్కింటి పంజాబీ పిల్ల ట్రాన్సిస్టర్ రేడియోతో బాటు కూనిరాగాలు తీస్తూ డాబామీద విహరిస్తూంది. .... ఎంతసేపూ — ఈ వెధవ దృష్టికి అమ్మాయిలే గాని మరోటి కనపడదేం అని తన బల

42 వ పేజీ చూడండి



# కార్తీక దీపోత్సవం

వ్యాసం: ఎస్. ఆర్. రాజమ్మ
ఫొటోలు: ఎస్. రామకృష్ణ


ఎవరన్నా 'అన్నామలైకు అరోహరా' అని అంటే వెంటనే 'తిరువన్నామలై' స్థలమే స్ఫురిస్తుంది. ఉత్తర ఆర్కాటులో ఉన్న ఈ స్థలం చాలా చరిత్ర ప్రసిద్ధమైంది, పురాణసిద్ధమైందీ కూడా. కథావైభవ ప్రదాతలైన చోళ రాజేంద్రులు మొదట ఈ ప్రదేశాన్ని పరిపాలించారు. వారి తర్వాత విద్యానగర సామ్రాజ్యం, ఆ తదుపరి మహమ్మదీయుల పరిపాలనలోకి వచ్చింది. టిప్పుసుల్తాను తర్వాత బ్రిటిషువారు ఈ ప్రాంతంమీద అధికారాన్ని భుక్తం చేసుకున్నారు. ఇలా అధిపతులు గద్దె లెక్కుతూ, మారుతూ వచ్చినా అనాదినుండీ ఈనాటి వరకూ కూడా యాత్రికుల రాకపోకలలోను, క్షేత్ర మాహాత్మ్యంలోను ఏవిధమైన చలనమూ లేకుండా నిలచిన పుణ్యక్షేత్రం ఇది.

సుమారు 2600 అడుగుల ఎత్తుగల కొండ అడుగుభాగంలోనే అరుణాచలేశ్వరుని దేవాలయం ఉంది. కొండమీద ఒక చదునైన ప్రదేశం (ప్లాట్ ఫారం) తప్ప వేరే ఏమీ ఉండదు. ఈ చోటులోనే కార్తీకమాసం పండుగనాడు కార్తీక దీపం వెలిగిస్తారు.

దక్షిణదేశంలో ఉన్న అతి ప్రసిద్ధమైన, పెద్ద దేవాలయాల్లో తిరువణ్ణామలై దేవాలయం ఒకటి. సుమారు 25 ఎకరాల ప్రదేశంలో ఉన్న ఈ దేవాలయ గాలిగోపురం ఎత్తు 130 అడుగులు. ఇంక చుట్టూ ఉండే ప్రహరీ గోడలు చాలా బలిష్ఠమైనవి కూడా. ఎంతో పథకంవేసి నిర్మించారు ఈ దేవాలయాన్ని.

పంచభూత స్థలాల్లో తిరువణ్ణామలై ఒకటి. ఇక్కడి దేవాలయంలో ఉండేది జ్యోతిర్లింగం. జ్యోతి అంటే అగ్ని అన్నమాట. ఆ అగ్నికి ప్రతిరూపమే ఈ అరుణాచలమని అంటూంటారు. దీన్ని గూర్చి చాలా ప్రసిద్ధమైన పురాణ కథ ఒకటి ఉంది. ఒకప్పుడు బ్రహ్మ, విష్ణువులలో ఎవరు గొప్ప అనే వివాదం వచ్చి ఏదీ తేలక ఈశ్వరుని దగ్గరకు వెళ్లారుట. తన శిరస్సు పాదాలు ఎక్కడ ఉన్నవో ఎవరు ముందు కనుక్కోగలిగితే వాళ్ళు గొప్ప అని శివుడు తీర్పు చెప్పాడట. విష్ణువు వన్య వరాహ రూపంలో అధోభాగానికి వెళ్లగా బ్రహ్మ హంస రూపం ధరించి ఊర్ధ్వ భాగానికి, వెళ్లాడుట. పరమశివుని పాదాలెక్కడో కనుక్కోలేని విష్ణువు ఓటమి ఒప్పుకోగా, ఊర్ధ్వభాగానికి వెళ్లిన బ్రహ్మ శివ శిరోభాగం నుంచి పడిన మొగలిపువ్వును చేతోపట్టుకుని శివుని దగ్గరకు వచ్చి అది కనుక్కున్నానని అబద్ధం చెప్పాడుట. శివునికి కోపంవచ్చి అసత్యదోషానికి బ్రహ్మకు ఆలయ పూజ లేకుండాను, తప్పు సాక్ష్యానికి మొగలిపువ్వును శివపూజ కనర్హంగాను శపించాడట. నిజాన్ని ఒప్పుకున్న విష్ణువునే గొప్పవాడని నిర్ణయించటం జరిగింది. ఈ ఉభయుల పోటీకి పరిష్కర్త అయిన శివుని స్థాణురూపము ఇప్పటి అరుణాచలంట. లోని అగ్నితీవ్రతవల్ల అనేక యుగాలుగా కరిగి కరిగి పలు లోహ మిశ్రితంగా మారి ఇప్పటి చిన్న కొండ రూపంలోకి వచ్చిందిట. తర్వాత దేవతలు, ఋషులు నిజరూపం ధరించమని ప్రార్థించగా శివుడు వారి ప్రార్థనను అంగీకరించాడట.

ఈ కార్తీక పర్వదినంనాడు తిరువణ్ణామలై, అంతటా 'దీపోత్సవం' జరుగుతుంది. భారత దేశంలో ఏ ప్రాంతంలోనూ కూడా ఇంతటి బ్రహ్మాండమైన దీపోత్సవం జరగదంటే అతిశయోక్తి ఏమీలేదు. కొండ పైభాగాన ఒక పెద్ద కంచు ప్రమిద ఒకటి ఉంది. దేశంలో నలుమూలలనుండి వచ్చిన భక్తులు ఇచ్చే నెయ్యి కర్పూరాలతో ఆ ప్రమిదను నింపుతారు. పెద్ద పెద్ద వత్తులు తయారుచేసి ఈ నేతి ప్రమిదలో వేసి తడుపుతారు. వాన, వరద, ఎండా, వేడి ఏమైనా సరే ఈ దీపోత్సవం ఆగటమంటూ జరగనే జరగదు. నిర్ణీతమైన రోజున ఒక వ్యక్తి కొండమీదికి వెళ్తారు. కింద దేవాలయం దగ్గర బాణాసంచా కాల్పు ఆరంభం కాగానే కొండమీద ఉన్న వ్యక్తి ఆ పవిత్ర జ్యోతిని వెలిగిస్తాడు. ఈ జ్యోతి కొన్ని రోజులపాటు అలా వెలుగుతూనే ఉంటుంది. చాలా దూరానికూడా కన్పిస్తుంది. అందమైన తయారీలలో తిరువణ్ణామలై రథం ఒకటని చెప్తారు. పది రోజులపాటు జరిగే ఈ దీపోత్సవం వేడుకలలో ఆ బ్రహ్మాండమైన రథంమీద స్వామికి పూరే



కార్తీకదీపం పెట్టే కొండమీద నుంచి తిరువణ్ణామలై గుడి గోపురాల దృశ్యం.

గింపు జరుపుతారు. అంతేకాక కార్తీక దీపం వెలిగేనాడు దేవాలయంలోని 14 అంతస్థుల గోపురంను నూనె దీపాలతో అలంకరిస్తారు. ఆ దీపాల మిణుకు మిణుకు మంటూ మెరుస్తూఉంటే చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంటుంది. యాత్రికులకు స్నానాది సౌకర్యాలకోసం పెద్ద కోనేరు కూడా ఉంది.

పవిత్రమైన పుణ్యక్షేత్రాల్లో తిరువణ్ణామలై ఒకటి. మాణిక్యవాచగర్, తిరునావుక్కరసర్, తిరుంగణ సంబందర్, సెక్కిజార్, అరుణగిరినాథర్ మొదలగు మహాభక్తులు వాగ్గేయకారకులూ ఎంతో మంది అణ్ణామలై నాథుని, ఉన్నాములై అమ్మ వారిని ఎన్నో రకాలుగా స్తుతించారు. దేవాలయం లోని ఒక గోపురంమీద నుంచి అరుణగిరి నాథుడు దూకగా కుమారస్వామి రక్షించినట్లు చెప్తారు. ఆయన భగవంతుని స్తుతిస్తూ ఎంతో చక్కని 'తిరుప్పాగళ్' రచించారు.

ఇటీవలి సంవత్సరాలలో తిరువణ్ణామలైకు ఇది వరకుకన్నా భక్తుల రాకపోకలు ఎక్కువయ్యాయి. కారణమేమంటే ప్రసిద్ధమైన రమణమహర్షి ఆశ్రమం ఇక్కడనే ఉంది. ఈ దేవాలయంలో పాతాళలింగం సన్నిధి అనే చోటు ఒకటి దేవాలయంలో ఉంది. రమణమహర్షి కొండమీద చాలా సంవత్సరా లున్నవీదట, ఈ ప్రదేశంలోనే ఆయనకు ఆత్మసాక్షాత్కారం కలిగిందట. ఆ మహాపురుషుడు ఊరికి కొద్ది దూరంలో రమణాశ్రమం అన్న దాన్ని స్థాపించాడు. కాలం అజేయమైంది! అవ్యక్తి వ్యక్తి భౌతికంగా అచోట ఈనాడు లేకపోయినా దేశం నలుమూలలనుండి వేలాది ప్రజలు ఆయన నివసించిన ప్రదేశాన్ని, వాడిన వస్తువులను సందర్శించి వెళ్ళేందుకు వస్తూఉంటారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న పాతాళలింగ గుహను ఇటీవలనే మరమ్మతు చేశారు. ఆ ప్రాంగణంలో ఉన్న అతి ముఖ్య ప్రదేశాలలో అదీ ఒకటి.

దక్షిణ భారతదేశంలో వర్తక వ్యవస్థకు చెందిన నాగరాథర్‌లు, దేవాలయంలో ఇటీవల జరిగిన కొత్త కట్టడాలకు తోడ్పడుతున్నారు. ప్రతి ఏడూ కార్తీక దీపోత్సవంకు వేలాది సంఖ్యలో వీరు వస్తుంటారు.

అయితే ఈ కార్తీక ఉత్సవం కేవలం దేవాలయంలో మాత్రమే జరుగదు. ఇంటింటా కూడా దీపోత్సవమే. వందలకొద్ది ప్రమిదల దీపాలతో ఇళ్లన్నీ అలంకరిస్తారు. బాణాసంచా ప్రేలుడులతో ఎంతో హంగామాగా, ఆనందంగా పది రోజులపాటు ఈ దీపోత్సవాలు నిత్య దీపావళి అనిపిస్తాయి. ★



# వనితావాణి

## సానుభూతి

"ఉప్పులూరి దుర్గాంబ"గారు వ్రాసిన 'సానుభూతి' వ్యాసం చదివాము. చాలా బావుంది. ఏ వ్యక్తికైనా తను చేసిన తప్పును క్షమించి సానుభూతి కనపరిస్తే ఆ వ్యక్తికి చాలా ఆనందముగా ఉంటుంది. ఇక జీవితంలో తప్పులు చేయకూడదు అన్పిస్తుంది. కాబట్టి ప్రతి వ్యక్తికి సానుభూతి అవసరము. ఏ స్త్రీకైన ఎన్ని పనులుచేసినా కాస్త సానుభూతి చూపిస్తే తన కష్టాన్ని మరచిపోతుంది. రచయిత్రి చాలా బాగా వ్రాశారు.

కుమారి ప్రసూన, కుమారి లక్ష్మి (పెనరమిల్లి)

*　*　*

ఈమధ్య స్త్రీలకు సంబంధించిన సాంఘిక సమస్యలపై వ్యాసములు తక్కువగా వచ్చుచున్నవి. 'వనితాలోకం' శీర్షిక క్రింద ముఖ్యముగా కాలేజీ విద్యార్థినులు, కాలేజీలో ఎదుర్కొనే సమస్యలపైన ఒక వ్యాసమును ప్రచురిస్తే బాగుంటుంది. దాని వల్ల విద్యార్థులు తమ ప్రవర్తనయినా మార్చుకుంటే బాగుండగలదు.

కు. ఉషాహేమచందర్ (హైదరాబాద్)

## గరల్స్ హైస్కూళ్ళు

నిర్మల ప్రభావతిగారి వ్యాసము "గరల్స్ హైస్కూళ్ళ"ను శ్రీ డి.జయమ్మ 18–10–63 సంచికలో విమర్శించిన విధానము చాలా సమయోచితంగా, సబబుగానే ఉన్నది. కాని మధ్యమధ్య వారు "మగవాళ్ల స్కూలు" ను ప్రస్తావించిన విధానం "…. ఆ పాఠశాలల అధికార్లు కూడా మగవాళ్ళే కాబట్టి వారికి పుస్తకాలు అవీ చూచే అలవాటుండదు. శుభ్రతకు ప్రాముఖ్యం అక్కడ తక్కువ" అని వ్రాసిన తీరు అభ్యంతరకరంగా ఉన్నది. "గరల్సు హైస్కూళ్లను గురించి గోరంతలు కొండంతలు చేయటం" విని "చింతిస్తున్న" జయమ్మగారు స్వయంగా "మగవాళ్ల స్కూలు" గురించి తెలిసిన విధంగా చెప్పటంలో గల ఉద్దేశ్యం అర్థం కావటం లేదు. బహుశః వారికి స్త్రీజాతిపై గల పక్షపాతము కావచ్చును.

గీట్ల జనార్ధనరెడ్డి,
(ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యాపక సంఘము, కరింనగర్ జిల్లా.)

*　*　*

మా వూరి గరల్స్ హైస్కూల్ కూడ ఆమె వ్రాసిన విషయాల్లో ఒక్కదానికి కూడ తీసిపోదు. బుక్స్ కొనిపించటంలో, కుట్ల విషయంలో నేమి ఆమె నిజంగా మా వూరు స్కూల్ కనులారా చూచి వ్రాశారా అని అనిపిస్తోంది. ముఖ్యంగా ఈమధ్య ప్లాస్టిక్ వైర్స్‌తో బ్యాగ్‌లు అల్లకం ప్రతి వూళ్లో వ్యాపించింది. అది ఏదో హైయ్యర్ ఫారమ్స్ వాళ్ల చేత అల్లించారంటే అర్థముంది. కాని ఎలిమెంటరీ క్లాసువాళ్లచేత ఆ వైర్ బాగులు కంపల్సరీగా అల్లాలని వత్తిడిచేస్తే ఆ పిల్లలు పెద్దవాళ్ల ప్రాణాలు. తోడి(ఆ వైర్‌కట్ట సుమారు రు. 1—50 ఉంటుంది) డబ్బు తీసుకొని వెళ్లి వైర్లుకొని బ్యాగ్‌లు అల్లటం చేతకాక వైర్ కాస్తా సాగదీసి దాని అటు ఇటు వేస్టుచేసి చివరికి ఇంట్లో పెద్దవాళ్లచేత అల్లించి తీసికెళ్లి ఆ టీచరు మెప్పు పొందితే గాని మర్నాడు వాళ్లకు స్కూల్‌కెళ్లే అర్హత లేనంతగా బాధ పెట్టారు. ఆ టీచర్సు పిల్లల్ని, ఈ రోజుల్లో పిల్లలకు చదువులు సరిగా రాకపోయినా బుక్స్‌కనీ, పెన్సిళ్లు, పెన్నులకనీ, అల్లికలు, కుట్లకనీ, ఇక పోతే డ్రస్సులకని ఎక్కడ లేని డబ్బు హరించుకు పోవటమేగానీ వేరే ప్రయోజన మేమీ కన్పించటంలేదు.

ఒక సోదరి (బాపట్ల)

*　*　*

నేటి గరల్స్ హైస్కూళ్లలో జరుగుచున్న ఈ విపరీతపు సమస్యలను తట్టుకొనలేక తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను చదివించుటకు ఎంతో బాధపడుచున్నారు. ప్రభావతిగా రన్నట్లు టీచర్సు అందరూ అట్లు ఉండటము లేదుగాని, కొంతమంది మట్టుకు యదార్థముగా ఆమె వ్రాసిన రీతిగా ప్రవర్తిస్తూ పిల్లల, మనస్తత్వాలను, వేరు చేయుచూ ప్రవర్తిస్తున్నారు.


మానుకొండ భానుమతి (రామచంద్రపురం)

# వంటలు

## నువ్వులు పప్పుతో ఉండలు

| | |
|---|---|
| నువ్వులు | 1 అఠాను |
| బెల్లం | 3 ఔన్సులు |
| నీళ్ళు | కాసిని |

ఇందుకు ఉపయోగించే నువ్వులు నల్లవైనట్లయితే వాటిని నీళ్ళలో వేసి సుమారు రెండు గంటలపాటు నాన వెయ్యాలి. బాగా కడిగి పై పొట్టు తీసివెయ్యాలి. వేపుడు కుపయోగించే పళ్లెంలో ఈ నువ్వులు ఓ గుప్పెడు వేసి గోధుమవర్ణం వచ్చేదాకా వేయించాలి. సరిగా వేగినట్లు గుర్తుగా చక్కని వాసనవస్తుంది. తర్వాత ఈ నువ్వులు చేతిలో తీసుకుని రుద్దితే పై పొట్టు అంతా ఊడిపోతుంది. బెల్లం మెత్తగాకొట్టి అందులో కాసిని నీళ్ళుపోసి ముద్దకు వీలయ్యే పాకం వచ్చేదాకా కాచాలి. అందులో ఈ పొట్టు తీసిన నువ్వులువేసి బాగా కలియబెట్టాలి. తర్వాత వీటిని నిమ్మకాయ సైజులో ఉండలు చేసుకోవాలి. ఇష్టమున్నవారు అచ్చుపోసినట్టు ఆరబెట్టి చిన్నచిన్న ముక్కలుగా కోసుకోవచ్చు. ★



# మనిషి-మిథ్య

ఆదివిష్ణు

### జరిగిన కథ

జానకిరామయ్య రిటైరైన బడిపంతులు. ఆయనకు నిరంజనం, శంకరం, సుశీల అని ముగ్గురు సంతానం. శంకరం ఉద్యోగ ప్రయత్నంలో వుంటాడు. జానకిరామయ్య సుశీల పెళ్ళిగురించి ఆలోచిస్తూ వుంటాడు. ఉద్యోగం కోసం మిత్రుడు రంగారావు ఇంటికి వెళ్ళిన శంకరం ఆ దంపతులు ప్రవర్తన నచ్చక ఇంటికి వచ్చేస్తాడు. మామగారు తనపై అధికారం చెలాయిస్తున్నాడని నిరంజనం బాధపడ్తాడు.

## 6

శంకరంతోపాటు మరో ముగ్గురికి ఆ ఆఫీసులో ఉద్యోగం దొరికింది.

వాసుదేవరావు, లక్ష్మీపతి, ప్రసాదరావు ముగ్గురూ బ్రహ్మచారులే. ఒక్క వాసుదేవరావు తప్పించి తక్కినవారెవ్వరూ ఇంతకుమునుపు ఏవిధమైన ఉద్యోగమూ చేయలేదు. అందరికీ ఇది మొదటి ఉద్యోగము. వాసుదేవరావు మాత్రము ఇంతకుమునుపేవో రెండు మూడు తాత్కాలికమైన ఉద్యోగాలు చేశాట్ట. అంత అనుభవమూ గట్రా సంపాయించినా, భళ్ళున ఏ మాటా అనలేడు. చాలావరకు ముభావంగానే ఉంటాడు.

వాసుదేవరావు నెవరైనా చూస్తే మాత్రం, అతనేదో తాలింఖానాలో కసరత్తులు చేసి కుస్తీలు పట్టిన వస్తాదనుకుంటారు. బాగా ఆరడుగుల ఎత్తు మనిషి. ఎత్తుకి తగిన లావూను.

వాసుదేవరావు ముందు తక్కిన ముగ్గురూ పిచ్చిక పిల్లలా ఉన్నారు. లక్ష్మీపతి గోదావరి జిల్లా వాడట. మంచి మాటకారి. చాలా తెలివిగలవాడూను. ఏ పాము నే కర్రతో కొట్టాలో అతనికి బాగా తెలుసులా ఉంది.

ప్రసాదరావుదంతా హడావిడి బేరం. మనిషి గందరగోళంగా మాట్లాడుతాడు. అతని పనులూ అలానే ఉంటాయి. ఆవేశం ఎక్కువ ఆలోచన తక్కువాను. ఈ ఊళ్లో అతనికి ఉద్యోగం ఒచ్చిందంటే ఎగిరి గంతేశాట్ట. ఉద్యోగం ఎల్లా ఉన్నా, వాళ్ళ మామయ్యగారింటో మకాం చెయ్యడమంటే అతనికి సరదానట. అది నేటికి నెరవేరిందని చెప్పుకున్నాడు.

నలుగురికీ పరిచయమైన కొద్ది సేపట్లోనే బాగా కలిసిపోయారు. మనసు విప్పుకుని మాటాడుకున్నారు.

వీళ్ల స్నేహాన్ని చూచి మొదట్లో నవ్వుకున్నారు ఆఫీసు బృందం.

నలుగురూ ఉద్యోగానికి శ్రీకారం చుట్టి తాము చేయవలసిన పనులను గురించి తెలుసుకున్నారు. లంచవర్లో వాళ్ళందరు కలిసి భోజన వసతుల గురించి మాట్లాడుకున్నారు.

ఈ ఊళ్లో హొటళ్లకి కొదువలేదు కాబట్టి భోజనం గురించి అట్టే ఆలోచించకూడదు. పోతే వసతి, దీని విషయమేదో అతి త్వరలో తేల్చుకోవాలి. విజయవాడలో ఇల్లు దొరకడం — అందునా అన్ని వసతులూ ఉన్న ఇల్లు దొరకడం దుర్లభమని వినికిడి. కాని ప్రసాదరావు అన్న మాటకి వాళ్ల మనసులు కుదుటపడ్డాయి.

అతను శంకరా న్నుద్దేశించి,

"మీరేం బెంగపడకండి గురువుగారూ! మీకు చక్కటి కొంప చూచిపెట్టే బాధ్యత నాది. ఈవేళకి మీరెలాగో ఆఫీసులోనే గడిపేయండి. రేపొద్దున గుడ్ న్యూస్ తీసుకొస్తాను. సరేనా?"

"చాలా థాంక్స్."

"అన్నట్టు మీ మావయ్యగా రిల్లెక్కడో చెప్పారు కాదూ?" అడిగాడు లక్ష్మీపతి.

"మీకీఊరు బాగా తెలుసా?" ప్రసాదరావు అడిగిన దానికి అతను తలని అడ్డంగా ఊపుతూ తెలీదని చెప్పాడు.

"అయితే చెప్పినందువల్ల ప్రయోజనంలేదు. చెప్పినా తెల్సుకోడం గొప్ప కష్టం. వీలుంటే ఈ సాయంత్రం మా యింటికి రండి చూపిస్తాను. పనిలో పని సాయంత్రమే మావయ్యని అడిగేస్తాను ఇల్లేదైనా దొరుకుతుందేమో చెప్పమని."

"అదే చేయండి" అన్నాడు వాసుదేవరావు.

అందరి బిల్లూ ప్రసాదరావు తీసుకుని కౌంటరు దగ్గరికి వెళ్ళాడు.

"ప్రసాదరావుగారూ మీరు ఆగాలి" అన్నాడు శంకరం.

"అది గొప్ప కష్టంలేండి" అన్నాడు ప్రసాదరావు జేబులోంచి డబ్బు తీస్తూ.

శంకరం బిల్లు లాక్కున్నాడు. సర్వర్ని పిలిచాడు. అందరికీ వేర్వేరుగా బిల్లులు రాయమని చెప్పేడు. సర్వరు అలాగే చేశాడు.

"మీ పద్ధతి మార్చుకోవాలి గురువుగారూ!" అన్నాడు ప్రసాదరావు చిన్నబుచ్చుకుంటూ.

"అది గొప్ప కష్టంలేండి" అన్నాడు లక్ష్మీపతి ప్రసాదరావుని అనుకరిస్తూ. ప్రసాదరావు మినహా ముగ్గురూ నవ్వుకున్నారు.

అందరూ బిల్లు చెల్లించి బయట పడ్డారు. వీళ్ల హడావిడిని గమనిస్తున్న మిగతా గుమాస్తా బృందం ఒకళ్ల మొహాలు ఒకళ్ళు చూచుకున్నారు.

"ఈ ముచ్చ టెన్నాళ్ళులే. మనం చూస్తాంగా" అన్నాడు విశ్వంభరశాస్త్రి కాఫీ తాగుతూ అతను ఎస్టాబ్లిష్మెంటు సెక్షన్లో పనిచేస్తాడు. అతనంటె ఆఫీసులో అందరికీ ఒక విధమైన అభిమానం, గౌరవమూను. స్టాఫ్ మేటర్సన్నీ అతనే చూడటం మూలంగా, తతిమ్మా గుమాస్తాలకి అతనిపట్ల కొంత భక్తి ఉన్నమాట నిజం. పైగా అతనంటే ఆఫీసరుకి మంచి గురీ, నమ్మకమూను. అందుచేత ఇన్ని కారణాలవల్ల, శాస్త్రి మాటని తలదాల్చి ఆహా, ఓహో అనడం కద్దు మిగతా జనాభాకి.

అతనితో ఎప్పుడూ ముగ్గురు, నలుగురు ఆంతరంగికులు వెంట నుంటారు. అతనేం చెప్పదలుచుకున్నా వాళ్లతోనే చెప్తాడు. వాళ్ళు వింటారు. తగినవిధంగా భజనచేస్తూ ఉంటారు. ఆఫీసరనబడే దేవుడికి ప్రియభక్తుడూ, పూజారి ఈ శాస్త్రి కావటంవల్ల, చేసే భజనేదో శాస్త్రి ద్వారా చేయడంవల్ల 'ముక్తి' చాలా తొందరగ లభిస్తుందని ఈ మూఢుల మూర్ఖ విశ్వాసం.

శాస్త్రికి భజన సమాజాలంటే చాలా యిష్టం. స్టాఫ్ తనకి భజన చేస్తున్నట్టే అతను శ్రీవారికి చేస్తూంటాడు. పై ఆఫీసరెవరైనా సరే శాస్త్రి చెవిని చిన్న మాటైనా వెయ్యందే ఏపనీ చెయ్యటానికి సాహసించరు.

శాస్త్రి నాటకాలు వేస్తూంటాడు. స్థానికంగా జరిగే ప్రతి నాటకానికీ శాస్త్రికి ఆహ్వానాలు వస్తూంటాయి. ప్రత్యేకంగా అతనికి ఒక సమాజమూ కలదు. అతనికి నాటకాలన్నా, దాని తాలూకు సమాజాలన్నా వల్లమాలిన మోజు. అప్పుడప్పుడూ పరిషత్తులూ, పోటీలూ అంటూ హడావిడి చేస్తూంటాడు శాస్త్రి.

శాస్త్రి మాటలు తియ్యగా వినడానికి హాయిగా ఉంటాయి. అతను వస్తుతః నటుడాయే మరి.

హొటల్లో కూర్చున్న శాస్త్రి విలబడ్డాడు. అతని బిల్లు ఓ కుర్ర గుమాస్తా భక్తుడు గద్దలా తన్నేశాడు.— 'మీ రాగండీ' అంటూ శాస్త్రి అతని వైపు ముచ్చటగా చూచి నవ్వుతూ, తన చేతి లోని బిల్లు అలా గాల్లోకి ఎగరేసినట్టు చేశాడు. చివరికి శాస్త్రి బిల్లు కుర్ర భక్తుడే చెల్లించాడు. అభిమానానికి కారణం ఆ కుర్ర గుమాస్తాకి ఈ కుర్రశాస్త్రిగారు ఆఫీసర్తో చెప్పి నాలుగు రోజుల సెలవు మంజూరు చేయించారు.

హెడ్ క్లార్కు నలుగురికీ పాఠాలు చెప్పడం ప్రారంభించారు.

ఆ సాయంత్రం ప్రసాదరావు మావయ్యగారింటికి వెళ్ళారు మిత్రులు. ఆ యిల్లు గవర్నరు పేటలో ఉంది. అందమైన డాబా యిల్లు. ప్రసాదరావు మావయ్య ప్లీడరుగా ఆ ఊళ్ళోనే స్థిరపడ్డారుట. రెండు చేతులా సంపాదనట. ఒక కొడుకూ, ఒక కూతురు. కొడుక్కి పెళ్ళయి అతని సంసారంతో విశాఖపట్నంలో ఉంటున్నాడుట. పోతే వాళ్ల మావయ్య కూతురి విషయం చెపుతూ కాస్త సిగ్గుపడ్డాడు ప్రసాదరావు.

గాడు లక్ష్మీపతి.

"నాకు తెలీదు గురూగారూ!"

"అడుగుతే ఆ అమ్మాయి చెప్పదుటండీ ?"

"గొప్ప కష్టంలేండి" అన్నాడు ప్రసాదరావు.

ఈ మాటతో మిత్రబృందం కళ్లింతవి చేసుకుని అతనివైపు ఆశ్చర్యంగా చూశారు. ప్రసాదరావు అందర్నీ ఒక తడవ పరీక్షించి, వాళ్ళందరూ ఆశ్చర్యంలో ఉన్నట్టు గ్రహించి,

"నిజమండీ! ఎప్పుడో నూటికీ, కోటికీ ఒక్కటన్నట్టు రోజుకీ ఒక్కసారే మాట్లాడుతుంది, ఇక తర్వాత బంద్. ఉండండి. మీకు పరిచయం



బయటకొచ్చిన తరువాత మరో శిష్యుడు శాస్త్రికి ఒక సిగరెట్టు పెట్టె అందించాడు. పెట్టెనుండి ఒక సిగరెట్టు లాగి ముట్టించి, మళ్లా పెట్టెని జేబులోకి తోస్తూ అన్నాడు శాస్త్రి తన పరిజనంతో.

"కొత్తనీరొచ్చింది. కాస్త కనిపెట్టుకునుండటం మంచిది. బొత్తిగా ఆఫీసు వ్యవహారం తెలీని ఎడ్డి మడ్డి మనుషుల్లా ఉన్నారు చూస్తుంటే."

పరిజనం తలలూపి శాస్త్రివెంట నడిచింది.

అతని వాలకం అర్థం చేసుకున్న లక్ష్మీపతి.

"ఆవిడగారు మీ కాబోయే శ్రీమతి కాబోలు" అన్నాడు.

ఈ మాటకి మరింత సిగ్గుపడిపోతూ అవునన్నట్టు తలూపి, చొక్కా గుండీని రెండు చేతుల్తో నలుపుతూ అన్నాడు ప్రసాదరావు—

"బి. యస్సీ చదువుతూ మానేసింది. ఈ ఊళ్ళోనే చదువుకుంది లేండి."

"అరే .... చదువెందుకు ఆపేశారండీ" అనడి

చస్తాను" అనసి గబగబా హాల్లోకి వెళ్ళాడు. 'మృణా' అని పిలిచేడు.

ఈ పేరేదో గమ్మత్తుగా ఉండటంతో మిత్రులు అదిరిపడ్డారు.

"మృణాళినీ...." మళ్లా పిలిచాడు ప్రసాధరావు.

కాసేపటికి ఇద్దరూ వొచ్చారు మిత్రుల గది లోకి. మృణాళిని ఇంకా గుమ్మానికి అవతలే నించుని ఉండటం గమనించకుండానే—

45వ పేజీ చూడండి

# పట్టు పరికిణీ



గోడమీఁది గడియారం టంగు టంగుమని ఏడుగంటలు కొట్టింది. డిసెంబరు నెల. చలి ఇంకా తగ్గలేదు. ఎండ బాగా రాలేదు. అవచ్చీ రాని ఎండలో వరండాలో పడకుర్చీలో కూర్చుని పేపరు చదువుకొంటున్నాడు మోహన్ రావు.

'నాన్నా, నా కొత్త పట్టు పరికిణీ బాగుందా?' అంటూ పరిగెత్తుతూ వచ్చింది కూతురు రాణీ.

రాణికి ఆరేళ్ళు ఆవేళే నిండాయి. ప్రొద్దుటే లేచి తలంటుకుంది. పుట్టిన దినం కోసమని కుట్టించిన కొత్త పట్టు పరికిణీ, జాకెట్టు వేసుకుంది. మెళ్ళో బంగారం గొలుసు. చేతులకి బంగారం గాజుల మధ్య వేసుకున్న గాజు గాజులు గలగలా చప్పుడు చేస్తున్నాయి. వేసుకున్న జూకాలు ఆ పిల్ల తల తిప్పినప్పుడల్లా కదుల్తున్నాయి. జడ వేయకుండా వదిలేసిన జుట్టు గాలి కెగురుతోంది. కళ్ళల్లో పడకుండా జుత్తు అడుగునుంచి రిబ్బనుతీసి తల పైన అందంగా పువ్వులా కట్టింది; వాళ్ళమ్మ. కాటుక కళ్ళు తిప్పుతూ, సంతోషం పట్టలేకపోతూ వచ్చిన కూతుర్ని ప్రేమగా వళ్ళో కూర్చోపెట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు మోహన్.

'బాగుందమ్మా, చాలా బాగుంది. పెళ్ళికూతురులా ఉన్నావు తల్లీ' అన్నాడు మెళ్ళో గొలుసు సరి చేస్తూ.

'ఛీ, నాన్నా' అంటూ అచ్చు పెళ్ళికూతురి లాగే సిగ్గుపడింది రాణీ.

'నిజం, పుట్టిన రోజు పెళ్ళి కూతురివి కదూ' అన్నాడు నవ్వుతూ.

వళ్ళోంచి దిగిపోతున్న కూతుర్ని 'ఎక్కడికి వెళ్ళి పోతున్నావు' అని అడిగాడు.

'పక్కింటి పిన్నిగారికి, ఎదురింటి అమ్మమ్మ గారికి పరికిణీ చూపించి రమ్మంది అమ్మ' అంది రాణీ జాకెట్టు క్రిందికి లాక్కుంటూ.

'జాగ్రత్తగా వెళ్ళు' అని ఆ పిల్ల మెట్లు దిగిందాకా చూసి మళ్ళీ పేపర్లో పడ్డాడు మోహన్.

పిన్నిగారికీ, అమ్మమ్మగారికీ పరికిణీ చూపించి వాళ్ళు మెచ్చుకున్నాక ఇంటికి వచ్చింది రాణీ. ఆ పిల్లకింకా తృప్తి తీరలే. ఇంకా ఎవరికి చూపించనా అని ఆలోచించి పెరట్లోకి పరుగెత్తింది.

'రామీ, ఓసే రామీ నా పట్టు పరికిణీ బాగుందా? నా పుట్టినరోజని అమ్మ కుట్టించింది' అంటూ

అంట్లు తోముతున్న పనిమనిషి దగ్గరికి వెళ్ళింది.

'చాలా బాగుందండమ్మాయ్‌గోరూ' అంది రామి.

ఆ ప్రక్కనే నించునివున్నది రామి కూతురు లక్ష్మి. రాణితోటిదే అది కూడా.

'ఎంత బాగుందో! మెరిసిపోతుంది, ఏం దండమ్మాయ్‌గోరూ?' అంటూ పరికి ముట్కుకు చూసింది. 'ఎంత మెత్తగుందో?' అంటూ ఆశ్చర్య పోయింది.

అంతలోకే 'ఇదుగో రామి ఈ వెండి గ్లాసులు తెల్లగా తోమి ఇయ్యి' అంటూ పెరట్లోకి వచ్చింది రాణి తల్లి సుశీలమ్మ. రామిని, రాణి పరికిణీ చూస్తున్న లక్ష్మినీ చూసింది.

'ఛీ, దాని మురికి చేతులతో పరికిణీ ముట్టుకోనియ్యకు. ఇంట్లోకి పద' అని కూతుర్ని కసిరి, 'ఏమే రామీ, నీకేనా బుద్ధి లేదు టే, చూస్తూ వూరుకున్నావు' అని దానిమీద విసుక్కుని కూతుర్ని తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

ఆ పిల్ల వెళ్ళినవైపే చూస్తూ ఆ పరికిణీ అందాన్ని, మెత్తదనాన్ని తలుచుకుంటో నిలబడింది లక్ష్మి. 'ఎంత బాగుందో ఆ పరికిణీ. అంచుమీద ఏమో పిట్టలుండాయి. జరిగ మెరిసి పోతంది. ముట్కుకుంటే ఎంత మెత్తగుంది. నాకూ అలాటి పరికిణీ ఉంటే!' అనుకుంది లక్ష్మి ఆశగా.

ఆ రాత్రి అమ్మ పెట్టిన అన్నం తినేసి కాసేపు 'అ, ఆ లు' రాసుకుని కళ్ళు నులుముకుంటూ అమ్మ ప్రక్క గోనె పట్టామీదికి చేరింది లక్ష్మి.

'అమ్మా' అంది వచ్చే నిద్దర ఆపుకుంటూ.

'ఏటే!' అంది ఏమో ఆలోచిస్తున్న రామి.

'మరే, మరే'

'ఏటే?' అంది కూతురివైపు తిరుగుతూ.

'ఇయ్యాల చిన్నమ్మాయ్‌గారి పుట్టింరోజు కాదటే!'

'అవును. అందుకే అమ్మగారు పాయసం వండారు, అంది సాయంత్రం తోమిన గిన్నెల్లో పాయసం గిన్నె జ్ఞాపకం రాగా రామి.

'మరి నా కెప్పుడూ పుట్టింరోజు రాదేమే? నా పుట్టింరోజెప్పుడూ?' ప్రొద్దుటనుండీ ఆలోచిస్తున్న లక్ష్మి ఆలోచన తెగక అడిగేసింది.

'పిచ్చీ, గొప్పోలకయన్నీ మన కేటి?' అంది రామి.

'అసలు ఎప్పుడూ?' పట్టు పట్టింది లక్ష్మి.

'కనువు..... కాదు..... కాదు.... ముక్కనువునా పుట్టావు' అంది రామి గుర్తు తెచ్చుకుంటూ.

'మరే ఈసారి నాకూ పుట్టిం రోజు సెయ్యవే' ముద్దుగా అడిగింది తల్లి రొమ్ములో తల దాచుకుంటూ.

'అలాగేలే' అంది రామి. 'తలంటిపోస్తే పోతాదిలే' అనుకుంటూ.

'మరే అమ్మాయ్‌గోరి పరికిణీలాంటిది కావాలే' అంది తల్లి కింకా దగ్గరగా జరుగుతూ. ఆ పరికిణీ దాని పసి హృదయంలో ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంది. కళ్ళు మూసుకున్నా, తెరచినా అదే కనబడుతోంది. చేతి కింకా మెత్తగా తగులుతున్నట్లే ఉంది.

'అబ్బో-అది చానా ఖరీదుంటాది. పట్టుబట్టలు మన కెక్కడ ఒస్తాయి? అయన్నీ కావాలనుకో కూడదు' అంది రామి కూతురి కోర్కెకి ఆశ్చర్యపోతూ

'పోనీలేవే అమ్మా, పోతవన్నా! అమ్మగార్ని అడగవే. అది ఎంత బాగుందో తెలుసా. మెత్తగుంది. అడగవే' అంది ఏడుపొస్తుకుంటూ.

రామికి జాలి వేసింది. పిచ్చిపిల్ల. 'సిన్నది దానికేటి తెలుద్ది. కట్టం సుకం. అక్కడకీ ఎప్పుడూ సూసిన యన్నీ కావాలని అడగదు. అసలు నోరిడిచి ఏమీ అడగనే లేదింతవరకూ. దాని కెంత మనసేసిందో. అల్ల అయ్యే ఉంటే ఎట్టో అట్టా కొనిక పొయ్యేవాడు' అనుకుంది.

'అలాగే, సూద్దాంలే అని కూతుర్ని సముదాయించింది రామి.

పట్టు పరికిణీ కొనిచ్చినట్లే సంతోషిస్తూ నిద్దట్లో ఒరిగిపోయింది లక్ష్మి.

రామి చనిపోయిన భర్తని తలచుకొని, 'అడే ఉంటే' అనుకుంది.

* * *

రామిభర్త వెంకన్న ప్రెస్సులో పని చేసేవాడు. ప్రొప్రైటరింట్లో పని చేస్తున్న రామిని చూసి మనసు పడి మనువాడేడు. సుఖంగా, సంతోషంగా కాలం గడిపే వాళ్ళిద్దరూ. రెండేళ్ళు గడిచినా పిల్లలు పుట్టక పోయేసరికి వెంకన్నకి దిగులు పట్టుకుంది ఇంక పుట్టరేమోనని. పిల్లలంటే

ఒక అమెరికన్ పాప భగవంతుణ్ణి ప్రార్థిస్తోంది.

ఓ దేముడా! అమ్మని కాపాడు నాన్నని కాపాడు అందర్నీ కాపాడు! అన్నట్లు మర్చేపోయా! అందరికన్నా ముందు నిన్ను నువ్వు కాపాడుకో లేకపోతే మేం చచ్చిపోతాం.

సీతారామయ్య (చిలువూరు)

వల్లమాలిన ఇష్టం వాడికి. మూడో సంవత్సరం గడుస్తూండగా రామి నీళ్ళోసుకుంది. వెంకన్న సంబరం అంతా ఇంతా కాదు. రామిని పువ్వుల్లో పెట్టి చూసుకున్నాడు. వంట కూడా చెయ్యనిచ్చేవాడు కాడు.

కూతుర్ని కంది రామి. 'నా ఇంటి కిది లచ్చిమి' అంటూ లక్ష్మి అని పేరు పెట్టాడు. ఇంటి దగ్గిరున్నంతసేపూ క్షణమన్నా నేల దింపేవాడు కాడు. 'నా తల్లిని పెద్ద సదువు సదివిస్తా. ఉద్యోగ సేపిస్తా. నీలా అంట్లు తోముద్ది అనుకున్నావు కావాల' అనేవాడు.

వెంకన్నకి ప్రెస్సులో 60, 70 రూ. వచ్చేవి. ఆపైని వీలున్నప్పుడల్లా 'ఎక్స్ట్రా టైం' చేసేవాడు. సంవత్సరానికి రెండు నెలల జీతం బోనస్సు వచ్చేది. రామి రెండిళ్ళల్లో పని చేసి రెండు పదులు తెచ్చేది. ఉన్న చిన్న గుడిసెలో సంసారం చీకూ, చింతా లేకుండా హాయిగా గడిచిపోయేది.

కాని ఎంతోకాలం ఆ అదృష్టం నిలవలేదు. కాలికి మేకు గుచ్చుకుని అది పుండయ్యి, ధనుర్వాతంవచ్చి మూడు నాళ్ళలో చచ్చిపోయాడు వెంకన్న. ఆస్పత్రిలో చేర్పించినా ప్రయోజనం లేకపోయింది. ప్రాణమెళ్ళిపోయే స్పృహ లేదు. తన్ను నమ్ముకున్న రామినిగాని, కన్న ప్రేమ లన్నీ పెట్టుకు పెంచిన లక్ష్మినిగాని కనీసం పలకరించకుండానే కన్ను మూశాడు.

మూడు నెలల వరకూ కోలుకోలేకపోయింది రామి. ఆ తర్వాత పిల్లను చూసుకొని గుండె దిటవు చేసుకుంది. దీనికోసమే నే బతికేది, అనుకుంది. అప్పటినుండీ ఆ రెండిళ్లడనీ చేసుకుంటూ వాళ్ళు పడేసే పట్టెడన్నంతో పొట్ట నింపుకుంటూ ఎలాగో కాలం వెళ్లదీస్తున్నాది. కూతుర్ని చదివించాలన్న వెంకన్న కోర్కె తీర్చాలన్న ఆశతో లక్ష్మిని బడికి పంపిస్తోంది. కాని ఆ చదువెంతకాలం సాగుతుందో దానికే తెలియదు.

* * *

ఈ తలపులతోనే గడిపింది రాత్రంతా. కునుకు పట్టిందో లేదో తొలి కోడి కూత వినిపించి చట్టున లేచి పోయింది. పిల్ల దానిమీద చిరుగు బొంత బాగా కప్పి, గుడిసె తలుపు చేరవేసి పనిలోకి బయలుదేరింది రామి.

* * *

యాంత్రికంగా అంట్లు తోముతోందేగాని, దాని ఆలోచనలన్నీ పిల్లదాని కోరిక మీదనే ఉన్నాయి. 'ఎంత్రి మాలోకం తెలిసో తెలవకో అడిగింది. ఎట్టన్నా ఇయ్యగలిగితే' అనుకుంది.

కూతురి సంతోషం చూడాలని ఏ తల్లికుండదు!

పని అంతా అయ్యాక 'నే వెల్తాన్నానండమ్మ గోరూ' అని చెప్పి ఇంకా హాల్లో నిల్చుంది రామి.

'వెళ్ళు' అని ఇంకా అలాగే నిల్చుని ఉందని గమనించి, 'ఏం అలా నిలబడ్డావ్' అంది సుశీలమ్మ.

'అమ్మగోరూ, నిన్న చిన్నమ్మాయ్‌గోరు కట్టుకున్న పరికిణీ ఎంతవుద్దండీ?' అని అడిగింది నెమ్మదిగా.

'అదా? అబ్బో! చాలా ఖరీదు. అరవై అయిదు రూపాయలు' అంది నిజానికది ఏభయ్యే అయినా.

'అమ్మో! అంత కరీదే!!' గుండె చేత్తో కొట్టుకుంది రామి.

'ఎందుకడిగావు?' కుతూహలంగా అడిగింది సుశీలమ్మ

'పిల్లది సర్దా పడిందండమ్మగారూ, దానికీ పుట్టింరోజు చేసి అట్టాటి చిలుకు పరికి కట్టాలట' అంది. ఏదో తప్పు చేసిందానిలాగ సిగ్గుపడుతూ

'సరిపోయింది. మింగ మెతుకు లేదటగాని, మీసాలకి సంపెంగ నూనెట. తిండానికి తిండిలేదు గాని పుట్టింరోజులూ, వేషాలు' అంది సుశీలమ్మ మనసులో అనుకున్నట్లు పైకే.

రామి కుంచించుకు పోయింది. అయినా అభిమానాన్ని అవతలకి నెట్టి,

'అమ్మా, చిన్నమ్మాయ్‌గోరిది సిరిగిపోయింది ఏమన్నా చిలుకు పరికిణీ ఉంటే ఇయ్యండమ్మా. కుర్రది చానా ఆశ పడతావుంది' అని అడిగింది.

'నా దగ్గిరేం లేవు సుమా. ఏం? సిల్కు పరికిణీ లేకపోతే పుట్టింరోజు గడవనందా' అంది పెద్ద జోక్ వేసినట్లు నవ్వుతూ.

చిన్నబుచ్చుకుంది రామి. 'నా వెల్తానండమ్మగారూ', అనేసి గబగబా బయటకి వెళ్ళిపోయింది.

ఈ సంభాషణ అంతా ప్రక్క గదిలోంచి వింటున్న మోహన్, గబగబా బయటకి వచ్చి

'ఆడేం, సుశీ, మొన్ననేగా రాణి పట్టు పరికిణీలో ఒకటి పొట్టై పోయిందనీ, మరొకటి నువ్వు బద్ద

**కంగా పడేస్తే అక్కా డక్కడా చిలికలు కొరికేయని పాత బట్టల పెట్టెలో పడేశావు. పాపం ఒకటి** ఇవ్వలేకపోయావా? పిల్ల ఎంత మనసుపడి అడిగిందో' అన్నాడు.

'సారి. సామెత చెప్పినట్లే ఉంది. ఇవాళ పరికిణీ ఇస్తే రేపు నాపట్టుచీరె అడుగుతుంది. అయినా ఏం? పెద్దవాళ్లతో సరిగ్గా తూగాలంటే ఎలా? ఎవరికి తగ్గట్లు వాళ్లుండాలిగానీ పరికిణీలకి బోల్డు జరీ ఉంది. ఏ స్టైన్‌లెస్‌స్టీలు గిన్నెల వాడి కిచ్చినా కళ్లకద్దుకుని పది రూపాయలు చేసే గిన్నె ఇస్తాడు!' అంది సుశీలమ్మ.

'ఏం? ఇంట్లో వాడకానికని ఇంటినిండా పెట్టినవీ, పాపాయ్ పెళ్లినాటికని పెట్టెండా దాచినవీ చాలావూ? ఆ ఒక్క పరికిణీ ఇచ్చి కొనకపోతే మనకు గడవదూ?' అన్నాడు కొంచెం కోపంగా.

'ఇదిగో! మీ రెన్ని చెప్పండి. ఆ పరికిణీ దాని కివ్వడం అనవసరం. అనవసరంగా మప్పిపెట్టడం. లేనివాళ్లు లే నట్లుండాలి ఆ పట్టు పరికిణీ లేకుండా దాని పుట్టిన్రోజు గడవదేమో చూస్తాను' అంటూ ఇంక ఈ వాదన అనవసరం అన్నట్లు లేచి లోపలికి వెళ్లిపోయింది సుశీలమ్మ.

మోహన్‌కి నిజంగా కోపం వచ్చింది. 'నేనే పాతది కొని ఇద్దునా' అని అనుకున్నాడు. మళ్లీ అంతలోనే 'నా కెందు కొచ్చింది? దాని పరికిణీ కోసం వారం రోజులు ఇంట్లో యుద్ధం చెయ్యాలి మూతి విరుపులూ, దెప్పి పొడుపులూ పడాలి' అని తన ధర్మ గుణాన్ని అదుపులో పెట్టుకున్నాడు శాంతి కాముకుడు మోహన్.

* * *

'అమ్మా! అడిగావటే పరికిణీ?' ఇంటికెళ్లగానే రామి నడిగింది లక్ష్మి.

'ఆ! అడగడం అయింది. నాలుగు చెప్పు దెబ్బలు తినటం అయింది. ఇక నోరు మూసుక్కూకో' అంది రామి. సుశీలమ్మ ఎత్తి పొడుపులు దాని చెవుల్లో రింగుమంటున్నాయి.

'అయితే నాకు పట్టు పరికిణీ లేదా?' ఏడుపు లంకించుకుంది లక్ష్మి.

# పట్టు పరికిణీ

'ఛీ. నోర్మూయ్యి. పట్టు పరికిణీ కావాలటి పట్టు పరికిణీ' అంటూ నాలుగు తగిలించింది రామి ఇంకేం చెయ్యలేక.

గుడ్డలో నీళ్లు కుక్కుకుంటూ ఆశ విడుచుకోలేక ఒక మూల కెళ్లి నిల్చుంది లక్ష్మి.

కూతుర్ని చూస్తూ ఉంటే కడుపు తరుక్కుపోయింది రామికి. దగ్గరగా తీసుకుని 'నా తల్లే. ఏడవకు. నా సేతు లిరగా. ఎట్టా గొట్టానో. నీమీద కోపం సూపించాను. మీ అయ్యే ఉంటే,' అంటూ తనూ కన్నీరు పెట్టుకుంది.

'నువ్వేడవకే అమ్మా. నాకు పరికిణీ వద్దు లేవే. ఎప్పుడూ అడగను' అంది లక్ష్మి వెక్కుతూ, తన చిన్ని చేతులతో తల్లి కళ్లు తుడుస్తూ.

'ఛీ. పాడు బతుకులు. జల్మానికోనాడన్నా పిల్లల కోర్కె తీర్చలేని జీవితాలు. ఎవరినన్నా ధర్మం చెయ్యమన్నా ఎక్కిరింపులూ, ఏలాకోలాలు. ఉన్నోళ్లకేగాని లేనోళ్లకి ఆసలూ, పేమలూ ఉండవను కుంటారు ఆల్లే మడుసులూ, మేం కానట్లూ' అనుకుంది రామి.

ఆ రాత్రి రామికి నిద్దర పట్టలేదు. కూతురు కోర్కె తీర్చడానికి మార్గం ఏమిటా అని ఆలోచిస్తూ గడిపేసింది తెల్లార్లూ.

మర్నాడు సాయంత్రం పనులు ముగించుకుని బట్టల షాపుకి వెళ్లింది.

'పట్టు గుడ్డలున్నయ్యా పరికిణాలకి?' అంది మొహమాట పడుతూ.

'ఆ! బోలె డున్నాయి. ఎన్ని కావాలి?' లేని వాళ్లని చూస్తే అందరికీ హాస్యమే.

'ఎట్టాగిత్తారు?'

'యాభై, అరవై, డబ్బై. ఎంతఖరీదులో కావాలి?'

'అమ్మో' అనుకుంది. 'సవకలో లేవా?'

'మహా కొనేసేటట్టే వాకబు చేస్తున్నావే. గజం 5 రూ. కి నాసిరకం సిల్కు ఉంది. పరికిణీకి 16 రూ. అవుతుంది. అంతకు తక్కువ మా దగ్గ రుండవు,' అన్నాడు షావుకారు విసుక్కుంటూ.

**'పదా రూపాయలే' అనుకుంటూ ఆసలో ఆసేదో గొణుక్కుంటూ** ఇంటి కొచ్చేసింది రామి.

'పదారూపాయ లెక్కణ్ణుంచా త్తాను? పోనీ అమ్మగార్ని అప్పుగా ఇచ్చి, జీతంలో ఇరక్కోసుకోమందామన్నా మొన్న వానలకి ఇల్లు పడిపోయినప్పుడు ఈయమ్మకాడో నలబై, ఆయమ్మకాడో నలబై అట్టుకొచ్చానాయె. నెలకి మూడేసి రూపాయ లిరక్కోసుకునేట్టుగా. దానికే కాలా వేలా పడాల్సి వచ్చింది. ఏకలనున్నాదో అప్పటికైనా ఇచ్చిందా సుశీలమ్మ. మా లచ్చమ్మకాడుంటే పరికిణి ఇచ్చునేవోగాని ఆవిడకి పిల్లల్లేరు పాపం. పిల్ల ఆశ పడ్డాది. ఎట్టాగో ఇద్దామంటే నా వల్లకాందే నా నేటిసేయను' అని పరిపరివిధాల తలపోసిందిరామి.

* * *

మాట నిలబెట్టుకుంది లక్ష్మి. మళ్లీ పరికిణీ మాట ఎత్తలేదు. మనసులో కోర్కె మనసులోనే దాచుకుంది. వయసులో చిన్నదే అయినా కొన్ని కోర్కెలు కోరరానివి అని దాని హృదయంలో నాటుకుపోయింది. 'నే నడుగుతే అమ్మ ఏడుత్తది అమ్మేడుత్తే నాకూ ఏడు పొత్తాది. పరికిణి వద్దు, ఏం వద్దు' అనుకుంది దాని మనసులో.

* * *

వీధిలో స్టీలు గిన్నెల వాడి కేక వినపడి 'వాణ్ణిలా పిలవ్వేరామీ' అని పురమాయించి పాత బట్టల దగ్గిర కెళ్ళింది సుశీలమ్మ.

గిన్నెలవాడు వచ్చి అరుగుమీద దింపుకున్నాడు బుట్ట. రామి, లక్ష్మి అక్కడే నిల్చున్నారు.

సుశీలమ్మ వస్తూనే 'నీ పనయిపోతే వెళ్లు ఏం, అలా నిలబడ్డావు?' అంది.

'పోతాను లెండమ్మా' అందేకాని అక్కడే నిల్చుంది రామి, మిల మిల మెరిసిపోతున్నా గిన్నెలు చూస్తూ.

సుశీలమ్మ ఒక్కొక్క చీరా, పేంటూ చూపిస్తూ గిన్నెలు బేరమాడుతోంది. చివరికి రెండుపట్టు పరికిణీలు చూపించి,

'ఈ రెండింటికీ ఈ గిన్నె ఇయ్యి' అంది ఒక పెద్ద సైజు గిన్నె చూపిస్తూ.

రామి పరికిణీలవంక ఆశ్చర్యంగా చూసి 'పెద్దోల్లు కూడా అబద్దా లాడతారు' అనుకుంది.

**'ఆ పరికిణీలకి గిన్నె వత్తాదా అమ్మగోరూ, తెలీనట్టు అడుగుతున్నారు' అన్నాడు వాడిగ్గా ఇచ్చే గిన్నెలవాడు.**

**'ఎందుకురాదు. ఎంత జరీ ఉందో చూశావా? ఆ గిన్నె ఆరూప్రాయలకన్నా ఎక్కువ చెయ్యదు. నాకు తెలీనట్లు చెప్తావేంటి?' అంది సుశీలమ్మ.**

'ఆరూపయలకే ఇంత పెద్ద గిన్నె వత్తాదా. ఆ జరీ అంతా కరిగిస్తే నిండా రెండు తులాల వెండి రాదు. పరికిణాల పాలంగా అమ్మితే రెండింటికీ కలిపి అయిదు రూపాయ లొస్తాయో రావో. ఇదిగో ఈ చిన్నగిన్నె కావలిస్తే తీసుకోండి అంతకన్నా ఇవ్వలేను' అన్నాడు.

'సరే పోనీ ఈ జాకెట్టు కూడా తీసుకుని దాని మీద మూత కూడా ఇయ్యి!'


గునుస్తూనే ఇచ్చేశాడు రెండూ.

సుశీలమ్మ కొన్న గిన్నెలు చూసుకు మురిసిపోతూ, లోపలి కెళ్లిపోయింది. గిన్నెలవాడు బట్టలు మూట కట్టుకుంటున్నాడు.

రామి ఆఖరి ప్రయత్నం చేయదల్చుకుంది.

'అన్నా ఆ పరికిణీ ఎంతవుది' అంది బెరుగ్గా.

**'ఏది? ఈ పట్టుదా?'**



'నాల్గు రూపాయలు'

'రెండూ కలిపి అయిదు కూడా చెయ్యవని ఇప్పుడేగా అమ్మగారితో అన్నావు' కొంచెం ధైర్యంగా అడిగింది.

'బాగుంది. అలా అనకపోతే ఏపారం ఎలా చేస్తానూ?' తేలిగ్గా సమర్థించుకున్నాడు.

'నాకు ఆ పరికిణీ కావాలి. ఈ పస్టుకి వస్తే రెండు రూపాయలు, మళ్లా పస్టుకివస్తే రెండు రూపాయలూఇచ్చేత్తాను. ఇత్తావా?' బతిమాలింది.

'సారి! ఈ నాలుగు రూపాయలకి రెండుసార్లు తిరగాలన్నమాట. ఈ పస్టుకోసారి, మళ్లా పస్టుకో సారి!' విసుక్కుంటూ బట్ట ఎత్తుకోబోయాడు.

'ఎల్లిపోకన్నా. పిల్లది పుట్టిం రోజుకి కావాలని ఆస పడతాఉంది. ఆడముండని ఎక్కడ్నించి తేను. ఆల్ల అయ్యేవుంటే ఈపాటి కొత్తది తెచ్చియ్యక పొయ్యేవాడా? ఆ బగమంతుడు ఆడ్నొగ్గేసి నన్నెత్తుకెల్లికోపోయినా బాగుండేది.'

'దీనికి పట్టు పరికిణీ కావాల్సి వచ్చిందా?' అన్నాడు తల్లి వెనకాల నిల్చున్న లక్ష్మిని ఇవతలికి లాగుతూ.

'ఆ! చిన్నమ్మాయ్ గోరు కట్టుకున్న రోజు నుంచీ అదే దేస అయిపోయింది. అమ్మగార్ని అడిగితే లేదు పొమ్మన్నారు. కొట్లో పదా రూపాయలకి తక్కువలేదుట. మన వల్లకాదని మొన్న కూకలేశాను. నోరు నొక్కుకుంది. నువ్వు కనికరం సూపిస్తే నీ పేరు సెప్పుకుని సంతోసంగా తొడుక్కుంటాది. లేదంటే ఆ పాత సిరుగుడ్డే. ఏవో! దాని మనసు తీరసాలన్న కోరిక్కొద్దీ అడిగాను!' అంది తన బాధనంతా వెళ్లబోస్తూ రామి.

లక్ష్మివైపు తదేకంగా చూశాడు గిన్నెలవాడు. ఏమనుకున్నాడో ఏమో. మూట విప్పి చిరుగుల్లేని పరికిణీతీసి దాని చేతిలో పెట్టి 'పుట్టిం రోజు పండగనాడు కట్టుకుని మా మావ ఇచ్చాడని అందరికీ చెప్పు' అన్నాడు దాని బుగ్గ గిల్లుతూ.

లక్ష్మి కళ్లు సంతోషంతో మెరిసిపోయాయి. కాని తల్లి ఏమంటుందోనని తీసుకోనా, వద్దా అన్నట్లు చూసింది.

'ఊరికే ఇయ్యొద్దన్నా. పస్టు కొచ్చావంటే రెండు రూపాయ లిచ్చేత్తాను. లేకపోతే నువ్వు రావద్దులే. మీ ఇల్లెక్కడో సెప్పు. నానే అట్టు కొచ్చి ఇచ్చేత్తాను. నాలుగూ రెండు మాట్లుగా.'

'ఏమీ ఇవ్వక్కర్లేదులే. ఎందుకో ఈ బుల్లిని చూత్తాఉంటే సచ్చిపోయిన నా కూతురు గేపకం వస్తా ఉండాది. పిచ్చిది. ఎక్కడుందో. ఇప్పుడుంటే ఇలాగే ఉండును. రోజూ నానుగిన్నె లమ్ముకొని ఇంటి కెల్తావుంటే 'అయ్యా' అని నా కెదురొత్తూ సూసుకోకుండా కారుకింద పడి అక్కడే సచ్చిపోనాది. ఎదవ ముండావాణ్ని సూత్తూ కూడా ఏటీ సెయ్యలేక పోయాను' కళ్లనీళ్లు తుడుచుకున్నాడు. 'అదే అడిగితే అమ్ముకుంటానందునా! ఇయ్యకపోదునా? దాని లాంటిదే ఇదీ. మరేటనుకోకునీ అన్నే ఇచ్చాడనుకో. ఎల్తొత్తాను. మరిసిపోకు?' అని రామి సంభ్రమాశ్చర్యాలనుండితేరుకునేలోగాబుట్ట నెత్తుకునివెళ్ళిపోయాడు.

కంటికగుపించేంతవరకూ అతను వెళ్ళిన వైపె చూస్తూ నిల్చుని తమ ఇంటి దోవ పట్టారు తల్లీ, కూతురూ.

40 వ పేజి చూడుము




దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

## గ్రహస్థితి

మిధునంలో రాహువు, వృశ్చికంలో సూర్యుడు, వృశ్చిక ధనుస్సులలో బుధుడు, ధనుస్సులో అంగారక శుక్ర కేతువులు, మకరములో శని, మీనంలో గురువు, మేష వృషభ మిధున కర్కాటకాలలో చంద్రుడు.

**29-11-1963 శుక్రవారము మొదలు**
**5-12-1963 గురువారము వరకు**

### మేషం :

**(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)**

ఈ సమయంలో మీ వృత్తి వ్యాపారాలలో అశాంతికరమైన సూచనలు కనుపిస్తవి. డబ్బు ఇచ్చి పుచ్చుకొనే సందర్భాలలో మాటలు ముదిరి పేచీలకు దారితీస్తవి. మనస్సుకు భ్రాంతిని గొలిపే వార్తలు తెలుస్తవి. ధవాదాయం మామూలుగా ఉంటుంది. ప్రస్తుతం సాహసం అంత మంచిది కాదు. వ్యవహార రంగంలో మంచి సలహా, సహాయము లభిస్తవి. ధర్మకార్యాలు, ఇతరులకు ఉపకారము చేదామనుకొనే సందర్భాలలో తలవని తలంపుగా ఆటంకాలు వస్తవి. ఫలితం లభించినట్లే తోస్తుంది. అందుకొనే సమయానికి ప్రతిబంధకాలు ఏర్పడుతవి. 4, 5 తేదీలలో శుభ కార్యాలు, గౌరవ లాభం.

* * *

### వృషభం :

**(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)**

ఒక ప్రక్క కష్టం కనిపిస్తున్నా పట్టుదలతో సాధించుకో గలుగుతారు. ఒకరిద్దరు బంధువులు మిమ్ములను నిర్లక్ష్య భావంతో చూడవచ్చు. క్రమంగా ఆదాయం వృద్ధి అవుతుంది. ఇతరుల మాటలతో మీ కార్యకలాపాలు నిలచి పోకుండా జాగ్రత్త పడవలసిన సమయం. ఆరోగ్యం గురించి కూడా శ్రద్ధగా ఉండండి. అలసటతో కూడిన పనులు ఎక్కువ. ఆస్తి వృద్ధి ప్రయత్నాలు, వృత్తిలో మార్పును కోరే ప్రయత్నాలు చాలా మందంగా సాగుతవి. మీరు వ్రాసే ఉత్తరాలు మొదలయిన రికార్డు వంటి పత్రాలలో పొరపాట్లు రాగలల అవకాశాలున్నవి. మనస్సులో అలజడి కలుగుతుంది. స్థిమితంగా యోచించ లేక పోతారు.

* * *

### మిధునం :

**(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)**

ప్రస్తుతం ఓర్పు చాలా అవసరం. వ్యాపార వ్యవహారాలలో అవతలివారి మనస్సును నొప్పించకుండా ఫలితం రాబట్టుకొనవలసి ఉంటుంది. బంధువుల వలన సహాయం లభిస్తుంది. సులభమైన పనులు కూడా ఆరంభంలో భయభ్రాంతులను కలిగిస్తవి. అధికారుల స్నేహం లభిస్తుంది. అగ్ని, ఆయుధాలు మొదలయిన వాటి విషయంలో జాగ్రత్తగా ఉండండి. రక్తదోషం వల్లను, మానసిక ఉద్రేకం వల్లను బాధకనుపిస్తుంది. భారీ కార్యక్రమాలకు దిగ తగిన సమయం కాదు. నౌకరులతో కలహ సూచనలు వచ్చి సమసిపోతవి. సంఘంలో మీవలన పని గడుపుకొంటు, సమయంలో మిమ్ములను నిరుత్సాహ పరచే వారుంటారు. 3,4 తేదీలలో దండుగ ఖర్చులు, కుటుంబంలో స్పర్థలు.

* * *

### కర్కాటకం :

**(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష.)**

ఈ వారంలో మీరు తలపెట్టే పనులన్నీ శ్రమపడి సాధించ తగినవిగా ఉంటవి. దైవ కార్యాలలో పాల్గొంటారు. సాధారణంగా ఇతరుల చేతికి పోయిన వస్తువులు కాని, డబ్బుకాని సులభంగా తిరిగిరావు. భాగస్తులతో కలిసి చేయు వ్యవహారాలు అశాంతికి దారితీస్తవి. వస్తువులు, వాహనాలు మొదలయినవి కొనగలుగుతారు. తలవని తలంపుగా బాధ్యతపైన వేసుకొని బదులు చెప్పవలసిన అవసరం ఏర్పడుతుంది. ఆదాయం తృప్తికరంగా కనుపించక పోవచ్చు. వృత్తి వ్యాపారాలలో క్రొత్త పద్ధతులను అనుసరిస్తారు. రాజకీయాలు మొదలయిన వానిలో ఉత్సాహం కనుపించదు. 2, 3 తేదీలలో ధననష్ట సూచన, భయం.

* * *

### సింహాం :

**(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**

ఉత్సాహవంతమైన సమయం. ఆదాయం మాత్రం పెద్దగా పెరుగదు. కాని, పేరు ప్రతిష్టలు బాగుంటవి. వృత్తిలో శ్రమపడి మీ అంతస్తును కాపాడుకొన గలుగుతారు. సాటివారికి అన్ని విధాలా సహాయం చేస్తారు. మనస్సులో రకరకాల ఆలోచనలు వస్తూ ఉంటవి. మీ చేతిలో విశేషంగా ధనం వచ్చి ఖర్చు అవుతూ ఉంటుంది. వారం రెండవ భాగంలో సంతోష వార్తలు తెలుస్తవి. స్నేహితులకు సంబంధించిన వ్యవహారాలలో జోక్యం కలిగించుకొన వలసి వస్తుంది. వ్యాపార వృత్తులలో క్రమంగా అభివృద్ధి కనుపిస్తుంది. ప్రయాణాలు సుఖంగా జరుగుతవి. వ్యవహార రంగంలో ప్రతి బంధకాలు ఏర్పడుతవి.

* * *

### కన్య :

**(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)**

ప్రస్తుతం సుఖం లోపిస్తుంది. వృత్తిలో మీరు చూపినంత శ్రద్ధ, ఆసక్తి ఎదటి వారు చూపరు. ముందు కావలసినవి వెనుక, వెనుక కాతగినవి ముందు జరిగే సమయం. సమయంలో సహాయం దొరకక పనులు విదానం అవుతవి. ముఖస్తుతి చేసేవారు ఎక్కువ. అధికారులతో అభిప్రాయ భేదాలు రాకుండా చూచుకొనండి. వారం రెండవ భాగంలో ధనలాభం ఉంటుంది. పనులలో పోటీ పెరుగుతుంది. కార్యభారం వల్ల మనస్సు స్థిమితంగా ఉండదు. గొప్పవారి స్నేహం లభిస్తుంది. కాని కార్యరూపంలో ఉపయోగం తక్కువ. పిల్లల ఆరోగ్యం బాగుండదు. శుభ వార్తలు తెలుస్తవి. పట్టుదలతో శ్రమపడి ఆదాయ గౌరవములను కాపాడుకొన గలుగుతారు. ఒప్పుకున్న పనులను పూర్తి చేయగలుగుతారు. 1, 2 తేదీలలో శుభకార్యాలు, ఇష్టవస్తు లాభం.

* * *

### తుల :

**(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)**

ఎంత ధైర్యంగా ఉన్నా ఒక సమయంలో పరిస్థితులను అనుసరించవలసి వస్తుంది. కుటుంబంలో అనారోగ్య దోషాలు కనుపిస్తవి. బంధువుల విషయంలో మీరు నిష్కర్షగా మాట్లాడవలసి ఉంటుంది. మీ ఆరోగ్యం ఇంతకు ముందు కన్నా బాగుంటుంది. అయితే వేళకు నిద్ర, ఆహారము సమకూర్చుకొనటం అవసరం. కార్యభారం పెరగకుండా చూచుకొనండి. కుటుంబ కార్యాలలో పరస్పర సహకారం లభిస్తుంది. ఆదాయం మామూలుగా ఉంటుంది అధికారము, మాట విలువ బాగుంటవి. వ్యాపారము వంటి వృత్తులతో పెద్ద ప్రయత్నాలు సాగించ గలుగ్

## ఈ వారము ధరలు

ధాన్యం ధర కొద్దిగా తగ్గుతుంది. మిర్చిధర మందిలోనే ఉండి వారాంతంలో పెరిగే అవకాశాలున్నవి. నూలు ధర సాధారణంగా ఉంటుంది. కందుల ధర మందీ వస్తుంది. వేరుశనగపప్పు ధర అకస్మాత్తుగా పెరిగి తగ్గుతుంది.

తారు. సంఘంలో స్వతంత్రత, పెద్దరికము లభిస్తుంది. 29, 30 తేదీలలో పుణ్యకార్యాలు, లాభ వార్తలు.

* * *

**వృశ్చికం:**

**(విశాఖ 4-వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ)**

ప్రస్తుతం మీరు చేయలేకపోయినా చేయబోతున్నామనే సంతృప్తి మాత్రం కలుగుతుంది. ఇతరుల అడ్డు ప్రశ్నలకు సమాధానం చెప్పే బాధ్యత పెరుగుతుంది. ముందుగా ఆలోచించిన పనులు జరుగబోతున్న సమయంలో ఆటంకాలు ఎదురు అవుతవి. ఆదాయం బాగుంటుంది. వ్యవహార విషయాలలో వృథా శ్రమ పెరుగుతుంది. కుటుంబంలో సుఖము, శాంతి లభిస్తవి. వృత్తిలో మిమ్ములను సహాయం కోరేవారు ఎక్కువ. ఎవరితో ఏ విధమైన లావా దేవీలు జరిపినా ముందు వెనుకలు ఆలోచించి చేయటం అవసరం. శైత్య, ఉష్ణ ప్రకోపాల వల్ల బాధ పడతారు. మనస్థిమితం తగ్గుతుంది. కార్యక్రమాల యందు ప్రాలుమాలిక ఏర్పడుతుంది. 30, 1 తేదీలలో సంతోషవార్తలు, కార్యసిద్ధి సూచనలు.

* * *

**ధనుస్సు:**

**(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**

చేతిలో పుష్కలంగా డబ్బు మెదులుతుంది. తరువాత ఏమి జరుగుతుందనే యోచన లేకుండా ముందుకు పోగలుగుతారు. సంఘంలో గౌరవం బాగుంటుంది. ఈ సమయంలో చేయు వ్యవహార వ్యాపారాలు ముందుకు లాభిస్తవి. స్థిరాస్థులపైన యంత్రములు మొదలయిన వానిపైన ధనం వినియోగిస్తారు. బంధువులకు మీమీద గౌరవ భావం కలుగుతుంది. వృత్తిలోగాని, సంఘకార్యాలలో గాని కొంత విరోధభావం కనిపిస్తూ ఉంటుంది. వీలయినంత వరకు అప్పు చేయటమనేది తగ్గించుకొనటం మంచిది. ఇతరుల మంచి చెడ్డలలో హామీ ఉండటం వంటి పనులకు పోవద్దు. సాహస వ్యాపారాలలో ధన నష్ట సూచనలున్నవి. పుణ్య స్థలాలకు ప్రయాణం చేస్తారు. మిమ్ములను అనుసరిస్తూ, మీ అజాగ్రత్త కోసం చూచేవారుంటారు; మరచిపోవద్దు.

* * *

**మకరం:**

**(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)**

ఈ సమయంలో చెప్పిన మాట జరుపుకొనటం కష్టం. ప్రయాణాలు చేయవలసి వస్తుంది. అధికారుల వలన మాట వస్తుందనే ఆందోళన కలుగుతుంది. వృత్తిలో మిమ్ములను భయపెట్టే వారుంటారు. అవసరాలకు తగినంత ఆదాయం పెరగదు. ఉత్తర దిక్కు నుంచి సంతోషవార్తలు తెలుస్తవి. దొంగతనంగా వస్తువులు పోయే అవకాశాలున్నవి. మీరు తప్పుకొని తిరుగుదామనుకొన్నా సంఘంలో అపవాదులకు అవకాశం ఏర్పడుతుంది. ఉపయోగం లేని చిల్లర పనులతో వృత్తి వ్యాపారాలకు ఆటంకం ఏర్పడకుండా చూచుకొనండి. తలవని తలంపుగా ఏర్పడిన ప్రమోద సూచనల నుంచి తప్పించుకొన గలుగుతారు.

* * *


**కుంభం:**

**(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)**

దాదాపుగా ప్రతి వ్యవహారము లాభకరంగా పరిష్కారం అవుతుంది. వృత్తి ఉద్యోగాలలో అంతస్తు, ఆదాయం అభివృద్ధి అవుతవి. కుటుంబంలో సంతోషంగా జరుగుతుంది. అకస్మాత్తుగా పరోపకారం చేస్తారు. మీ మనస్సులో ఇంతకు ముందున్నటువంటి పట్టుదలలు, ఉద్రేకము తగ్గిపోతవి. ప్రశాంతంగా పనులు సాగించ గలుగుతారు. ఒక సమయంలో అశక్తులకు పెత్తనం ఇచ్చి బాధ పడవలసి వస్తుంది. లెక్కలు, వ్యవహార పత్రాలు మొదలయినవి స్వయంగా చూచుకొనటం అవసరం. లోగడ చెడిపోయిన పనులను క్రమంగా దారికి తీసుకుని రాగలుగుతారు. 2, 3 తేదీలలో తీవ్రమైన ఆలోచనలు, కార్యభంగం.

**మీనం:**

పోటీవారిలో మీ శక్తిని చూపగలుగుతారు. ప్రశాంతంగానే ఫలితం పొందగలరు. కుటుంబంలో శుభకార్యములు జరుగుతవి. మీ మనోభావం పదిమందికీ సంతృప్తి నిస్తుంది. ఆడంబరం నిమిత్తం శ్రమను, ఖర్చును పెంచుకుంటారు. అయితే "ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటి కామాటలు" మాత్రం చాలా జాగ్రత్తగా సాగించవలసి ఉంటుంది. నౌకరులు మొదలయిన వారితో చల్లగా పనులు జరుపుకొనటం అవసరం. వ్రాతలు, లెక్కలు పొరపాట్లు రాగల అవకాశాలున్నవి. పుణ్యకార్యముల యందు ఆసక్తి కలుగుతుంది. ఈ సమయంలో ఆదాయం మాత్రం మీ అంచనాకు తగినట్లుగా కనుపించక పోవచ్చు. ఒకరి సహాయం నమ్మి పనులు ఆరంభించవద్దు. 29, 30 తేదీలలో ఆదాయవృద్ధి, వ్యవహార జయం. ★




సుప్రసిద ఆసియా కథలు-6

# నా కొత్త బాబాయి

(జపాన్ కథ)

చుయో సుప్



నేను చిన్నపిల్లని. నాకు ఆరేళ్ళే.

నా పేరు ఓక్-హీ. మా కుటుంబములో ఇద్దరే—మా అమ్మ, నేనూ.

నేనూ, ఓహెూ, ఆగండి, ఇంకొక మనిషి ఉన్నాడు...... మా మామయ్య. హైస్కూల్లో చదువుకుంటున్నాడు. ఎప్పుడూ ఇంట్లో ఉండడు. ఎక్కడో అక్కడ తిరుగుతూనే ఉంటాడు. ఒక్కొక్కప్పుడు అతను వారాల తరబడి కనిపించడు. అందుకని అతన్ని మరిచిపోతూ ఉంటాను. మా అమ్మ చాలా అందగత్తె. ప్రపంచంలోకెల్లా అందమయిన ఆవిడట. ఆవిడ కిప్పుడు 24 ఏళ్ళు. ఆవిడ విధవ.

నేను పుట్టటానికి నెల రోజుల ముందు మా నాన్న పోయాడని మా పక్కింటి అమ్మమ్మ చెప్పింది. అంతకి ఒక సంవత్సరం కిందవే మా అమ్మని పెళ్లి చేసుకున్నాడు. మా నాన్న ఇక్కడ ఉపాధ్యాయుడుగా ఉండేవాడు. ఇలాగని మా అమ్మమ్మ చెప్పింది. ఆవిడ ఇంటికి పక్కనే ఉన్న ఈ ఇల్లుని మా నాన్న కొన్నాట్ట. మా అమ్మా, నాన్నా ఇద్దరూ ఇక్కడే ఉండేవాళ్ళు ఆయన చచ్చిపోయే వరకూ. మా నాన్నని నేను చూడనే లేదు. కాని, ఆయన బొమ్మ నొకసారి చూశాను. బాగా ఉన్నాడు.

సరిగ్గా చెప్పాలంటే మా కుటుంబంలోనూ అమ్మా, నేనూ, ఇద్దరమే కాని మా ఇంట్లో అదనంగా కొన్ని గదులుండేవి — మా అమ్మకి పనుల్లో సాయపడే మనిషి కావాల్సి వచ్చింది. అందుకని మా మామయ్య వచ్చాడు.

ఈ ఏడు వసంత ఋతువు వచ్చే సమయానికి నన్ను చిన్న పిల్లల బడిలో చేరిపిస్తానంది మా అమ్మ. నాకు చాలా సంతోషం వేసింది. నేను ఇంటికి వచ్చాను. మా పెద్దమామయ్య .... అంటే మాతో ఉండే మామయ్య అన్నయ్య .... ఎవరో కొత్త మనిషితో, బయట గదిలో మాట్లాడుతున్నాడు. నన్ను చూడగానే మా మామయ్య కొత్తాయనకి ప్రణామం చెయ్యమన్నాడు. నేను సిగ్గుపడ్డాను కాని, ఆ కొత్తమనిషి మా మామయ్యని ఈ అమ్మాయి నీ మేనకోడలా అని అడిగాడు. మా మామయ్య చెప్పాడు: "అవును. మా చెల్లెలి కూతురు, కొయంగ్‌సన్ ఈమె పుట్టకముందే పోయాడు."

కొత్తాయన అన్నాడు, "ఓక్—హీ, ఇలా రా నీ కళ్ళు అచ్చు మీ నాన్నవే!"

"ఓహెూ, ఓక్‌హీ, ఇలారా!" అన్నాడు మా మామయ్య. "నువ్వొక పెద్దమ్మాయి వైపోయావు. ఈయనకి వంగి ప్రణామం చెయ్యి. మీ నాన్న స్నేహితుడు. ఈ గదిలోనే ఉంటా డింక."

ఆ గదిలో ఆయన ఉంటాడని విని సంతోషించాను. ఆయన ముందు నుంచుని, వినయంగా ఒకసారి ముందుకి వంగి, తోటలోకి పారిపోయాను.

ఈ కొత్త బాబాయి నా కింతకుముందు తెలీదు. చాలా మంచివాడు. ఊళ్లో పెద్దవాళ్ళు అనుకునేవాళ్ళు, మా నాన్నకీ, ఈయనకీ మంచి స్నేహమనీ, ఈయనెక్కడో దూరదేశంలో చదువుకుని వచ్చాడనీ. మా ఊరి స్కూల్లో పంతులుగా కుదిరాట్ట. అక్కడ హోటల్ లేదు. కాబట్టి మా యింటికి వెళ్లమని చెప్పారుట ఎవరో.

ఈ కొత్త బాబాయి దగ్గిర చాలా బొమ్మల పుస్తకాలుండేవి. ఆయన గదిలోకి వెడితే నన్ను ఒళ్లో కూర్చోపెట్టుకుని బొమ్మలు చూపెట్టేవాడు. ఎప్పుడయినా మిఠాయి పెట్టేవాడు. ఒక రోజు భోజనం ముగించిన తరువాత ఆయన దగ్గరికి వెళ్లాను. ఆయన ఇంకా భోజనం చేస్తున్నాడు. నేను పక్కనే కూర్చుని ఆయన భోజనం చేస్తూ ఉంటే చూస్తూ ఉండిపోయాను. నీకు అన్నం తర్వాత అన్నిటికన్నా ఇష్టమయిన దేమిటి అని అడిగాడు. నాకు గుడ్లంటే అన్నిటికన్నా ఇష్టం అని చెప్పాను. వెంటనే ఆయన తన బల్ల మీద ఉడకబెట్టిన గుడ్డు ఒకటి ఉంటే తీసి ఇచ్చాడు. నేను దాన్ని తీసుకుని తిన్నాను. తర్వాత ఆయన కేది ఎక్కువ ఇష్టం అని అడిగాను. చిరునవ్వుతో "నాకూ గుడ్లే ఎక్కువిష్టం" అన్నాడు. నాకు సంతోషం వేసింది. మా అమ్మతో కూడా చెప్తానన్నాను.

"వద్దు. చెప్పక!" అన్నాడు ఆయన. కాని, నేను మా అమ్మ గదిలోకి వెళ్లి చెప్పేశాను. ఎందుకంటే మా అమ్మ అప్పటినుంచి ఎక్కువ గుడ్లు తీసుకొచ్చేది.

నేను 'కిండర్ గార్డెన్' (చిన్నపిల్లల బడి) కి వెళ్లటం మొదలుపెట్టాను. పాట్టం, నాట్యం చెయ్యటం, ఆటలు ఆడటం నేర్చుకున్నాను. మా టీచరుకి 'ఆర్గన్' (పెద్ద హార్మనీ వంటిది) వాయించటం బాగా వచ్చు. కిండర్‌గార్డెన్‌లో 'ఆర్గన్' 'చర్చి' లో దానికన్నా చిన్నది కాని వినటానికి బావుండేది. ఇలా ఉండగా, మా ఇంట్లో పైన ఒక గదిలో ఆర్గన్ లాంటిదే ఒకటి చూసి మా అమ్మని అడిగాను, ఏమిటని. అది ఆర్గన్ అని చెప్పింది మా అమ్మ.

ఆవిడ దాన్ని వాయించగా ఎప్పుడూ చూడలేదు నేను. అందుకని అడిగాను : "నీకు ఆర్గన్ వాయించటం వచ్చా ?" అని. ఆమె కొంచెం కంగారుపడి ఇలా చెప్పింది : "ఇది మీ నాన్న నాకు కొని ఇచ్చిన ఆర్గన్. ఆయన పోయింతర్వాత దాన్ని ముట్టుకోనయినా లేదు నేను!" ఏడుపు వచ్చినంత పనయింది ఆవిడకి. సరేనని కొంచెం మిఠాయి కోసం అడిగాను. ఇద్దరం లోపలికి వెళ్లిపోయాము.

మా కొత్త బాబాయితో మాట్లాడాలని నాకుంది కాని మా అమ్మ ఊరికే వెళ్లి అతన్ని విసిగించద్దని చెప్పింది. నిజం చెప్పాలంటే నే నాయన్ని విసిగించేదాన్ని కాదు. ఆయనే నన్ను విసిగించేవాడు. మా ఇంటికి వచ్చిన నెల రోజుల తర్వాత నాతో ఇలా మాట్లాడటం మొదలుపెట్టాడు.

"నీ కళ్ళు మీ నాన్నవే కాని ఈ చక్కటి ముక్కు మీ అమ్మవైపు నుంచి వచ్చుండాలి. ఈ నోరు అంతే. నిజమేనా ? మీ అమ్మ కూడా నీ అంత అందమయినదా ?" నే నన్నానూ, "మా అమ్మని చూడలేదా మీరు ?" ఆయన జవాబు చెప్పలేదు. "లోపలికి రండి మా అమ్మని చూడచ్చు" అన్నాను నేనే.

"అబ్బే నాకు చాలా పనుంది. ఇప్పుడు రాలేను." అని నా గడ్డంమీద ముద్దు పెట్టుకుని ఏవేవో కబుర్లు చెప్పాడు : "ఈ కోటు ఎవరు కుట్టారు? మీ అమ్మ పక్కనే పడుకుంటావా నువ్వు ?" అని అడిగాడు. అంత పనిగా ఉంటే ఇంతసేపు కబుర్లెలా చెప్తాడు ?

ఒక తమాషా. నేనంటే ఆయన కెంతో ఇష్టం,

తిప్పుడూ నన్ను ముద్దు చేసేవాడు కాని మా చిన్న మామయ్య ఉంటే మాత్రం మారిపోయేవాడు. ముద్దుపెట్టుకోవటం, కబుర్లు చెప్పటం ఉండేవి కావు.

ఒకరోజు, శనివారం మధ్యాహ్నం తనతో ఊరి వెనక కొండమీదికి రమ్మన్నాడు. ఈ ఆహ్వానం నాకు సంతోషం కలిగించింది. వెంటనే స్వీకరించాను. కాని, ఆయన "మీ అమ్మని అడిగి రా !" అన్నాడు. మా అమ్మ సరేనంది. నా మొహం కడిగి తల దువ్వి, పంపించేముందు ఒకసారి కావలించుకుని గట్టిగా అంది : "మరీ ఆలస్యం చెయ్యక !" అని. ఆయనకి కూడా వినిపించిం దనుకుంటాను. ఇద్దరం కొండెక్కి కింద ఊరినీ, రైల్వే స్టేషన్నీ చూశాము. మా కొత్త బాబాయి గడ్డిమీద పడుకుంటే నేను ఇటూ అటూ పరుగెత్తి ఆడుకున్నాను. కొన్ని గడిపోచలు కోసి వాటితో ఆయనకి చక్కిలి గింతలు పెట్టాను. కిందకి దిగివచ్చేటప్పుడు నా చెయ్యి పట్టుకుని నడిపించుకుని వచ్చాడు. దారిలో నాతో కిండర్ గార్డెన్ చదువుకునే పిల్లలు కొందరు కనిపించారు. ఎవరో, "ఓ హో, వాళ్ల నాన్నతో నడిచి వెళ్తోంది" అన్నారు.

నాకు సిగ్గేసింది. ఆయన నిజంగా మా నాన్నే అయితే బావుండు ననుకున్నాను. మా ఇంటి గుమ్మం చేరగానే అన్నాను. "మీరు నిజంగా మా నాన్నయితే బావుంటుంది!" అని. ఆయన ముఖం ఎర్రగడ్డలాగ అయిపోయింది. తల ఆడిస్తూ అన్నాడు: "అలాంటి మాట లనకూడదు !" నాకు భయంవేసి నా గదిలోకి "వెళ్లిపోయాను. మా అమ్మ, "ఎంతదాకా వెళ్లా" రని అడిగితే చెప్పకుండా వెక్కి వెక్కి ఏడ్చాను మర్నాడు ఆదివారం. ఒట్టలు వేసుకుని చర్చికి వెళ్లటానికి సిద్ధంగా ఉన్నాను. మా అమ్మ ఇంకా తయారుకాలేదు. నెమ్మదిగా మా బాబాయి గది దగ్గరికి వెళ్లి లోపలికి తొంగిచూశాను. నామీద ఇంకా కోపంగా ఉన్నాడో లేదో తెలుసుకుందామని. బల్ల దగ్గర ఏదో రాసుకుంటున్నాడు. నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. నాకు హాయనిపించింది. నావంక జాగ్రత్తగా చూసి, "చాలా బావున్నావు. ఎక్కడికి బయలుదేరావు ?"

"మా అమ్మతో చర్చికి వెడుతున్నాను."

"చర్చా ? ఏ చర్చి ?"


"ఇక్కడికి దగ్గరే ఉందే, ఆ చర్చి !"

ఇంతలో మా అమ్మ పిలిస్తే వెళ్లిపోయాను. మేము చర్చిలో కూర్చున్నప్పుడు ముందు ఒక పాట పాడారు, తర్వాత ప్రార్థన మొదలుపెట్టారు. అక్కడ వారందరూ తలలు వంచి ఉండగా, ఈయన జ్ఞాపకం వచ్చాడు. చర్చిలో ఉన్నాడేమో, అనుకున్నాను. తల ఎత్తి చూట్టూ చూశాను. మగవాళ్లు కూర్చునే చోట కనిపించాడు. నాకు సంతోషం వేసింది. తమాషా ఒకటి ఏమిటంటే ఆయన తక్కిన పెద్దవాళ్లలాగ తలవంచి లేడు. చుట్టూ చూస్తున్నాడు. నేను అతనివైపు చూసి చిరునవ్వు నవ్వాను కాని, అతను సమాధానంగా నవ్వలేదు. నన్ను చూడలేదేమోనని చెయ్యెత్తి ఆడించాను. నన్ను గమనించాడు, వెంటనే తల వంచేశాడు. ఆ క్షణం మా అమ్మ నేను ప్రార్థించటం లేదని చూసి నన్ను కిందికి లాగింది. నేను ఆమె చెవిలో అన్నాను : "ఆ బాబాయి ఇక్కడే ఉన్నాడు !" అమ్మ మొహం ఎర్రబడింది. ఆరోజు ఫాదరీ ప్రసంగం ఏమీ బావుళ్లేదు. అంతా అయిపోయేదాకా మా అమ్మ నన్ను చూసి నవ్వనే లేదు. ఫాదరీ నుంచున్న చోటువైపే స్థిరంగా చూస్తూ ఉండిపోయింది. కోపంగా ఉందనిపించింది. ఆయన వైపు చూశాను. ఆయనా నవ్వటంలేదు. నన్ను చూడనట్లే నటించాడు. నేను మగవాళ్ళ కూచునే వైపు తిరిగినప్పుడెల్లా మా అమ్మ నన్ను ఫాదరీ వైపు తిప్పేది. నాకూ కోపం వచ్చింది. ఏడ్చేద్దామనుకున్నాను. కాని మా కిండర్ గార్డెన్ టీచర్ పక్కనే కనిపించింది. అందుకని ఏడవటానికి వీలు లేకపోయింది.


నేను కిండర్ గార్డెన్‌లో చేరినప్పుడు మా చిన్న మామయ్య రోజూ బడిలో దింపి, తర్వాత ఇంటికి తీసుకుపోయేవాడు. పోను పోను నా అంతట నేనే వెళ్లగలిగేదాన్ని. నేను ఇల్లు చేరుకునేసరికి మా అమ్మ ఇంటి గేటు దగ్గిర నుంచుని నన్ను ఎత్తుకుని లోపలికి తీసుకుపోయేది. ఒకరోజు నేను కిండర్ గార్డెన్‌నుంచి తిరిగి వచ్చేటప్పటికి మాత్రం అక్కడ లేదు. పక్కింటి అమ్మమ్మగారి దగిరకి వెళ్లి ఉంటుంది. నాకు మాత్రం ఎందుకో విచారం వేసింది. వంటరిగా అనిపించింది. ఆవిడ్ని దడిపిద్దామనుకున్నాను గాని, నేను ఏదో చేసేందుకు ముందే మా అమ్మ గొంతుక వినిపించింది బయటినించి. "నా చిట్టితల్లి ఇంట్లో ఉందా ?" నా చెప్పులు తీసేసి లోపలి గదిలోకి పారిపోయాను. అక్కడ బీరువా తెరిచి అందులో దాక్కున్నాను. కొంత సేపు తర్వాత ఆమె కంఠం మళ్లీ వినిపించింది. ఇప్పుడు గదిలోనే ఉంది. "ఓక్—హో! ఇక్కడే ఉన్నావా ?" ఆపైన మళ్లీ, "అరె, ఇక్కడి కింకా రాలేదు !" అన్న మాటలు వినిపించాయి. మా అమ్మ నాకోసం గేటు దగ్గరికి నడిచి వెళ్లిపోవటం విన్నాను. నాకు సంతోషం వేసింది. నా తెలివికి నేనే నవ్వుకున్నాను. కొంతసేపటి తర్వాత ఏదో గొడవ జరుగుతున్న శబ్దాలు వినిపించాయి. మా అమ్మ గొంతుక, మా చిన్న మామయ్య గొంతుక వినపడ్డాయి.

చివరికి మా అమ్మ వెక్కివెక్కి ఏడవటం విన్నాను. బయటికి వచ్చేద్దామనుకున్నాను కాని ఆమెకి పడిన శిక్ష చాలలేదని అలాగే అక్కడ పడుకున్నాను. చాలా ఉక్కగా ఉంది. నిద్రపోయి ఉంటాను. నేను లేచేసరికి చీకటిగా ఉంది. భయం వేసి ఏడుపు మొదలుపెట్టాను. మా అమ్మ గొంతుక వినిపించింది. బీరువా తెరిచి నన్ను బయటికి లాగింది. మొదట నన్ను నాలు గంటించింది. ఏడ్చాను. తర్వాత నన్ను గట్టిగా కావిలించుకుని :

30వ పేజీ చూడండి



# క్రిస్టిన్ కీలర్ కథ



క్రిస్టిన్ కీలర్ ఇంటికి మరొక వ్యక్తి తరుచుగా వచ్చేవాడు. అతనిపేరు డాక్టర్ స్టీఫెన్‌వార్డ్.

అతను సౌమ్యుడనీ, సున్నితమయిన స్వభావం కలవాడనీ, మిస్ కీలర్‌ని బాగు చెయ్యాలనే ఉద్దేశంతోనే ఆమెపట్ల శ్రద్ధ చూపుతున్నాడనీ నాకు తెలుసు.

నేను అక్కడ పని చేసినన్ని రోజులూ రాత్రికి అక్కడ ఉండిపోనివాడు డాక్టర్ వార్డ్ ఒక్కడే.

మిస్ కీలర్ అతన్ని చులకనగా చూసేదని నాకు కోపం రావటం ఇప్పటికీ గుర్తే. అతన్ని వీలయినంతవరకూ ఉపయోగించుకోవటమే ఆమె ముఖ్య ఉద్దేశ్యమని నాకిప్పుడు నమ్మకం కుదిరింది.

నాకు స్టీఫెన్‌వార్డ్‌తో ఎక్కువ పరిచయం లేదు కాని, మిస్ కీలర్ అతనితో తనకి ఇతర పురుషులతో ఉన్న సంబంధం గురించి చెప్పి ఎత్తిపొడిచేదన్న సంగతి మాత్రం తెలుసు నాకు.

క్రితం రాత్రి జరిగిన వాటి వివరాలు అతనికి చెప్పటంవల్ల ఆమె కొక రకమయిన 'దుష్టసంతోషం' కలిగినట్లు కనిపించేది.

మర్యాదస్తురాలయిన ఏ స్త్రీ కూడా ఆమె మాట్లాడే విధంగా మాట్లాడి ఉండదని నాకున్న అనుభవంతో తర్ఫీదుతో చెప్పగలను.

నాకు చిరాకు పుట్టించే మరొక విషయం—ఆమె చాలా బిగ్గరగా మాట్లాడేది. ఒక అసహ్యమయిన సంఘటన నాకు బాగా జ్ఞాపకం. నేను వంట గదిలో ఉన్నాను. వాళ్ల మాటలు నాకు స్పష్టంగా వినిపిస్తున్నాయి. మిస్ కీలర్ అంతక్రితం రాత్రి తను చేసిన ఘన కార్యాలు వివరంగా చెబుతోంది. తన నీగ్రో మిత్రుడు ఒకడు రాత్రికి ఉండి వెళ్ళినట్లున్నాడు. అతన్ని పొగడుతోంది. "మంచి నేర్పరి" అంది.

"స్టీఫెన్ నీ రంగు మారాలి." అంటోంది. "కొన్ని కండలు కూడ పెంచు......అయినా నీ వళ్ళు కొంచెం బాగు చేసుకుంటే మంచిది..."

డాక్టర్ వార్డ్ ఏమన్నాడో నేను విననేలేదు. నాకు వినాలనిపించలేదు.

కోపం పట్టలేక ఆ రోజు తొందరగా ఇంటికి వెళ్ళిపోయానని నేను ఒప్పుకోవాలి.

కేవలం జారిణి మాత్రమేకాక, అంత వేగంగా చెడుమార్గంమీద ప్రయాణం చేస్తున్న ఈ స్త్రీ దగ్గరే ఎందుకు ఉండిపోయానని మీరు అడగచ్చు.

నా జవాబు ఇది:—ఎందుకోగాని మిస్ కీలర్ విషయమై నాలో ఏదో 'పితృ ప్రభావం' ఉందనిపించింది—ఇటువంటి ప్రభావం ఆమెమీద ఇంతకి ముందు లేదు కదా! అంతేకాక, నాకు వీలయినంతలో ఆమె ప్రవర్తనని కొంత కాకపోతే కొంత అదుపులో పెడుతున్నానని భావించాను. నేనే లేకపోతే ఇంకా ఎంత అధ్వాన్నంగా తయారయేదో .... ప్రయత్నించాను. కాని, విఫలుడయ్యాను.

మిస్ కీలర్ జీవించే పద్ధతివల్ల ఏర్పడవలసిన పరిణామాలు ఏర్పడక తప్పలేదు. కళ్ళు ఉబ్బిపోయాయి. అసలే పాలిపోయినట్టున్న ఆమె చర్మం బుగ్గల మీద బిగుసుకుపోయింది. ఎండిన 'త్వక్‌పత్రం' లాగ జుట్టు మెరుగు తగ్గిపోయింది.

చిందర వందర అయిపోయిన ఆమె జీవితం చక్క పెట్టేందుకు ఎవరయినా సాయపడితే గాని లాభం లేదని స్పష్టం అయింది.

మనస్సు బాగా లేనప్పుడు వెక్కి వెక్కి ఏడ్చేది. ఆమె వెక్కిళ్ళు వంట గదిలోకి వినిపించేవి. ఆమెని ఓదారుద్దామని ఆమె పడక గదిలోకి వెళ్ళాను.

"హొగన్" అంది వెక్కిళ్ళ మధ్య. "హొగన్, నన్నేం చెయ్యమంటావు? పిచ్చెత్తినట్లుంది కొన్నెప్పుడు! ఎందుకిలా అయిపోయాను?

"నాకు నిజంగా పిచ్చెత్తుతుందా?"

అటు తిరిగి తలగడలో తల దూర్చి మరింత వెక్కి వెక్కి ఏడ్చేది.

పక్కమీద కూర్చుని ఇప్పుడు వచ్చిన కష్టం ఏమిటో చెప్పమన్నాను. ముందు సంకోచించినట్లు కనిపించింది. కాని నేను కొంచెం ఓపికపట్టి ఆమెను వేన్నాడుతున్న సమస్య ఎటువంటిదో అర్థం చేసుకున్నాను.

ఏడేళ్లకింద బ్రిక్స్‌టన్ జయిలు ఫాదరీ రాసిన ఉత్తరం ఒకటి చదివింది. ఈ జయిలులోనే ఆమె తండ్రి (హత్యానేరంపైన?) శిక్ష అనుభవిస్తున్నాడు.

తననివచ్చి జయిల్లో చూడవలసిందిగా మిస్ కీలర్ తండ్రి ఆమె తల్లిని కోరాడుట. దీనివల్ల అతను కారాగృహం వదిలి వచ్చిన తర్వాత వారిద్దరి మధ్య రాజీ కుదిరే అవకాశం ఏమాత్రం ఉందో తెలుసుకోవచ్చునని అతని ఆశ. ఈ విషయమే రాశాడు జయిలు ఫాదరీ.

మొదటిసారిగా, తన తండ్రి జెయిలులో ఉన్నాడని తెలుసుకుందిట మిస్ కీలర్.

అంతదాకా తన తండ్రి తన తల్లిని వదిలేసి పారిపోయాడనుకుందిట.

తన పెంపుడు తండ్రిని అడిగిందట. తన నిజం తండ్రిని గురించి. అతని సమాధానం: "అతను బాధ్యత తెలియని మనిషి—అచ్చు నీ పోలికే! మీరిద్దరూ ఒకే రకం!"

ఇది చెబుతూ ఉంటే మిస్ కీలర్‌కి మూర్ఛవచ్చినంత పనయింది. ఒక గ్లాసు బ్రాందీ ఇచ్చి నెమ్మది పరిచాను.


కోపంలో తన పెంపుడు తండ్రి అన్న ఈ మాటలు ఎప్పుడూ తన మనస్సులో మెదులుతూనే ఉండేవని ఆమె ఎన్నోసార్లు నాతో చెప్పింది.

చివరికి, తనూ హోలోవే జయిలులో ఏదో ఘోర నేరానికి విచారణ ఎదురు చూస్తూ ఉండిపోయినట్లు పీడకలలు వచ్చేవి.

ఈ విషయం తెలిసిన తర్వాత నాకొత్త యజమానురాలి మనసు తరచు మారటానికి కారణం మరికొంత బాగా అర్థం అయిందనే చెప్పాలి.

రాను రాను తనని ఆవరించే భయాలను గురించి నాకు చెప్పేది. అమాంతంగా వారాల తరబడి ఏదో ఊరికి వెళ్ళాలని ఎందుకు నిశ్చయించుకునేదో కూడా చెప్పేది.

# 'ఆమె చాలా బిగ్గరగా మాట్లాడేది'



## బట్లర్ జాన్ హోగాన్ కథనం-4

"తీగతీస్తే డొంకంతా కదిలింది"...

ఆ పరిసరాలలో— బర్మింగ్‌హామ్‌లో కానీండి, సోమర్‌సెట్‌లో ఒక చిన్న గ్రామం కానీండి— కీలర్ పేరుకల వ్యక్తి ఉన్నాడని వినేది. ఆ వ్యక్తి తప్పిపోయిన తన తండ్రే అయిఉండవచ్చుననే ఆశ కలిగేది.

తన సొంత తండ్రి దొరికితే, కథలలో చెప్పి నట్లు, అన్నీ సరయిపోతాయనీ ఒక ఊహ ఆమె మనస్సు మారుమూలలలో దాగి ఉండేది.

అతను దొరికేవాడు కాదనుకోండి. మరికొంత నిస్పృహతో తిరిగి వచ్చేది. రాత్రిళ్ళు సరిగ్గా నిద్రపట్టక, పొద్దున నేను లేచేసరికి కేకలువేస్తూ మేలుకొనేది.

అలా మేలుకొన్నప్పుడెల్లా ఒక చెడు ఊహ కలిగేది ఆమెకి—తను ఆస్పత్రిలో మేలుకున్నాననే ఊహ.

కాస్త సంతోషంగా ఉండేప్పుడు మాత్రం చిన్న పిల్ల అయిపోయేది.

మొదటిసారి ఎలుగుబంటి బొమ్మని పక్కనే పడుకోపెట్టుకుని ఉన్న ఆమెని చూసి ముద్దు వస్తోం దనిపించింది నాకు.

ఒంటరిగా 'పరమ పద సోపానపటం' (స్నేక్స్ అండ్ లాడర్స్) ఆడుకుంటూ సంతోషంతో కేరింతలు కొట్టుకోవటం చూశాను నేను.

మరోకసారి తెల్ల గొర్రె తోలు కంబళీమీద కూర్చుని, సన్నని 'నైట్‌డ్రెస్' మాత్రం వేసుకుని, పిల్లితో ఆడుకున్నట్లు కనిపించింది నాకు. ఆడుకుంటోందనుకున్నాను— కాని: ఆమె నిజానికి మార్జువానా సిగరెట్ పొగ పిల్లి మొహంలోకి ఊదుతోంది.

నిజం తెలిసిన తర్వాత ఆ విషయం ఆమెవద్ద ప్రస్తావించాను. కాని, అప్పటికే ఆమె 'ఈ' లోకంలో లేదు. ఏమి మాట్లాడిందో నా కేమీ అర్థం కాలేదు.

పిల్లిని తీసుకుని కొంచెం బ్రాందీ పాలు పట్టి కోలుకునేట్లు చేశాను.

ఆమె ఈ పనిని మళ్ళీ చెయ్యలేదు. పిల్లిని తన తల్లి 'ఇంటికి' తీసుకుపోయింది. ఇల్లంటే, చెక్కలతోనూ, ఎస్బెస్టాస్‌తోనూ కట్టిన కొంప అది. థేమ్స్ నది వద్దనే ఉండేది.

నాకు మార్జువానా వాసనంటే అసహ్యం. చాలా చెడ్డదనిపించేది ఎందుకోగాని.

అయినా ఆమెని ఈ అలవాటునుంచి తప్పించేందుకు ఏమీ చెయ్యలేకపోయాను. చెప్పలేకపోయాను.

ఒకసారి, ఈ సరుకు పొట్లం దొరికింది నాకు. బయటికి చూడటానికి చాక్లెటు పొట్లం లాగుంది.

ఆమె దాన్ని అలమారులో ఒక పాత బిస్కెట్ డబ్బాలో దాచింది.

అన్నీ పోగొట్టుకున్నవాడు...



శ్రీ ప్రొఫ్యూమో శ్రీమతి ప్రొఫ్యూమో

# క్రిస్టీన్ కీలర్ కథ

ఈ చెత్తని కాలవటంవల్ల వచ్చే ప్రమాదాలను గురించి చెప్పి చెప్పి చూశాను. లాభం లేక పోయింది. ఏమి[ట్రా అంటే, నాకూ ఒకటి ఇచ్చింది కాలవమని. వద్దన్నానుకోండి.

అప్పటికే మిస్ కీలర్‌లో స్పష్టంగా వస్తున్న మార్పును గమనించాను. ఆమె అందం ఏవిధంగా నమసిపోతోందో ఇంతకిముందే చెప్పాను. కాని క్రమంగా ఆమె పురుష సంపర్కం, పరమపద సోపానపటంలాంటి ఆటల విషయం తప్ప మరెందులోనూ ఆసక్తి చూపటం ఆపేసింది.

పని చెయ్యటం మానుకుంది. డబ్బుకి కూడా ఇబ్బంది పడుతున్నట్లు కనిపించింది. అదృష్టవశాత్తు ఆమె స్నేహితులని సత్కరించే సమయానికి నేను ఉండేవాడినికాదు కాని. తెల్లవారున మాత్రం జరిగిన దానికి కావలసినంత సాక్ష్యం దొరికేది.

ఒకటి రెండుసార్లు నేను ఆలస్యంగా ఇంటికి వెళ్ళినప్పుడు ఆమె కోసం వచ్చేవారిని చూసే అవకాశం కలిగింది. ఆమెకి నచ్చిన మగవారి 'రకం' కూడా మారింది.

చాలా నీచంగా కనిపించారు. శుభ్రం అనల్లేనివారు, గడ్డాలు గీసుకోని వారు వచ్చి తలుపు తట్టేవారు. లేదా మిస్ కీలర్ (బహుశ) ఇచ్చిన తాళం చెవితో తలుపు తామే తెరుచుకుని లోపలికి వచ్చేవారు.

చాలామంది నీగ్రోజాతివారు వచ్చేవారు.

పొద్దున నేను వచ్చేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉండేది. పార్టీ జరిగిన తర్వాత మిగిలే చెత్తతోబాటు సిగరెట్ పీకలు కూడా కనిపించేవి.

ఇక మిస్ కీలర్—మిట్ట మధ్యాహ్నందాకా నిద్రపోయేది. ఆమెని లేపుదామని నేను ప్రయత్నం చేసేవాడినికాదు. నా కాలం వృధా అని నాకు తెలుసు.

దాని బదులు అంతా శుభ్రం చేసే వాడిని, నా పని ఊడి పోకుండా ఇంకా ఎంతకాలం ఉంటుందా అని ఆలోచిస్తూ.

నిజం చెప్పాలంటే నేను విసిగిపోయాను. ఒక రోజు వచ్చి మిస్ కీలర్ ఒక మగ మిత్రుడితో కలిసి స్నానం చేస్తోందని తెలుసుకుని, ఆమె అవినీతి లోతుల్ని అందుకుంది కదా అనుకున్నాను. టబ్‌లో కూర్చుని వా రిద్దరూ కేవలం 'షాంపేన్' (ఒక రకం మద్యం) సేవిస్తున్నారన్న సంగతి తెలిసి కూడా పని వదులుకుందామన్న నిర్ణయం మార్చుకోలేదు నేను. ★

---

# ఆసియా కథ

27 వ పేజీ తరువాయి

"ఓక్—హీ, నా తల్లీ! క్షేమంగా ఉన్నా వదే చాలు. అమ్మ, ఇదుగో ఏడవక! బాగానే ఉన్నావుగా, చెప్పు! నాతో ఉంటే చాలు, అంతా సరిగ్గా ఉంటుంది. అంతే నా క్కావల్సింది. ఇంకెవరూ అక్కర్లేదు!"

మరునాడు కిండర్ గార్డెన్ నుంచి తిరిగివస్తూ నేను చేసిన పని గుర్తుకి వచ్చింది. మా అమ్మమీద జాలి కలిగింది. ఇవాళ ఆమెకి సంతోషం కలిగే పని ఏదయినా చెయ్యాలి. ఏమిటి ? కిండర్ గార్డెన్ గదిలో ఉంచిన పూల సంగతి జ్ఞాపకం వచ్చింది. ఆ గదిలోకి తిరిగి వెళ్ళాను. ఎవరూ లేరు. టీచర్ కూడా లేరు. రెండు పూలు తీసుకుని ఇంటికి పరుగెత్తాను. మా అమ్మ నన్ను దగ్గరికి తీసుకుని "ఎంత చక్కటి పూలు ! ఎక్కడివి ?" అంది. ఏం చెప్పాలో తెలీలేదు నాకు. నిజంగా చెప్పటానికి భయపడ్డాను. నేను చెప్పిన జవాబుకి నాకే ఆశ్చర్యం వేసింది. "బయట గదిలో కొత్త బాబాయి నీకు ఇవ్వమని యిచ్చాడు....." మా అమ్మ బెదిరిపోయినట్లు కనిపించింది. ఆమెకి నోట మాట రాలేదు. మొహం పువ్వులాగ ఎర్రబడింది. చివరికి తెప్పరిల్లి, వణుకుతున్న కంఠస్వరంతో ఇలా అంది: "నువ్వు పుచ్చుకుని ఉండకూడదు !" ఆమె ఇంత బాధపడినందుకు నేను ఆశ్చర్యపడ్డాను. కాని, నా అబద్ధం బయటపడలేదు. అమ్మ కోపం ఆయన మీదే కాని, నామీద కాదు ! కొంతసేపు తర్వాత ఆమె అంది : "అమ్మా, నువ్వు ఈ పూల సంగతి ఎవరితో చెప్పకూ !" అని. వాటిని అవతల పారేస్తుందనుకున్నాను కాని జాగ్రత్తగా ఒక సెజ్జలో పెట్టి, ఆర్గన్ మీద ఉంచింది. అలా రేకులన్నీ ఎండిపోయేదాకా అక్కడే ఉంచి, తర్వాత కాడలు కోసేసి 'తలల్ని' ప్రార్థన గీతాల పుస్తకంలో పెట్టింది.

ఆరోజు సాయంత్రం మా కొత్త బాబాయిని చూడటానికని వెళ్ళాను. ఆయన వళ్ళో కూర్చుని బొమ్మల పుస్తకం చూస్తూంటే ఒక శబ్దం విని గాబరాపడిపోయాడు ఆయన. లోపల గదిలోనుంచి 'ఆర్గన్' వాద్యం శబ్దం వినిపిస్తోంది. మా అమ్మే అయి ఉంటుందనుకుని చూసేందుకు లోపలికి పరిగెత్తాను. దీపం వెలిగించి లేదు కాని వెన్నెల కాంతిలో తెల్లని బట్టలు వేసుకుని ఆర్గన్ దగ్గిర కూర్చున్న మా అమ్మ కనిపించింది. కిండర్ గార్డెన్‌లో మా టీచర్ కన్నా బాగా వాయించింది. దగ్గిరగా వెళ్ళి నుంచున్నాను. కాని, ఆమె నన్ను చూసినట్లు లేదు. వాయిస్తూనే ఉండిపోయింది. ఆ తర్వాత పాడటం కూడా ప్రారంభించింది. ఆవిడ గొంతుక అంత అందంగా ఉంటుందని నాకు తెలీదు.

ఒకరోజు రాత్రి ఈ బాబాయి నుంచి తిరిగి రాబోతూ ఉండగా ఆయన నా కొక తెల్ల కవరు ఇచ్చాడు. మా అమ్మ చేతికి ఇవ్వమన్నాడు. "ఇది పోయిన నెల అద్దె, భోజనం ఖర్చులకి" అన్నాడు. అది మా అమ్మ కివ్వగానే ఆవిడ తెల్లపోయింది. కంగారుపడినట్టు కనిపించింది. "అద్దె భోజనం ఖర్చులకి అని చెప్పమన్నాడు" అన్నాను. దానితో తెప్పరిల్లింది. తర్వాత ఆమె మొహం ఎర్రబడింది. కవరు తెరిచి చూచింది. కొన్ని నోట్లు ఉన్నాయి. హాయిగా ఊపిరి తీసింది. కాని, ఇంతలో ఆమె ముఖంలో ఆశ్చర్యరేఖలు కనిపించాయి. లోపలనుంచి మడిచి ఉన్న చీటీ ఒకటి తీసింది. కొంచెం సందేహించి దాన్ని విడమరిచి చదివింది. దానిమీద ఏమి రాసిఉందో నాకు తెలీదు కాని, ఆమె చేతులు వణకటమే కాకుండా మొహం ఎర్రబడి పోయింది కూడా. కొంతసేపు తర్వాత ఆ చీటిని మడిచి డబ్బుతోపాటు తన కుట్టు సంచీలో పడేసింది. పడేసి మరికొంతసేపు నిశ్చలంగా కూర్చుని ఉండిపోయింది. ఊపిరి మాత్రం ప్రయాసతో తీసి వదులుతోంది. మా అమ్మకు జబ్బు చేస్తుందేమో అని భయపడ్డాను. "అమ్మా, ఇక పడుకుందాంరా" అన్నాను. "సరే!"అని నన్ను ముద్దు పెట్టుకుంది.

కొంతసేపటి తర్వాత నాకు మెలకువ వచ్చింది. మా అమ్మకోసం చెయ్యి చాపి తడిమి చూశాను. కాని, అక్కడ లేదు. భయంవేసి తల ఎత్తి చూశాను. కిటికీలోంచి పడుతున్న తెల్లటి వెన్నెలతో గదంతా వెలుతురుగా ఉంది.. ఒకమూల మా నాన్న బట్టలన్నీ ఉంచే ఒక పెద్ద పెట్టె దగ్గిరగా, తన తెల్ల పైజామాలలో కూర్చుని ఉంది అమ్మ. తనలో తనే ఏదో మాట్లాడుకుంటోంది. దగ్గిరికి వెళ్ళి వళ్ళో కూర్చుని "ఏమిటమ్మా చేస్తున్నావు ?" అని అడిగాను. మాట్లాడుకోవటం మానేసి కళ్ళు తెరిచింది. ఎంతోసేపు నావైపే చూసింది. తర్వాత మృదువుగా అంది :

"అమ్మా, ఓక్—హీ!"

"ఏమిటమ్మా ?"

"పడుకో వెళ్ళి."

"నువ్వూ రావూ ?"

"ఇదుగో వస్తున్నా" అంది. ఆమె మాటలు విచారంగా ఉన్నట్లు అనిపించాయి నాకు.

ఈ రోజుల్లో మా అమ్మని అర్థం చేసుకొనటం కష్టం. అంతకి మునుపు ఎన్నడూ చెయ్యని పన్లు ఎన్నో చేసేది.

సాయంత్రాల వేళల్లో ఆర్గన్ వాయించేది. కొన్నిప్పుడు పాట కూడా పాడేది. నేను సంతోషంతో వినేదాన్ని. అయినా చాలాసార్లు పాడుతున్నదల్లా వెక్కివెక్కి ఏడ్వటం మొదలుపెట్టేది.

ఒక ఆదివారంనాడు — కిండర్ గార్డెన్ వేసవి సెలవులకి మూసేశారు—తల నెప్పిగా ఉందని మా అమ్మ చర్చికి పోలేదు. మే మిద్దరం తప్ప ఇంట్లో వేరెవరూ లేరు. నన్ను పిలిచి ఇలా అడిగింది, "అమ్మా, మీ నాన్నని చూడాలని ఉందా ?"

"ఊఁ, నాకు నాన్న కావాలి" అన్నాను నేను. కొంతసేపు మా అమ్మ ఏమీ మాట్లాడలేదు. చివరికి నెమ్మదిగా అంది :

"అమ్మా, నువ్వు పుట్టేముందే మీ నాన్న పోయాడు. నీ తండ్రి ఇక్కడలేడిప్పుడు. కాని, నీకు క్రొత్త తండ్రి ఉండటానికి వీల్లేదు. ఉంటే ఇక్కడి మనుష్యులంతా నిన్నూ, నన్నూ తిడతారు. నీకు లోకంతీరు తెలీదు. ఇక్కడివాళ్ళు నిన్ను తిడతారు. మీ స్నేహితులంతా నిన్ను చూసి నవ్వుతారు. నీకొక మంచి కుర్రాడితో పెళ్ళి అవదు. ఎంత బాగా చదివినా నిన్నెవరూ పొగడరు !" ఇంకా ఇలా అంది నాతో : "ఓక్—హీ నన్ను వదలకూడదు నువ్వు ! మీ అమ్మతోనే ఉండు. నేను ముసలిదాన్నయినా సరే, నాతోనే ఉండు ..... కిండర్ గార్డెన్, గ్రామర్ స్కూల్, హైస్కూల్—అన్నీ పూర్తిచేసి యూనివర్సిటీకి వెళ్ళినా సరే. ఓక్—హీ నేనంటే నీ కెంత ప్రేమ ? చెప్పగలవా ?"

"ఇంత !" అన్నాను రెండు చేతులూ చాపుతూ.

"ఓ హో, అంతా! మంచిదే! ఎప్పుడూ మీ అమ్మంటేనే నీకు ప్రేమ కదూ ! స్కూలు కెళ్ళి బాగా చదువుకుని చక్కటి అమ్మాయిగా ఎదిగినా ? అంతేనా ?"

"అవునమ్మా, నువ్వంటే నా కింత ఇష్టం !" అని నేను చేతులు రెండూ వెడంగా ఇంకా వెనక్కి

చాపాను. "అవును తల్లి, మీ అమ్మకు తక్కినవాళ్లనవసరం. ఎందుకూ పనికిరారు !" అంటూ మా అమ్మ నన్ను గట్టిగా కావలించుకుంది.

తెల్లవారింది. రోజంతా గడిచింది. సాయంత్రం మా అమ్మ నన్ను పిలిచి, తల దువ్వి, కొత్త బట్టలు తొడిగింది. ఎక్కడికి వెడుతున్నానని అడిగాను. "నువ్వెక్కడికీ వెళ్లటంలేదు," అంది నవ్వుతూ ఆర్గన్‌మీద నుంచి, మడిచి ఉన్న తెల్లని రుమాలు ఒకటి తీసి ఇస్తూ "ఇది .... ఇది ఈ బాబాయి రుమాలు. ఆయనకిచ్చేసి వెంటనే తిరిగి వచ్చేసెయి" అంది. రుమాలు లోపల ఏదో కాగితం ముక్క ఉన్నట్లు దానిని తీసుకుపోయేప్పుడు గ్రహించాను. మా బాబాయికి ఇచ్చాను. ఈసారి ఆయన వాలకం పూర్తిగా మారిపోయింది. నన్ను చూసి నవ్వనే లేదు.

ఓరోజు మధ్యాహ్నం ఆయన గదిలోకి వెళ్లాను. సామాను కట్టేస్తున్నాడు. రుమాలు చేతికిచ్చినప్పటి నుంచి మనిషి మారిపోయాడు. విచారంగా ఉండేవాడు. ఎక్కువ మాట్లాడకుండా నావంకే చూస్తూ ఉండిపోయాడు. విసుగుపుట్టి ఆయన దగ్గరికి వెళ్లటం మానేశాను. కాని, ఇప్పుడు ఇలా సామాను మూట కట్టటం చూసి ఆశ్చర్యపడ్డాను. అమ్మ దగ్గరికి పరుగెత్తాను.

"అమ్మా, బాబాయి ఎందుకని వెళ్లిపోతున్నాడు?"

"స్కూలు మూసేశారు కాబట్టి !"

"ఎక్కడికి వెళ్లిపోతున్నాడు ?"

"వాళ్ల ఇంటికి."

"మళ్లీ తిరిగి వస్తాడా ?"

మా అమ్మ జవాబు చెప్పలేదు. మధ్యాహ్నం బాబాయి వెళ్లిపోయిన తర్వాత ఆయనిచ్చిన బొమ్మతో ఆడుకుంటున్నాను. అమ్మ వంటగది లోంచి వచ్చింది.

"కొండమీదికి పోదామా ?" అంది.

"ఓ, తప్పకుండా ! నాకు చాలా యిష్టం ! రా!"

ఇద్దరం కొండపైకి ఎక్కి వెళ్లాము, చేతులు పట్టుకుని. మలుపు తిరిగి వచ్చింది. రైలుబండి. ఈల వేసుకుంటూ వచ్చి స్టేషన్‌లో ఆగింది. వెంటనే మళ్లీ బయలుదేరి వెళ్లిపోయింది.

మేము దిగి, ఇంటికి వచ్చేసిన తరువాత అమ్మ లోపలికి వెళ్లి ఆర్గన్ పెట్టె మూసేసి తాళం వేసింది. దానిమీద కుట్టు సంచీ ఉంచింది. ఆపైన ప్రార్థన గీతాల పుస్తకం తెరిచి, లోపల వత్తి ఉన్న ఎండు పువ్వులని తీసి, "వీటిని అవతల పారెయ్యి !" అంది. అదే సమయంలో మా ఇంటి గేటు తెరుచుకుని వచ్చాడు గుడ్లు అమ్మే మనిషి.

"ఇకపైన గుడ్లు కొనము ! ఇక్కడ గుడ్లు తినేవారెవరూ లేరు," అంది నిర్జీవమయిన, నెమ్మది గొంతుకతో. నాకు గుడ్లు కొన్ని కొని పెట్టమని అడుగుదా మనుకున్నాను కాని పాలిపోయిన ఆమె మొహం చూసి ధైర్యం చాలక ఆగిపోయాను. నా బొమ్మ చెవిలో రహస్యంగా అన్నాను.

"అమ్మ అబద్ధం చెప్పింది. నాకు గుడ్లంటే ఇష్టమని అమ్మకి తెలుసు. కాని, అమ్మ వంట్లో బావున్నట్లు లేదు. పాలిపోయి ఉంది. ఇప్పుడు దేనికోసమూ అడగను !" ★

# రామ చరిత మానస



· తులసీదాసు ·

తెలుగు

ముంగర శంకర రాజు

## 7

### శ్రీ సీతారాముల కల్యాణము

**ఇవ్విధముగ పరశురాముడు నిష్క్రమించగనే రాజమండలి రాముని మహిమ గుర్తించెను.**

పెన్నిధి లభించిన పేద చందమున మిధిలాపతి మేను హర్షాతిరేకముచే పులకరించిపోయెను. రాజు కౌశికుని చెంతకు వచ్చి కరములు ముకుళించి— "ఓ ఋషీశ్వరా! రామలక్ష్మణులు నా ప్రతిజ్ఞ పూర్తి చేసి నన్నుద్ధరించిరి. ఇది యంతయూ మీ కృపా కటాక్షము వలననే జరిగినది. ఇక మిగిలిన కార్యము కూడ మీరు సంపన్నము చేయవలసినదిగా వేడుకొనుచున్నా" ననెను.

"రాజా ! సీతాకల్యాణము శివధనుస్సుపై ఆధారపడి యుండెను. అది ఎప్పుడు విరిగెనో అప్పుడు వైదేహి వివాహము స్థిరపడిపోయెను. అయోధ్యా నగరమునకు వెంటనే వర్తమాన మంపి, మీ వంశాచారము, వేదోక్త ప్రకారముగ వివాహము చేయుటకు సర్వము సన్నద్ధము చేయించుము." అని విశ్వామిత్రుడు జనకునికి ఉపదేశించెను.

రాజు తక్షణమే ఒక దూత చేతికి శుభలేఖ యిచ్చి అయోధ్యకు పంపెను. పిమ్మట పురజనులను రావించి పట్టణములోని గృహములను, దేవ మందిరములను, రాజమార్గములను, విపణి వీధులను చక్కగ అలంకరించవలసినదని ఆదేశించెను. రాజాజ్ఞ ప్రకారం పురప్రముఖులు ప్రవీణులగు శిల్పులను, నేర్పరులగు కళాకారులను, ఆరితేరిన పనివాండ్రను రావించి నగరమును శృంగారించుటకు నియోగించిరి.

వేలాది పనివాండ్రు కార్య నిమగ్నులై విదేహ నగరిని వివిధ రీతుల సింగారించిరి. అచ్చటచ్చట కాంచనముతో చేయబడిన కదళీ తరువులు నిలిపిరి, వానికి నీలమణులచే ఫల పత్రములు, పద్మరాగములచే పువ్వులను అమర్చిరి. మరొకచోట హరితమణులచే వంశ వృక్షములు నిర్మించిరి. ఇంకొక స్థలమున లేత బంగారుచే నాగవల్లీ నికుంజము లేర్పరచిరి. కొండొకచోట మరకత మాణిక్య వజ్ర వైఢూర్యాది నవరత్నములను తొలిచి పద్మ పుష్పములు సృజించిరి. వానిపై గాలిపాటులకు కదలుచూ కమ్మని ధ్వని చేయుచుండులాగున రంగు రంగులలో భృంగములు చిత్రించిరి. మంగళ ద్రవ్యములు గల పళ్లెరములు పట్టుకున్న ప్రతిమలను స్తంభములకు చెక్కిరి. రాజమార్గమునందు మంచి ముత్యములచే రంగవల్లులు దీర్చిరి. ఫలపత్ర పుష్పసహితముగ శోభించు ఆమ్ర ద్రుమములను అక్కడక్కడ నిలబెట్టిరి.

తోరణములతో, ధ్వజములతో, పతాకములతో, మణిమయ దీపకాంతులతో, ప్రతి ఇంటిని అలంకరించిరి. జనకపురిలోని ప్రతి ఇల్లు రాజసౌధం వలె విరాజిల్లెను. సీతారాముల వివాహవేదిక కల్యాణ మంటపముల వైభవము వర్ణించుట ఎవరికి సాధ్యము ! అప్పటి మిధిలానగరి వైభవమునకు పదునాల్గు భువనములు సాటి రావు. అచ్చటి దరిద్రుని ఆనందానికి ఆ దేవేంద్రుని సుఖము దీటు గాదు. మారురూపున మహాలక్ష్మియే అవతరించి యున్న మిధిల వైభోగము చూచుటకు రెండు కండ్లు చాలవు—వర్ణించుటకు వేయి నాల్కలు గల శేషునికి సాధ్యముగాదు.

జనకుడు పంపిన రాజదూతలు అయోధ్య చేరిరి. శ్రీ రామలక్ష్మణుల శుభ వృత్తాంతము తెలుసుకొని అయోధ్యావాసులు అమితానందము పొందిరి.

దశరధుని చేతులలో శుభలేఖ ఉండెను, హృదయము పుత్ర ప్రేమతో నిండెను. రాజుకు కొద్దిసేపు నోట మాట రాలేదు. శరీరము పులకరించెను. కన్నులనుండి ఆనందాశ్రువులు రాలెను. ఉత్సాహముతో దశరథుడు లేఖ చదివెను. భరత శత్రుఘ్నులకు చదివి వినిపించెను. సభికులకు తెలిపెను. వసిష్ఠుని రావించి అతనికి శుభలేఖ అందించెను.

పిమ్మట దూతలను చెంత కూర్చుండబెట్టుకుని ప్రేమాతురుడై "సోదరులారా, బిడ్డలు క్షేమముగా యున్నారు గదా, పెద్దవాడు నల్లగను, చిన్నవాడు ఎర్రగను ఉందురు, వారు ధనుర్బాణములు ధరించియుందురు, వారి వెంట కౌశికుడు ఉండును. వారి పోలికలను మీరు గుర్తించితిరి గదా ! జనకరాజుకు వారెట్లు పరిచితులైరి. ముని వెంట వెళ్లినదాది వారి సమాచారమే తెలియలేదు." అని పలువిధముల ప్రశ్నలు వేసెను.

"రాజాధిరాజ దశరథ మహారాజా ! రామలక్ష్మణుల వంటి కుమార రత్నములను కన్న మీ భాగ్యమేమని కొనియాడగలము" అని పొగడి రాజదూతలు రామలక్ష్మణులను గురించి విన్నదీ, చూచినదీ—అనగా తాటకి మారీచాదులను వధించుట, అహల్యకు ముక్తి నిచ్చుట శివధనుస్సు త్రుంచుట, పరశురాముని పరాభవించుట మొదలగు రామలక్ష్మణులు చేసిన ఘనకార్యములు వారు రాజుకు వివరముగ వర్ణించి చెప్పిరి. తనయుల గుణ గణములు, కీర్తి ప్రతిష్ఠలు, దూతల ముఖతః వింటున్నప్పుడు ఆ తండ్రికి కలిగిన పుత్రోత్సాహము అపూర్వమైనది. దశరథుడు మహదానందము పొంది జనకుని రాజదూతలను బహువిధ పారితోషికములచే ముంచెత్తివేసెను.

అచ్చటనుండి రాజు అంతఃపురమునకు పోయి తన మువ్వురు రాణులకు, రాణివాస స్త్రీలకు ఈ శుభ వర్తమానము తెలియజేసి రామలక్ష్మణుల ప్రగతి ప్రభావమును అనేకవిధముల వర్ణించి చెప్పెను.

మంగళకరమగు శుభవార్త చెవుల బడగానే ముగ్గురు రాణులు మహదానందము పొందిరి. కౌసల్యాది అంతఃపురాంగనలు సంతోషముతో భూరిభూరి ధానధర్మాదులు చేసి బ్రాహ్మణులను, యాచకులను సత్కరించిరి.

ఈ సంతోషవార్త సాకేత నగరమంతయూ వ్యాపించెను. ఇంటింట, వీధి వీధి సంతోషము స్రవంతులై ప్రవహించెను. అంగళ్లు అలంకరించి, గృహములు శృంగారించి, వీధులు శుభ్రపరచి, పచ్చని తోరణములు వ్రేలాడగట్టి, పన్నీరు

సుగంధాది ద్రవ్యములు వెదజల్లి మంగళవాద్యములు మ్రోగించి, వేదములు పఠించి పాటలు పాడి, పరస్పరము అభినందనలు తెలియజేసుకొని నగర ప్రజలు యావన్మందీ ఆనందాబ్ధి మునిగి తేలిరి. ఆహా ! ఆనాటి సాంకేత నగర ఆనందానుభూతి ఏమని చెప్పగలము. శ్రీరాముడు అవతరించిన అయోధ్యకు అట్లాంటి ఆనందము అబ్బుటలో ఆశ్చర్య మేమున్నది.

వసిష్ఠుల ఆనతి గైకొని, పెండ్లి ప్రయాణమునకు సర్వము సమాయత్త పరచమని రాజు భరతునికి ఆజ్ఞాపించెను. భరత శత్రుఘ్నుల పర్యవేక్షణ క్రింద మంత్రులు, సేనాపతులు, సేవకులు ప్రయాణ సన్నాహములు ప్రారంభించిరి.

చతురంగ సేనావాహినులు ఊరికి వెలుపల సమాయత్తము చేయబడెను. వాయువేగ మనో వేగమును ధిక్కరించు గుర్రములను అయిదేసి వరుసలుగా నిలబెట్టిరి. అస్త్ర శస్త్రములు ధరించిన రాజకుమారులా యశ్వముల నధిష్ఠించి యుండిరి. కత్తిసాములందు గడితేరిన ఇద్దరేసి భటుల చొప్పున ఆ గుర్రముల కిరుప్రక్కల కత్తులు బట్టుకొని నిలబడిరి.

బంగారు అంబారీలు కట్టిన మద గజములను ఒక ప్రక్కగా నిలబెట్టిరి. శ్యామవర్ణములు గల సైంధవములు పూన్చిన రథములు పంక్తులు దీరెను. పల్లకీలు, బండ్లు, కావడి మోతగాండ్రు మొదలైన వాహనములు నిర్ణీత స్థలములందు చేరెను.

మంత్రులు, సామంతులు, సేనాపతులు వంది మాగధులు, విదూషకులు, నట నటీవర్గము, రాజ పరివారము, పురజనులు వారి వారికి నిర్ణయించిన వాహనముల నధిష్ఠించిరి.

వంశాచార ప్రకారం వివాహమునకు పూర్వము చేయవలసిన శుభకార్యములు నిర్వర్తించి, ముత్తయిదువలు మంగళహారతులు బట్టుచుండ—సౌధోపరి భాగముల నుండి సుమన వర్షము కురియుచుండ మంగళవాద్యములు ధ్వనించుచుండ, దశరథరాజు భవనము నుండి వచ్చి సాలంకృత స్యందనముపై సుఖాసీనుడయ్యెను. వారి వరుసనే మరొక రథముపై కుల గురువు వసిష్ఠులవారు ఆసీనులైరి. ఆ వెంటనే రాణులు, రాజపుత్రులు, రాజ పరివారము తమకై ప్రత్యేకించిన వాహనముల నారోహించిరి.

ఇట్లు సర్వము సమాయత్తమయిన పిమ్మట శుభలగ్నమున శంఖధ్వానములు చేసి "బరాత్" (మగ పెండ్లివారు) మిథిలా నగరానికి బయలు దేరిరి. దశరథమహారాజు వచ్చుచున్నాడను వార్త తెలిసి, జనకుడు మార్గము చక్క బరచి వంతెనలు కట్టించి ఆహార పానీయాదులతో మజిలీ లేర్పరచి వారి ప్రయాణము సుఖ కరముగ నుండునట్లు చేసెను.

పెండ్లివారు మిథిల సమీపించగనే జనకభూపతి ఫలములు, పుష్పములు సుగంధ ద్రవ్యములు, భోజనపదార్థములు, వస్త్రములు, రత్నములు మున్నగు కానుకలు తీసుకొని వారికి ఎదురేగెను. రెండు ఆనంద సముద్రములు గట్లు తెంచుకొని కలియుచున్నవా ! అన్నట్లు ఉభయ పక్షములవారు ప్రీతిపూర్వకముగ పరస్పరము కలుసుకొనిరి. జనకుడు సమస్త రాజ మర్యాదలతో వారిని తోడ్కొని వచ్చి, సర్వ సౌకర్యములు కలిగిన విడిది గృహములలో వారిని దింపెను.

వరుని పక్షమువారు వచ్చినారని తెలియగనే సీత అష్ట సిద్ధులను స్మరించి, పెండ్లివారికి ఏలాటి లోటు లేకుండా సర్వ సౌకర్యములు కల్పించమని వానిని కోరెను. పెండ్లివారు ఇంద్రలోక సౌఖ్యముల ననుభవించుచూ జనకుని ఐశ్వర్యమును వేనోళ్ల మెచ్చుకొనుచుండిరి.

దాహము గొన్నవాని వద్దకు తటాకమే బయలు దేరినట్లు విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వెంట బెట్టుకొని దశరథుని దర్శించుటకు వారున్న చోటుకు వెళ్లెను. కౌశికుని చూడగానే దశరథుడు దిగ్గునలేచి ఎదురువెళ్లి ఋషికి సాష్టాంగపడి నమస్కారముచేసి అతని పాదధూళి శిరమున కద్దు కొనెను. గాధిసూనుడు రాజును కౌగలించుకొని ఆశీర్వదించెను. పిమ్మట రామలక్ష్మణులు తండ్రి పాదములకు నమస్కారము చేసిరి. పుత్రులను చూడగనే తండ్రికి పోయిన ప్రాణము తిరిగి వచ్చినట్లయ్యెను. దశరథుడు మనసారా బిడ్డలను హృదయమునకు హత్తుకొని ఆనందాశ్రువులు రాల్చెను. అనంతరము రామలక్ష్మణులు వసిష్ఠులకు, బ్రాహ్మణులకు ప్రణమిల్లి, భరత శత్రుఘ్నులను కలుసుకొనిరి. అయోధ్యనుండి వచ్చిన బంధు బాంధవులను చూచి రామచంద్రుడు పరమానందభరితుడై వారిని మధుర వచనములచే పల్కరించి పరామర్శించెను. శ్రీరాముని వినయ విధేయతలు చూచి అయోధ్యావాసులు ఆనందమందిరి. ధర్మార్థ కామ మోక్షములు సాక్షాత్కరించి నిలబడియున్నట్లు తన చుట్టూ చేరిన నల్వురు పుత్రుల మధ్య సాకేతాధీశుడగు దశరథుడు శోభించెను. పుణ్యులగు ఆ తండ్రీ తనయుల భాగ్యము నేత్రపర్వముగ తిలకించుచున్న మిథిలాపురవాసుల హృదయములు చల్లబడెను.

"సీతారాముల కల్యాణము కన్నులారా చూడబోవుచున్న మిథిలాపురవాసుల అదృష్టమే అదృష్టము. దశరథ జనకులు ఎంతటి సుకృతాత్ములైన వియ్యంకులు ! వారు చేసిన పుణ్యమే వారి కడుపున సీతారాముల రూపముతో అవతరించినది. జనకుడు, దశరథుడు పుణ్యపురుషులు, సీతారాములు శోభానముద్రులు. ఎంత చక్కని సంబంధము, ఎంత ముచ్చటైన అనుబంధము కొలిచి. ఆహా ! దశరథుని నల్గురు పుత్రులకు మిథిలయందే సంబంధ మేర్పడిన ఎంత బాగుండును !" అని మిథిలాపుర స్త్రీ పురుషులు ఆశించుచూ దేవుని ప్రార్థించిరి. బ్రహ్మ స్వయముగ శ్రీ సీతారాముల వివాహ మహోత్సవమునకు సుముహూర్తము నిర్ణయించెను. హేమంతఋతువు, మార్గశీర్ష మాసమున గ్రహ, వార, నక్షత్ర, తిథి యోగములు శుభముగ కూడినవేళ లగ్నముకట్టి బ్రహ్మ దానిని నారదుని చేతి కిచ్చి జనకుని వద్దకు పంపెను. జనకుని పురోహితులు కూడ అదే వేళకు ముహూర్తము నిర్ణయించి యుండిరి. మంగళకరమగు గోధూళివేళ అన్ని విధముల బాగుండునని శతానందుడు రాజుకు తెలియజేసెను. జనకుడు వెంటనే మగ పెండ్లివారిని యథోచిత మర్యాదలతో పెండ్లి మంటపమునకు తోడ్కొనిరమ్మని చెప్పెను.


రాజు ఆనతి చొప్పున మంగళ కలశములతో, సువాసినుల మంగళ గీతాలాపములతో, విప్రుల వేదపఠనములతో, శహనాయి, మృదంగాది మంగళ వాద్యములతో పెండ్లికూతురి పక్షమువారు పెండ్లి కుమారుని పిలుచుకుని వచ్చుటకు విడిది గృహమునకు చనిరి.

ఆడపెండ్లివారు దశరథ మహారాజును సమీపించి "రాజా ! ముహూర్తమునకు వేళ కావచ్చినది. ఇక తమరు దయచేయవలసిన" దని విన్నవించిరి. కోసలపతి కులగురువుతో సంప్రదించి, కులాచార విధులు నిర్వర్తించి, తన పరివార పరిజనములతో పెండ్లి ఇంటికి బయలుదేరెను.

శివ బ్రహ్మాది దేవతలు విమానారూఢులై శ్రీ సీతారాముల వివాహ మహోత్సవము చూచుటకు అంతరిక్షమున నిలచియుండిరి. దేవతలు, విద్యాధరులు సుమనవర్షము కురిపించి, సంతోషముతో దేహములు పులకరింప, దివినుండి ఆ వేడుకలను చూడసాగిరి.

దివ్య వైభముతో మిథిలానగరము దేవనగరిని మించి శోభించుచుండెను. సమస్త రాజ లాంఛనములతో సాకేతపతి సపరివారుడై మేళకము మధ్య నడచుచుండెను.

వారి మధ్యలో మూర్తీభవించిన అపవర్గ చతు



ధ్యేయముం బోలె రామ భరత లక్ష్మణ శత్రుఘ్ను లుండిరి. రామ భరతుల మేని ఛాయలు మరకత మణి దీప్తుల మెరయుచుండ, లక్ష్మణ శత్రుఘ్నుల శరీరములు స్వర్ణకాంతులు వెదజల్లుచుండెను.

శ్రీరామునిది నెమలి కంఠముతో సమానమగు కాంతి గల శరీరము. దానిపై నున్న ఉత్తరీయము మెరుపువలె భాసించు చుండెను. అతని కన్నులు నవ వికసిత నీల కమలములు. దివ్య భూషణాలంకృతుడగు శ్రీరాముడు ముత్యములు, మణి మాణిక్యాదులచే అలంకరించబడిన అందమగు అశ్వరాజము అధిష్ఠించి యుండెను.

మేఘము జూచిన మయూరమువలె నృత్య రీతిలో నడచుచున్న గుర్రముపై స్వారి చేయుచున్న శ్రీరాముని దివ్య మంగళ విగ్రహమును, దివినుండి తిలకించుచున్న దేవతలకు ఎంత జూచినను తృప్తి కలుగలేదు. శంకరుడు పదిహేను నేత్రములతో, బ్రహ్మ ఎనిమిది కండ్లతో, కుమారస్వామి పండ్రెండు నయనములతో, ఇంద్రుడు సహస్రాక్షులతో రాముని దర్శించిననూ సంతృప్తి లేకపోయెను.

ఇట్లు పెండ్లికి సంబంధించిన ఉభయ పక్షములవారు సంరంభ సంతోషములతో ముందుకు జనిరి.

పెండ్లివారు వచ్చు వేళకు, రూపమున రతీదేవిని లజ్జింపజేయగల అంతఃపురాంగనలు మంగళ హారతులు సిద్ధపరచిరి. మంగళాంగులగు అంగనామణులు వివిధ వస్త్రాలంకార భూషితులై మణిమయ మంజీర కంకణములు ఘల్లుఘల్లున మ్రోగుచుండ, కోకిల కంఠమున పాటలు పాడుచూ స్వర్ణకలశములు తీసుకొని పెండ్లివారికి ఎదురేగి శచీ శారద లక్ష్మి సరస్వతీ మున్నగు దేవాంగనలు సైతం మానవరూపమున వచ్చి జనకపురి స్త్రీలతో కలిసియుండిరి. పుష్పముల ఘుమ ఘుమలతో, కలగానములతో, మంగళవాద్య నాదములతో భూమ్యాకాశములు ప్రతిధ్వనించుచుండ, ఆచంద్రవదనలు ఆనందకందుడగు శ్రీరామచంద్రునికి హారతి బట్టి ఆర్ఘ్య మిచ్చిరి. పిమ్మట పరచిన పట్టు వస్త్రముల మీద నడచుచూ వెళ్లి పెండ్లికుమారుడు వివాహమంటపము చేరెను. సువాసినులు శ్రీరాముని పెండ్లిపీటమీద కూర్చుండజేసి, హారతి బట్టి, మణి భూషణ వస్త్రాదులు దిగదుడిచి పారవేసిరి. పనివాండ్రు వాటిని స్వీకరించి శ్రీరాముని దీవించిరి.

ముని మనస్సులను సైతము భ్రమింపజేయగల వివాహ మంటపము యొక్క నిర్మాణశోభ వర్ణింప శక్యముగానిది. జనకుడు దశరథుని రాజలాంఛనములతో ఆహ్వానించి ఉచితాసనముపై కూర్చుండబెట్టెను. తదుపరి వశిష్ఠ, విశ్వామిత్ర నామదేవాది మహాత్ములను భక్తిశ్రద్ధలతో పూజించి రాజు స్వహస్తములతో వారికి ఆసనము లమర్చెను. వివాహమున కేతెంచిన సాకేతవాసుల నందరినీ జనకుడు దశరథుని వలెనే సత్కరించి వారిని సుఖాసీనుల జేసెను. తమ తమ నిజరూపములు మరుగు పరచి బ్రాహ్మణ వేషములతో బ్రహ్మ, విష్ణు, మహేశుడు, దిక్పాలురు, దినకరుడు మున్నగువారు వివాహమునకు వచ్చియుండిరి.



# రామచరితమానస్

అనంతరము జనక భూపతి, దశరథ మహారాజు ఇద్దరూ కలసి మెలసి లౌకిక, వైదిక శుభ కార్యములు జరిపించిరి. ఆ వియ్యంకుల ప్రేమానురాగములు, ఆదర్శమైన వారి అన్యోన్యత చూచిన వారు ముగ్ధులైరి.

వెంటనే వశిష్ఠుని ఆనతి ప్రకారము శతానందుడు వెళ్లి పెండ్లికూతురును తీసుకొని వచ్చుటకు సమయ మయినదని రాణితో చెప్పెను.

పురోహితుని పిలుపు వినగానే రాణియు, చెలికత్తెలు ప్రసన్నచిత్తులై వెంటనే పెద్ద ముత్తయిదువులను రావించి చేయవలసిన శుభకార్యములను ముగించి జానకిని సర్వాలంకార శోభితగా జేసిరి.

శోడశ రీతులలో చక్కగా శృంగారించబడిన సీతాకుమారిని వెంటబెట్టుకుని, అతి రూపవతులగు చెలులు గజగమనముతో కదలిరి. ఆ కాంతామణులు కమనీయ కంఠములతో గానము చేయుచుండిరి. వారి కర కంకణములు కాలి యందియలు కదలునప్పుడు ఘల్లుమనుచుండెను. శోభావతుల మధ్య పరమ శోభావతి పయనించుచున్నదా యున్నట్లు, శోడశ శృంగారవతులగు సుందరీ

“ఓహ్యా! డాక్టరు గారు మిమ్మల్ని చూద్దామని వచ్చారండీ!”

“వీల్లేదు! నాకిప్పుడు జ్వరంగా వుంది ఎవర్నీ చూడనన్నానని చెప్పు” పరధ్యానం ప్రొఫెసరు గారి చిరాకు.

కృష్ణమూర్తి (మద్రాసు)

మణుల మధ్య మైథిలి మెల్లమెల్లన అడుగులిడు చుండెను.

రూపరాశి, పునీతయగు సీత పెండ్లిమంటపము ప్రవేశించెను. పెండ్లివారు తమలో తాము ఆమెకు ప్రణమిల్లిరి. రామచంద్రుడు జానకిని దర్శించి పూర్ణ మనోరథు డయ్యెను. దశరథుని ఆనందము వర్ణింప శక్యముగాదు. మునిజనము దీవించిరి. దేవతలు పుష్పములు జల్లిరి. విప్రవరులు శాంతివచనములు పఠించిరి. మంగళ వాద్యములు మ్రోగెను. వైదేహి వివాహమంటపము చేరగనే సంరంభ సంతోషములతో మంటపమంతయూ కళకళలాడెను.

పిమ్మట వశిష్ఠుడు, శతానందుడు కులగురువు లిద్దరూ చేరి శుభకార్యములు ప్రారంభించిరి.

వివాహమునకు కావలసిన మధుపర్కము మొదలగు మంగళ ద్రవ్యములు కనక కలశములతో దెచ్చి పరిచారకులు సిద్ధము చేసిరి. ప్రారంభమున గౌరీ గణపతులను పూజించిరి. వారు ప్రత్యక్షమై పూజ లందుకొని వధూవరుల నాశీర్వదించిరి. సూర్యనారాయణుని సలహా మేరకు దేవతారాధన మొదలగు కార్యములు ముగింపబడెను.

పిమ్మట శ్రీరాముని సరసన జానకిని కూర్చుండబెట్టిరి. అపుడు ఆ నవవధూవరులు పరస్పరము ప్రేమతో వీక్షించుకొనిరి. ఆ సీతారాముల తొలి చూపుల యొక్క అర్థము మన బుద్ధికి, మనస్సుకు అవగతము కానిది.

హోమ సమయమున అగ్నిదేవుడు శరీరధారియై వచ్చి ఆహుతులను స్వీకరించెను. జనకుడు అతని పట్టపురాణి సునయన స్వర్ణపాత్రలందుంచిన మంగళ జలముతో అల్లుని పాదములు కడిగిరి. ఏ చరణకమలములు శివుని హృదయ సరోవరమున సదా శోభించు చుండునో ఏ పాద పద్మములను స్మరించిన మాత్రమున సకల కలిదోషములు హరించుకొని పోవునో, ఏ చరణ స్పర్శచే అహల్య తరించెనో, ఏ పాదములందు దేవగంగ అవతరించెనో, శ్రీరాముని ఆ దివ్య చరణములను జనకుడు ప్రక్షాళన చేసి భాగ్య మందెను.

కుల గురువు లిద్దరూ వధూవరులచే పాణిగ్రహణము చేయించి శాఖోచ్చారణ చేయించిరి. హిమవంతుడు పార్వతిని పరమేశున కిచ్చినట్లు సముద్రుడు లక్ష్మిని విష్ణువు చేతులతో ఉంచిన విధముగ జనక భూపతి వేదోక్త ప్రకారము తన పుత్రిక జానకిని శ్రీరాముని కిచ్చి సాలంకృత కన్యాదానము చేసెను. ఆ శుభసమయమున జయజయ ధ్వానములు చేసి, మంగళధ్వనులు మ్రోగించి, అక్షతలు, పుష్పములు జల్లి, పాటలు పాడి స్త్రీలు పురుషులు, దేవతలు, సర్వులు తమ తమ హర్షామోదములు తెలియజేసిరి.

పిమ్మట వధూవరుల వస్త్రములు ముడివైచి హోమమునకు ప్రదక్షిణము చేయించుచూ సప్తపది జరిపించిరి.

సప్తపదీ సందర్భమున శ్రీరాముడు తన కర కమలములతో సీత శిరస్సున సింధూర ముంచెను. తదనంతరము వశిష్ఠుని యాజ్ఞానుసారము వధూవరులు ఒకే పీఠముమీద ఆసీనులైరి. ఏక పీఠస్థులై ఉన్న కొడుకు, కోడలిని చూచి కోసలపతి హృదయము కల్పవృక్షము వలె ఫలించెను. శ్రీ సీతారాముల శుభ వివాహము సంపన్న మాయెనని సమస్త లోకములవారు తమ సంతోషము [illegible]

ఆపైన వశిష్ఠుని ఆనతి గైకొని జనకుడు మాండవి, శ్రుతకీర్తి, ఊర్మిళ ముప్పురు కన్యలను రప్పించెను. కుశ కేతుని కుమార్తె రూపగుణశీలయగు మాండవిని భరతునకు, అతి రూపవతియగు జానకి చెల్లెలు ఊర్మిళా కుమారిని లక్ష్మణునకు, సుహాసినీ సుగుణవతియైన శ్రుతకీర్తిని శత్రుఘ్నున కిచ్చి యథావిధి వేదోక్త ప్రకార వివాహములు జరిపించిరి. ఆ వధూవరులు ఎనముండుగురూ ఒండొరుల చూచుకొని తమ కనుగుణ్యమైన జోడు కుదిరిందని సిగ్గుతో సంతోషించిరి. జాగ్రత్స్వప్న సుషుప్తి తురీయావస్థలు నాలుగు తమ అధిదేవతలతో కూడి మూర్తీభవించి యుండునట్లు ఒకే మండపమందున్న ఆ నల్వురు దంపతులు చూపరుల దృష్టికి శోభించుచుండిరి.

దశరథుడు తన నలుగురు పుత్రులను, నల్వురు కోడండ్రను గాంచి సేవా శ్రద్ధా తపోభక్తి యనెడి చతుర్విధ క్రియలతో గూడియున్న ధర్మార్థ కామ మోక్షములను పొందినంత ఆనందము అనుభవించెను.

జనక చక్రవర్తి వధూవరుల కిచ్చిన కానుకలు, కట్నములు లెక్కించుట సాధ్యపడదు. బంగారు, రత్నములు, చీని చీనాంబరములు, రథములు, ఏను

**గుఱ్ఱములు, గు(రములు, కామధేనువుల వంటి గోవులు, దాసదాసీలు మొదలగు అమూల్య వస్తుసంపదను** అల్లుం(డకు చదివించెను. ఇట్లు యథావిధి వివాహ విధులన్నియూ ముగియగనే జనకరాజు వివాహ మునకు వచ్చిన అతిథులను, బంధువులను మగ పెండ్లివారిని, మునీశ్వరులను, దేవతలను యథో చిత భక్తి(శద్ధలతో సత్కరించెను. కడపట జన కుడు అతని తమ్ముడు కుశకేతుడు దశరథుని చెంతకు వచ్చి చేతులు మోడ్చి, వినయ విధేయత లతో ఇట్లు పలికిరి. "ఓ కోసలాధీశ్వరా! మీతో సంబంధము మాకు గౌరవ(పదమైనది. మమ్ములను లను మీ దాసులుగా పరిగణించి ఈ నల్వురు బిడ్డ లను మీ సేవకురాం(డుగా స్వీకరించి (పేమతో పోషించవలసినది. కేవలము వర్తమాన మంపి ఇంత దూరము మిమ్ము రప్పించినందుకు క్షమించవల సినదని వేడుకొనుచున్నాము." అంతట దశరథుడు కూడ ఉచిత రీతిని వారికి సమాధానమిచ్చి సంతోష పరచెను.

ఆ వియ్యంకుల అన్యోన్యానురాగము, పరస్పర (పేమ, వర్ణింప శక్యముకాదు. పంచ వాద్యములు, దేవ దుందుభులు ధ్వనించుచుండ దశరథరాజు సపరివారుడై తన విడిదికి వేంచేసెను. వశిష్ఠుని యానతి (పకారము వధూవరులు అంతఃపురము లోనికి వెళ్లిరి.

(శీరామచం(దుని రూపురేఖా విలాసములు మాటిమాటికి చూచుటకు సీత సంకోచించు చుండెను. కాని, ఆమె మనస్సు మా(తము సిగ్గు పడుటలేదు. ఆ మీనాక్షి తృషితనే(తములు రాముని రూపజలములకై తహతహ లాడుచుండెను.

సర్వాలంకార శోభితుడైన రామచం(దుని దివ్య వి(గహము ధగధగద్ధాయమానమై దీప్తులు వెద జల్లుచుండెను. ఆ ముగ్ధరాలు తన ముంజేతి మణి కంకణములపై పడుచుండు (పియుని (పతి బింబము చూచుకొని సంతోషించుచుండెను.

రాణి వాసమందు, మగపెండ్లివారి విడిది గృహములందు ఆ నూత్న దంపతులచేత వసంతము చల్లింపచేసి, పూబంతు లాడించి (స్త్రీలు సరస వినోదముల దేలియాడిరి. అంతఃపురాంగనలు సీతా రాముల చక్కని జోడు మాటిమాటికి చూచు కొని తమ ముద్దు ముచ్చట్లు తీర్చుకొనిరి.

జనకుడు పెండ్లివారిని విందుకు ఆహ్వానించెను. ష(డసోపేతమై, పంచభక్ష్యములతో కూడిన ఆ విందు వైభవము అపురూపమై యుండెను. పెండ్లివారు సరసోక్తు లాడుకొనుచూ, ఒండొరు లపై ఛలోక్తులు విసురుకొనుచూ, హాస పరిహాస వినోదములతో విందారగించిరి. చందన తాంబూ లాదులచే జనకుడు అందరినీ సత్కరించి విడిదికి పంపించెను. పెండ్లివారు మిథిలాపురమందు నిత్య నూతనముగ విందులు చేయుచూ, వినోదములు చూచుచూ, ఉత్సవములు జరుపుకొనుచూ దివా రా(తములు క్షణమువలె గడుపుచుండిరి.

ఒకనాటి (పాతఃకాలమున దశరథుడు వశిష్ఠు నితో సం(పదించి ఋషీశ్వరులను (బాహ్మణు లను, యాచకులను ఆహ్వానించి, వారిని గోదాన, వ(స్త్రదాన, సువర్ణ దానాదులచే సత్కరించెను. ఈ సందర్భములో కోసలపతి కౌశికునికి (పత్యేకముగ **తన కృతజ్ఞతలు తెలియజేసి పూజించెను. వారు** దశరథుని వినయము, వితరణ శీలమును వేనోళ్ల కీర్తించుచూ తమ తమ నివాసములకు చనిరి.

ఇవ్విధముగ ఆమోద (పమోదములతో కతి పయ దినములు గడచెను. దశరథుడు (పతి **నిత్యమూ అయోధ్యకు (పయాణ మగుటకు** (పయత్నించును, కానీ, జనకుడు అడ్డు పెట్టు టచే ఆగిపోవుచుండెను. పెండ్లివారుభయులు (పేమపాశములచే బంధింపబడి ఒకరినొకరు వీడ లేకుండిరి.

(సశేషం)




## జరిగిన కథ

సురేఖను భాస్కరానికి భాస్కరాన్ని సురేఖకు పరిచయం చేస్తుంది, పద్మావతి. భాస్కరం సవతి తల్లి జానికమ్మగారు అతన్ని కన్నబిడ్డ కంటె ఎక్కువగా ప్రేమిస్తుంది. భాస్కరానికీ, కూతురు వసంతకూ ఒకేసారి వివాహం చేయాలని ఆమె ఆరాట పడుతుంది. తత్ఫలితంగా భాస్కరాన్ని పెళ్లిచూపులకు బలవంతంగా ఒప్పించి తీసుకెళ్తుంది. పెళ్లి కూతురు సురేఖ అని తెలియగానే భాస్కరం మనస్సులో కల్లోలం చెలరేగుతుంది. సురేఖ దొడ్డమ్మ అయిన ధనమ్మకు మాత్రం భాస్కరంలో అన్నీ మంచి గుణాలే కన్పించి ఎలాగైనా భాస్కరాన్ని తన అల్లుడుగా చేసుకోవాలని పట్టుదల పెరుగుతుంది. భాస్కరం పద్మావతిని ప్రేమించడం నిజమా, కాదా అనే సందేహం కూడా సురేఖకి కలుగుతుంది. ధనమ్మకు దూరపు బంధువు ముకుందరావును వసంతకు ఇచ్చేటట్లు కూడా అప్పుడే ఏర్పాటు జరుగుతుంది. తను సురేఖను వద్దంటే ధనమ్మ తన కూతురుకే ముకుందరావును ఇచ్చి చేస్తానంటోంది. చెల్లెలి సంబంధం తన మూలంగా చెడిపోతుందని భాస్కరం; ముకుందరావుని వివాహం చేసుకుందామని కల్లో గూడా అనుకోని సురేఖకు తను భాస్కరాన్ని వద్దంటే ధనమ్మ తనను ముకుందరావు కిచ్చి చేస్తుందేమో అన్న భయంతో సురేఖా ఎటూ మాట్లాడలేకపోతారు. చివరకి భాస్కరం తన పెళ్లి ఏడాది వాయిదా వేస్తాడు. ఇంతలో యూనివర్సిటీ తెరుస్తారు. సురేఖ, పద్మ యిద్దరూ ఎం. ఏ లో చేర్తారు. భాస్కరం కూడా ఫైనలియర్ పూర్తి చేయటానికి వస్తాడు. సురేఖ అంతా చెప్పిఉంటుందని భాస్కరం అనుకొని పద్మతో ఏమీ చెప్పలేకపోతాడు. పద్మావతిని కల్సుకొని ఎలాగైనా జరిగింది చెప్పాలని చాలా ప్రయత్నించాడు భాస్కరం. కాని చెప్పలేక పోయాడు. వసంత పెళ్లి జరుగుతోంది. అక్కడ సురేఖను ధనమ్మగారు జానికమ్మగారి కోడలు అని చెప్తుంది పద్మావతి హతాశయై వెళ్లిపోతుంది. మనస్సులోని చికాకువలన సురేఖకు సుస్తీ చేస్తుంది. పద్మావతికి ఆమె సవతి అన్న రాజు వేరే సంబంధాలు చూస్తుంటాడు. భాస్కరం సురేఖను వద్దని పిన్నితో చెప్పేస్తాడు. సురేఖ ధనమ్మగారికి భాస్కరానికి వివాహమాడనని చెప్పేస్తుంది. రాఘవేంద్రరావు జయమ్మ మనసు విరిచేస్తాడు. భాస్కరం మూర్తితో సంప్రదిస్తాడు. అంతలో పిన్నికి 'సీరియస్'గా వుందని వస్తుంది. పరిగెడతాడు.

## 57

ఇరవైఏళ్లకు పైగా కాపురం చేసినా జానికమ్మగారి గాంభీర్యాన్ని కదిలించగల నేర్పు గానీ, ధైర్యస్థిమితాలు గాని సుబ్బారావుగారికి లేవు. ఆమెకు జ్వరం తీవ్రంగా ఉన్నదంటే ఆందోళనపడ్డ సుబ్బారావుగారు అది కాస్త తగ్గి ఆమె లేచి తిరుగుతూ ఉండగానే, కోర్టు వ్యవహారాలలో తల దూర్చేసుకున్నాడు. వాస్తవానికి భాస్కరం వెళ్లిన నాలుగు రోజులలోనే ఆమెకు ఉష్ణం తీవ్రత తగ్గిపోయింది. కాని, ఆమె అదివరకు వసంత జ్ఞానం వచ్చిన తర్వాత చూడనంత యిదిగా చిక్కిపోయింది.

గుండెల్లో పోటుగా ఉంది. అని రక్తం తోడేస్తున్నట్లుగా ఉన్నదనీ అయిదారుసార్లు అన్నది కూడా — వసంత ముకుందరావు రాసిన ఉత్తరం కూడా మరోసారి చదువుకోలేదు. ఆ పిల్లకు అమ్మ గురించే బెంగపడిపోయింది.

జానికమ్మగారు ఉండి ఉండి ఎటో దీర్ఘంగా చూడటం — అలాగే కొద్ది క్షణాలు స్తంభించినట్లు వుండిపోడంచూసి వసంతకు బెంగ ఎక్కువైపోయింది. సరళా రామం పోట్లాడుకున్నారు ఆమధ్యాహ్నము. "అక్కయ్యకన్నా ఒదినె అందంగా ఉంటుంది" అన్నది సరళ — "అసలు వదినె రానే రాదు, అన్నయ్యకి యిష్టంలేదు" అన్నాడు రామం. మొదట వెక్కిరించుకున్నారు. ఆనక గిల్లిరక్కుకున్నారు. జానికమ్మగారు వాళ్లను విడిపించి హైరాన పడిపోయింది. "నువ్వూ వాడూ— (భాస్కరం) ఎన్నడూ ఇలా పోట్లాడుకోలేదు" అన్నదామె. "సరిలే! వీళ్ల పోట్లాటలైనా, ఐకమత్యమయినా నే నెన్నాళ్ళు చూడాలి కనుక— మీ అన్నయ్య వస్తే వాడికి అప్పజెప్పేస్తాను" అన్నడామె.

తర్వాత కాస్సేపాగి వసంతను కేకేసి "అన్నయ్యను రమ్మని రాశావా? ఏమిటి?" అన్నది.

వసంతకు ఏం చెప్పాలో తెలియలేదు.

"రాస్తాను" అన్నది.

నిరుత్సాహ పడిపోయిన జానికమ్మగారు, దాన్ని దాచేసుకుని "వద్దు వద్దు ఒకవేళ రాశావేమోనని భయపడ్డా — అనవసరంగా వాడి చదువు పాడౌతుందనీ—అలా అన్నా" నందామె.

కాని, ఆమె ఉద్దేశంలో వసంత తనకు తెలియకుండా భాస్కరానికి "రమ్మ"ని రాస్తేనే బాగుండుననిపించింది.

పనిపాటల మధ్య ఉండి ఉండి "పోనీ అమ్మాయి! వాణ్ణి రమ్మని వాడికి నచ్చిన సమ్మంధం ఏదో చెప్పమందునా! అదే చేస్తాను...." అంటూ ఉంటే వసంత ఇక ఉండబట్టక సుబ్బారావుగారితో చెప్పింది.

"నాన్నగారూ! అన్నయ్యని రమ్మని రాస్తాను" అని.

"ఎందుకమ్మా!—" —సుబ్బారావుగారు కాయితాల్లోనుంచి తల పైకి ఎత్తనేలేదు.

"నాకు చూడాలనుంది" వసంత మాటలకు ఉలిక్కిపడి—తన వెనుక నించున్నది జానికమ్మా? వసంతా? అన్నట్లు చూశారు సుబ్బారావుగారు.

భాస్కరం గురించి అంత స్పష్టంగా తనను వచ్చి అడిగేది ఒక్క జానికమ్మ మాత్రమే. కాని వసంత మొహంలోకి చూస్తూనే ఆయనకు ఎందుకో కాస్త ఆందోళన కలిగింది. అడిగాడు.

"అమ్మకి వొంట్లో బాగోలేదా?"

వసంత తల వూపింది.

కాయితాలు, ఫైళ్లూ అన్నీ ప్రక్కకి నెట్టేసి, భార్యకోసం వంటయింటికేసి వెళ్లాడు సుబ్బారావుగారు.

జానికమ్మగారిని పరీక్షగా చూశాడు.

"ఏం? ఎందుకలా? చూస్తారూ?" ఆమె అడిగింది. మళ్లీ పొడిగా నవ్వి "భాసడికి సురేఖ వొద్దుట.... మరో సమ్మంధం తక్షణం చూడండి.." అన్న దామె.

సుబ్బారావు నూతుల్లో జ్యోతుల్లా మెరుస్తున్న ఆమె కళ్లల్లోకే చూస్తూన్నాడు.

"ఏం! నాకేసి ఏముందని అలా పరీక్షగా చూస్తున్నారూ?...."

"అహాహా! ఏం లేదు .... కాస్త కాఫీ ఉంటే యిస్తావేమోనని వచ్చాను" అంటూ సుబ్బారావు గారు మాట తప్పించి అవతలికి వెళ్ళాడు.

వసంత భుజంమీద చెయ్యివేసి "మరేంలేదు! సాయంత్రం డాక్టరును పిలుస్తాను. నువ్వు అమ్మ దగ్గరే ఉండు." అన్నా డాయన.

"ఏం! నాన్నగారూ! అమ్మకి ...."

"నీరసమమ్మా .... అంతే అన్నయ్యకి రేవు రాద్దువుగానిలే! .... సురేఖ అవనీ, శూర్పణక అవనీ .... మరీ అంత బెంగ కూడదు .... వాడూ ంతే, అదీ అంతే .... ఇద్దరూ చెరో వేపు లాలో స్తారూ .... మనం నలిగిపోతాం మధ్య" ఆయన ట్చూర్చాడు.

నిజానికి జానికమ్మగారికి ఆయనకూ గల బాంధవ్యంయొక్క వయస్సు భాస్కరానికీ, జానికమ్మ గారికీ మధ్య గల అనుబంధంయొక్క వయస్సు ఒకటేఅయినా, జానికమ్మగారు వాడి గురించి తీసు కున్నంత శ్రద్ధ తన విషయంలో ఏనాడూ తీసుకోలేదు. అది ఆయన నమ్మకం. సుబ్బారావు గారికి ఒక్కోసారి అందుకుగాను గర్వమూ, ఒక్కో సారి ఉడుకుబోతుతనమూ కూడా వచ్చేవి యిది వరకు—

ఇప్పుడు కూడా ఆయన భాస్కరం సాయం కోరడంకన్నా మరేం చేయలే ననుకున్నారు. 'వాడికి రాస్తాను." అని గొణుక్కున్నారు. కాని ఆయన భాస్కరానికి టెలిగ్రాం యిచ్చి డాక్టర్ ఇంటి కేసి బయలుదేరాడు.

* * *

జానికమ్మగారు భర్త స్వయంగా కాఫీకి వచ్చి అడిగేదాకా తాను కలిపి యివ్వలేకపోయానే అన్న బాధతో కాబోలు గబగబా కాఫీ కలిపి కప్పులో పోసింది గాని ఆమెకు లేచి కప్పు తీసుకుని వెళ్ళ గల వోపిక లేకపోయింది. నరాల్లో మెలికలు తిరిగి ట్లయింది. కళ్ళు భారంగా మూతలు పడు తున్నాయి.

"వసంతా!" నీర్సంగా ఉన్నదా పిలుపు.

"ఏమ్మా!"

"కాఫీ 'నాన్నగారి' కియ్యి.." అంటూనే ఆమె అక్కడే చెయ్యి తలక్రింద ఆన్చుకుని వట్టింట పడుకుందామె.

వసంత దగ్గరిసా కూచుని "ఏమ్మా" అంది బేలగా.

ఆవిడ బరువుగా కనులు మూసుకుంటూ "నిద్దరొస్తోంది .... మీ అన్నయ్య వస్తే లేపు... వాడు వస్తూనే ఉంటా డిపాటికి ...." అన్నది. గుండెలమీద రెండో అరచేత నొక్కుకుంది.

వసంతకు భయం వేసింది. చెమటలు పోశాయి. గబగబా అవతలి గదిలోకి వెళ్ళి దిండు తెచ్చింది. తల్లి తలక్రింద పెట్టింది.

బయటకు వెళ్ళి చూసింది. సుబ్బారావుగారు ఆఫీసు గదిలో లేరు. పిల్లలిద్దరూ కూడా లేరు— ఎదురింటి ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్‌గారింట్లో ఫోన్ ఉంది. పరిగెత్తింది డాక్టరుకోసం "ఫోన్ చెయ్యాలి" అని కాని, మళ్ళీ వాళ్ళ యింటి గుమ్మం మెట్లు ఎక్కుతూనే "అమ్మ ఒకతే ఉందని" వెనక్కి పరి గెత్తింది.

వరండా దాటి అడుగుపెడుతూంగానే రామం సరళా యిద్దరూ "అక్కా! అమ్మ లేవడం లేదే" అంటూ భయాందోళనలతో ఎదురు వచ్చారు.

"అమ్మా! అమ్మా!" వసంత కూడా పిలు స్తూనే తల్లి దగ్గరికి వచ్చింది. జానికమ్మగారు పలకలేదు. వసంత తల్లి ఒంటిమీద చెయ్యి వేసింది. "అమ్మా! అమ్మా! .... అన్నయ్యొచ్చాడమ్మా!"

"................"

జానికమ్మగారు మరి లేనని నిద్రపోయింది!

"అమ్మా! అమ్మా! .... అ .... మ్మా ...." అన్న పిల్లల ఏడుపుకి దేవుడి బొట్టుపీది విగ్రహాలు అదిరిపడ్డాయి తప్ప జానికమ్మగారు మరి పలక లేదు.

భాస్కరానికి టెలిగ్రాం యిచ్చి డాక్టర్‌ని తీసు కుని వస్తూన్న సుబ్బారావుగారు కాళ్ళు నరికేసి నట్లు గుమ్మం దగ్గిరే కుప్పలా కూలబడిపోయారు.

అతని వెనకనే ఉన్న డాక్టర్ పిల్లలిని తప్పించు కుని పరీక్షకని ముందుకి వంగి— వెంటనే లేచి పోయాడు—అతను చెయ్యగలదేమీ లేదు— (ప్రాణం పోవడానికి ఒక కారణం వెతకడం తప్ప.)

"సుబ్బారావుగారు! పిల్లలున్నారు చూడండి! పెద్దలు మీరే అలా అయితే ఇక వాళ్ళకు దిక్కె వ్వరు .... ఊఁ ఊఁ .... దేవుడు చేశాడు .... మనం ఏం చేస్తాం ...." అంటూ ఓదార్చాడు. సుబ్బారావుగారిని.

సుబ్బారావుగారూ జానికమ్మగారి దగ్గర పిల్లల్ని ముగ్గుర్ని పెనవేసుకు కూలబడి వెక్కివెక్కి ఏడి చాడు.

"ఇది ద్రోహం జానకీ! ఇది ఘోరం జానకీ! ఇంత శిక్ష వేస్తావా?" అంటూ నిలువునా దుఃఖమై పోయా డాయన.

* * *


భాస్కరానికి రైల్లో ఉన్న వాళ్ళందర్నీ చూస్తున్నా .... అన్ని శబ్దాలు వింటూ ఉన్నా పీడ కలలు కంటూ ఉన్నట్లే ఉంది—గుండెల్లో నెత్తురు తోడుతున్నట్లుగా ఉంది. రైలు ఆగ కుండానే గెంతేసి ఇంటికేసి పరిగెత్తాడు.

రిక్షాని "త్వరగా పోనీయ్ పోనీయ్" మంటూ పరిగెత్తివచ్చిన భాస్కరానికి యింటి గుమ్మంలోనే తాను పూర్తిగా శాశ్వతంగా ఆలశ్యంగా వచ్చానని తెలిసిపోయింది!

బంధువులంతా "ఇక ఉంచకూడదు ఎత్తే యాలి" అంటున్నారు. కొందరు వోదారుస్తున్నారు కొందరు విస్తుపోతున్నారు. కొందరు 'ఉత్తమా యిల్లాలు పసుపు కుంకుమతో కూతురుపెళ్ళి చేసి మరీ కన్ను మూసింది" అంటున్నారు.

భాస్కరం గుమ్మంలోనే ఆ దృశ్యం చూస్తూనే వెర్రివాడిలా ఐపోయాడు. ఎవరో చెయ్యి పెట్టి గుండెకాయ "ఠ" క్కున లాక్కున్నట్లు "గొల్లు" మన్నాడు.

సుబ్బారావుగారు మొదలు నరికిన చెట్టులా



# ప్రేమకు పగ్గాలు

పడిఉన్నవాడు "భా .... సా ...." అన్నాడు. దుఃఖం పొర్లుకు వచ్చింది.

ఇంకా ఎక్కడి భాస్కరం ?

జానికమ్మగారిదీ భాస్కరానిదీ ఇరవై ఏళ్ల ఆత్మీయత, ఆ స్నేహానికి కాలం నిలిచిపోయింది. ఆ అనుబంధానికి అర్థం ఆగిపోయింది. భాస్కరానికి ప్రాణం ఉంది, చైతన్యం చెరిగిపోయింది !

"చెప్పండి ! నా పిన్ని నేం చేశారు మీరు ? ఎక్కడ ? .... చంపేస్తాను .... ఊఁ యియ్యండి .. నా పిన్ని నా క్కావాలి ..... " భాస్కరం తండ్రిని పట్టుకున్నాడు. నిలదీశాడు—కుదిపేశాడు.

పిల్లలు ముగ్గురు భయంతో "అన్నయ్యా !" అంటూ భాస్కరాన్ని అడ్డుకుని అతనికి పెనవేసుకున్నారు. సుబ్బారావుగారు హతాశుడై "నీ పిన్నిని నేనే చంపేను బాబూ ! నన్నూ చంపు" అంటున్నాడు.

నలుగురూ ఆపారు..... భాస్కరం పరిగెత్తి వెళ్లి ప్రాణంలేని పసుపు రాసిన పచ్చని పాదాలు—నిన్నటి వరకూ ఆ యింట దేవతలా—దీపం వెల్తుర్లా—తిరుగుతూ ఉన్న పాదాలను పట్టుకున్నాడు. ఆ పాదాల ఉనికి అతని వ్యక్తిత్వానికి బలం. కాని ఇక ఆ పాదాలు కదలవు ! పాదాల్లో తలదూర్చి ఏడిచాడు భాస్కరం.

"పిన్నీ ! నువ్వు అబద్ధా లాడావు పిన్నీ.... అబద్ధా లాడుతున్నావు పిన్నీ. నాతో చెప్పకుండా చావనూ అన్నావుగా ! లే మరీ !! లే పిన్నీ ...." తల బాదుకుంటున్నాడు.

నలుగురూ ఆపారు.... "ఛీ ! చాదస్తంటయ్యా ! ఈడొచ్చినవాడివి .... నువ్వే ఇలా అయితే ఎలా ?" అని వారించారు.

భాస్కరానికి అంతా అబద్ధంగా ఉంది. అబద్ధమై తీరాలనే ఉంది. కూలబడ్డాడు.

పిల్లల్ని కౌగిలించుకున్నాడు.

"మనం కూడా పోదామ్రా ..... చచ్చిపోదామ్రా ....." అంటున్నాడు.

జానికమ్మగారు మరి లేదు. ఇక రాదు. ఆమె 'మరణం' అనే 'అనంత సత్యం' లో కలిసిపోయింది. భాస్కరం అక్కడకి వెళ్ళలేదు.

## 58

శైలజకు సురేఖ ఉత్తరం చదవగానే "జీవితమంటే" నే ఒక భయంలాంటిది మిగిలింది. పద్మావతి ఆత్మహత్య చేసుకుంటుందేమో నన్న అనుమానం—అది మరి కాస్సేపట్లో నమ్మకంగా కూడా అయింది. 'నా కెందుకు అక్కర్లేని బాధ' అనుకుంటూనే యాంత్రికంగా లేచి బయలుదేరింది.

"మూర్తిగారి" ని వెతుక్కుంది. మూర్తి నేరుగా వస్తూనే "మావాడు వాళ్ల పిన్నిగారికి సీరియస్‌గా ఉందని వెళ్లాడట" అన్నాడు ఆందోళనతో రొప్పుతూ "నేను కూడా ఆమెను ఒకసారి చూశాను .... ఐ ఫీల్ డిప్రెస్డ్" అన్నాడు మళ్లీ.

"పద్మావతిగా రెలా ఉంది ?" అని అడిగింది, అదే ఆలోచిస్తున్న శైలజ.

"ఎవడికి తెలుసు ? ఎవడిక్కావాలి ? నేను భాస్కరం గురించి ఆలోచిస్తున్నాను!"

"ఒకవేళ ......"

"ఊఁ .... ఒకవేళ ?" మూర్తి రెట్టించాడు.

"ఆవిడ ఆత్మహత్యలాంటి పిచ్చిపని చేయదు కదా ?"

తెలియకుండానే నుదుట చిరుచెమటలు క్రమ్మాయి.

"హారి బాబోయ్ ! శైలూ ! నువ్వు—నువ్వు..." మూర్తి అటూ యిటూ పరిగెట్టాలీ అన్నట్లుగా గాభరాపడ్డాడు.

"ఎందుకు నీకీ ఊహ కలగాలీ ?" అన్నాడు కోపంగా మళ్లీ.

"పద్మావతికి నేను నాతో మీ రన్నదంతా చెప్పేశాను..... "

"ఊఁ .... ఊఁ ..... ఏమంది ?"

"టూ లేట్ ! అంతా అయిపోయింది .... ఇప్పుడు లాభంలేదు. నాకు గత్యంతరం లేదు" అంటూ వెళ్లిపోయింది—

మూర్తి అస్తవ్యస్తమై పోయాడు. "పైగా సురేఖగారు మరి రానంది" శైలజకు అది చాలా బాధగా తోచింది. గనుక సీరియస్‌గా చెప్పింది.

"చూశావా ! ప్రేమకు పగ్గాలు అగుపించకండా ఎలా ఉన్నాయో?" మూర్తి ఏమనాలో, ఏం చెయ్యాలో తోచక అన్నమాట లివి:

"సురేఖగారు పగ్గాలు తానే వేసుకుంది." నవ్వుతూనే అన్నది శైలజ.

"అభ్భ ! మనమంతా సెంటిమెంటల్ ఫూల్స్‌మి శైలూ ! మన దేశం మన తత్వాలు, హే భగవాన్... మారాలి. మారాలి.... "

"అంటే ?"

"అంటే .... ఉహూఁ .... నౌ టూ లేట్ అనకచెప్తా ..... పద ! పద్మావతిగారిని భాస్కరంగారి దగ్గరికి పొమ్మని చెప్దాం. కనీసం ఓ మంచి పని చేశాం అనుకుందాం .... చదువుమాట ఎలా ఉన్నా !" మూర్తి శైలజ చెయ్యి పట్టుకున్నాడు.

"ఇష్షు ! మనం ఇద్దరం ఇలా ఎలా వెళ్తాం. పైగా చెయ్యి వదలండి...." శైలజ సంభ్రమంగా సిగ్గుగా చెయ్యి వెనక్కి లాక్కుంది.

"ప్రేమకు పగ్గాలు మనకూ కూడా వస్తున్నాయ్ ! శైలజా ! బివేర్ !" మూర్తి నవ్వుతూనే ఎడంగా జరిగి "కుమారి శైలజగారూ ! నడవండి—మీ పెద్దల కడకు మా పెద్దలనువాళ్లంటూ ఉంటే పంపుదనుక ఈ ధీరోదాత్త నాయకుడు నిన్ను కలనైన తాకడు. సారీ ? మిమ్ము స్వప్నమునందైనన్ గాంచడు ...." అన్నాడు దారి చేత్తో చూపిస్తూ అభినయంపట్టి. కాని ఆ యిద్దరికీ లోపల లోపల బెరుకుగానే ఉంది.

* * *

పద్మావతికి జయమ్మగారి 'శంక' కొంతలో కొంత ఆమె మాటల్లో గ్రహింపుకు రాగానే "ఛీ! ఇంత నీచంగా నీ కూతుర్ని ఆలోచిస్తా వనుకోలేదమ్మా!" అన్నది — కాని జయమ్మగారు ఉన్న వాస్తవాన్ని విడమరిచి చెప్పింది.

"లేదు తల్లీ ! నన్ను తిట్టకు ! పవిత్ర మనుకుని, ప్రేమ అనుకుని ప్రేమిస్తాం మనం కాని తప్పుదారి త్రొక్కుతాం అక్కడే .... తర్వాత అది కడుపున బడితే పాపమై పోతుందమ్మా !"

పద్మావతి విస్తుబోయింది.

"నేను అలా అనుకోలేదు. నీవు నీ యిష్టం వచ్చినవాడికి [illegible] ధారపోయ్యి" అని [illegible]

పోయి కొరడుబారిపోయిన మొహం అటు తిప్పు కుంది.

"సరే ! దేవుడు మంచివాడై చల్లని చూపు చూశాడు — వాగప్పూరు సమ్మంధం స్థిరపరుచు కుందాము" జయమ్మగారు నిర్ణయించుకుంది.

* * *

పద్మావతికి రెండు ఆలోచనలు వచ్చాయి. ఒకటే తల్లికి "భాస్కరంతో లేచిపోయాన"ని ఉత్తరం రాసిపెట్టి తెల్లారకండా పారిపోడం, చచ్చిపోడం— రెండు అది జరగకపోతే తల్లి చెప్పిన విధంగా పెళ్ళికి ఒప్పుకుని పెళ్ళయిన తర్వాత ఆత్మ హత్య చేసుకోడం .... ఎంత కాదన్నా అవే ఆలోచ నలు వస్తున్నాయి చీకట్లు ముసురుతున్నట్లు.

శైలజ వస్తూనే "ఏమి టాలోచిస్తున్నారు ?" అన్నది పద్మావతిని.

ఉలిక్కిపడి "చావు గురించి" అని అంతలో శైలజను చూసి "అరె! నువ్వెలా వచ్చావ్ ?" అంది—

"ఇలాగే. మీరు తలుపు గడియ వేయలేదు." అంది శైలజ నవ్వుతూ.

"కూచో" నిర్లిప్తంగా అంది మళ్ళీ పద్మావతి.

"కాదు మీకు అర్జంటుగా ఒక మాట చెప్పాలి" రహస్యంగా అంది శైలజ.

పద్మావతికి ఆశ పోలేదు.

"మీ వార్డెన్‌గారి పుస్తకమేగా. ఆవిడ కోప్పడుతోంది కదూ ! ఇచ్చేస్తా పద !" అంటూ. లేచింది.

శైలజకు గొంతుల్లో వెలక్కాయ పడ్డది. పలుకు మారింది.

"బాప్‌రే ! ఏ వార్డెన్ ?! ఏ పుస్తకమూ, ఏమా కథా ?!" అందా మనుకుంది.

కాని, పద్మావతే మళ్ళీ గట్టిగా జయమ్మ గారితో "అమ్మా ! వీళ్ళ హాస్టలు వార్డె నమ్మ గారిది ఒక పుస్తకం తెచ్చి మరిచిపోయా. ఆమె కది యిచ్చి క్షమాపణ చెప్పుకోవాలి" అంటూ ఎదు రుగా ఉన్న ఒక పెద్ద బౌండు పుస్తకం తీసుకుని లేచి బయలుదేరింది. అప్పటికి శైలజకి కూడా పరి స్థితులు అర్థమైపోయాయి.

జయమ్మగారు శైలజ ఎదుట పడలేకపోయింది. "సరే ! పోయిరా" అన్నది నీరసంగా.

## 59

శైలజ అడిగింది "సురేఖగారి గురించి మీ అభి ప్రాయం ఏమిటి ?"

"అదా నీవు అత్యవసరంగా అడిగే ప్రశ్న ?"

"చిన్నదాన్ని గదా ? చెప్పండి."

"అదృష్టవంతురాలు .... ధనవంతురాలు"

"కాదు .... కాదు .... నన్నడిగితే మీరే అదృష్ట వంతులు .... సురేఖగారు నన్నడిగితే చాలా దుర దృష్టవంతులు !"

పద్మావతి నొచ్చుకుంది—ఏమీ అనలేక "నన్నేం చెయ్యమంటావ్ ?" అన్నది.

"మీరు ఏం చేద్దామనుకుంటున్నారు ?"

"సముద్రంలో దూకుదా మనుకుంటున్నాను" విసుగ్గా, అక్కసుగా అన్నది పద్మావతి.

"అదే వద్దని సురేఖగారు రాశారు....."

"మీ యిద్దరికీ థాంక్స్ .... కాని అదే చేస్తే మీ సొమ్మేం పోదుగా ...."

"పోనీలెండి ! ఇక మూర్తిగారు మీతో ఏదో

మాట్లాడాలి అన్నారు" శైలజ దురుసుగా అన్నది.

పద్మావతి చకితయ్యింది.

శైలజే చెప్పింది.

"భాస్కరంగారి వాళ్ల పిన్నమ్మకి సీరియస్‌గా ఉందట. "—వైర్ వస్తే ఆయన వెళ్లారు .... ఇక్కడ మూర్తిగారికి లెటర్ రాయలేదని ఆందోళన పడుతున్నారు" అని మళ్లీ పద్మావతి ఏమీ అనకపోగా తానే,

"మీరు అక్కడికి వెళ్తే ? .... " అని ప్రశ్న వేసింది.

"ఉహూఁ .... ఏ అనుబంధాలు పురస్కరించుకుని వెళ్లాలి నేను .... అదీగాక ఆమె ఎవరో తనకు నేను తగనని తీర్మానించుకున్నది గదా ? ఇప్పుడు వెళ్లడం మా అమ్మ గుండెలు తియ్యడమే అవుతుంది శైలజా !"

"అనుబంధానికి అర్థం భాస్కరంగారు మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలనడమా ?" నిలదీసింది శైలజ.

పద్మావతికి శైలజ యిలా వేధిస్తున్నందుకు చాలా కోపం వచ్చింది.

"రోడ్డుమీద గనక సరిపోయింది. లేకపోతే దవడ వాయగొడుదు" ననుకుంది.

"మూర్తిగారు మీతో కొన్ని సంగతులు చెప్పాలి రమ్మన్నారు." శైలజ మెల్లిగా అన్నది. "స్నేహ" మనే అనుబంధం ఒకటి మీకూ, భాస్కరానికీ, తనకీ మధ్య బంధమై ఉందనీ, అభ్యంతరం లేకపోతే తన సలహా వినమని అన్నారు" అని చెప్పింది.

"నువ్వు చాలా లక్కీ గర్ల్‌వి శైలజా ! మూర్తిగారు చాలా మంచివాడు కాని ఇప్పుడు నా జీవితంలో లేనిపోని ఆశలు చిగురించనివ్వకండి .... వసంత మనుకుని నేను ఎదురుచూస్తున్న కలలన్నీ శిశిరమై నిలిచిపోయాయి !" పద్మావతి నిట్టూర్చింది.

మూర్తి వీళ్లను అంతలోనే ఎదుర్కొని "నమస్కారం పద్మావతిగారూ !" అన్నాడు.

"నమస్కారం" పద్మావతి పొడిగా నవ్వింది.

"భాస్కరం వైరు వస్తే బెజవాడ వెళ్లి మూడురోజు లైంది. నాకు లెటర్ కూడా రాలేదు."

పద్మావతి మాట్లాడలేదు. కాని ఆమె గుండెల్లో 'పోటు' గా ఉన్నట్లు ఏదో తెలియని బాధ కలిగింది. భాస్కరానికి వాళ్ల పిన్నమ్మ ఎంత ప్రియమో తనకు నాలుగు సంవత్సరాలుగా తెలుసు. "భాస్కరంగారు ఎంత ఇదవుతున్నారో" నన్న బాధ కలిగింది ఆమెకు.

"నేను వాడికి "రిప్లై పైడు వైరు"ఇచ్చాను పద్మావతిగారూ !" మూర్తి గొంతు గాద్గదికమై పోయింది. "కాని .... ప్చ్ ...." నిట్టూర్చాడు.

శైలజా, పద్మావతి ఇద్దరూ విస్తుబోయారు. తేరుకుని ఆందోళనగా "అంత అవసరమా ? మీరు కంగారవుతున్నారేమో" అన్నది శైలజ.

"నో .... నో .... రండి ! బహుశా నడిరోడ్డు మీద యిలాంటి విషయాలు ...." అంటూ గంభీరంగా అడుగులు వేస్తూ దీనవదనంతో దారితీసిన మూర్తిని అనుసరించారు ఆ ఇద్దరాడపిల్లలూ.... "భాస్కరం ఏదీ అనుకోనిది జరగకపోతే నాకు ఉత్తరం రాయకుండా ఉండడు" అంటూ మూర్తి సముద్రం ఒడ్డున కూర్చున్నాడు....,

తర్వాత చెప్పాడు.—

# ప్రేమకు పగ్గాలు

"పద్మావతిగారూ ! మీరు ఏమీ అనుకోకపోతే ఒక్కమాట .... బెజవాడ వెళ్లండి .... మావాడు మావాడు ...."

పద్మావతి గుండె లాగిపోయి తీవ్రంగా కొట్టుకోసాగాయి.

"ప్లీజ్ ! చెప్పండి .... చెప్పండి ఆయనకు ..."

"ఏమో నాకు తెలియదు.....నా తంతికి తిరిగి సమాధానం రాలేదు..... నాకు బెంగగా ఉంది" మూర్తి నీరసంగా అన్నాడు. "వాళ్ల పిన్నిగారంటే వాడి దేవుడనుకోండి."

"నేను, నేను దురదృష్టవంతురాలిని శైలజా! అమ్మకి అంతా తెలిసిపోయింది. తను ఇప్పుడు నన్ను బెజవాడ వెళ్లనివ్వదు" పద్మావతి శైలజకు దుఃఖపడుతూ చెప్పింది !

"కాని, నాకు మనసులో ఆందోళనగా ఉంది. మీరు వెళ్లి వాళ్ల పిన్నిగారు మిమ్మల్ని చూస్తే.... ఆవిడకు మంచాన ఉన్న ఈ దశలో సేవ చేస్తే."

మూర్తి రెండు క్షణాలు వూరుకుని, అంతలో ఆవేశంగా "ఒక్కటి నిజం పద్మావతిగారూ !

'స్పైన్ అంటే ఏమిటిరా?' పంతులుగారి ప్రశ్న.

"స్పైన్ అనగా వెన్నెముక అందురు, పొడుగ్గా వీపువైపున వుండే ఎముకా, దానిపై అంచున మీతల, రెండో అంచున మీరు ఉందురు" కొంటెవిద్యార్థి సమాధానం.

జయరామిరెడ్డి (చిత్తూరు)

మై ఫ్రెండ్ కాన్ట్ లివ్ వితౌట్ యూ ! మావాడు మీరులేందే బ్రతకలేడండి !" అన్నాడు.

పద్మావతి పరాయి మగవాడు ఉన్నాడు. అది బహిరంగ స్థలమూ అనే ఆలోచన కూడా లేకుండా కంట తడి బెట్టుకుని అంతలో దుఃఖ మాపుకోలేక శైలజ భుజంమీద తల ఆన్చి ఏడ్చింది. కొన్ని క్షణాలు ముగ్గురూ నిశ్శబ్దంగా ఉన్నారు.

"ఈ చెల్లెల్ని క్షమించండి !" అన్నది పద్మావతి కనులు తుడుచుకుని కురులు సర్దుకుని .... ఎట్టకేలకు.

"మీరు మీ అమ్మగారికి చెప్పండి!" అన్నాడు మూర్తి.

"తాను వినదు.. తాను వినదు" గొణుక్కుంది పద్మావతి.

శైలజ అడిగింది "ఒకవేళ పద్మావతి గారికి అక్కడ పరాభవం జరిగితే ...."

"పరాభవాలు. అహంకారాలు యివన్నీ స్నేహం తొలి దశలో పట్టించుకుంటారండీ ! ఇప్పుడు, మనుషుల హృదయాలు పెనవేసుకుపోయాకా, కాదూ"అని మూర్తి అన్నమాటలే పదే పదే నచ్చాయి పద్మావతికి.... కొన్ని క్షణాల దారుణ నిశ్శబ్దం తరువాత "నేను వెళ్తాను" అని దిగ్గున లేచిందామె.

* * *

కాని, జయమ్మగారి గతి ఏమవుతుంది ?

ఎలా వెళ్లాలి తను ? ఏమని చెప్పాలి జయమ్మగారికి ?

"అయితే భాస్కరం ఇంటి ఇల్లాలి నౌతాను, లేదా కృష్ణా నదికి అంకితమేనా ఔతాను"నుకుంది పద్మావతి. "ఇప్పుడిక ఒకసారి భాస్కరంగారిని చూడందే చావలేను" అనుకుంది. కాని, జయమ్మగారి ప్రతిపాదనను ఒప్పుకోదు అని ఆమెకు బాగా తెలుసు.

ఆమెకు కూడా "ఒకే ఒక్క తిరుగులేని ఆయుధం" ఉన్నది. అదే "చావు". అదే అస్త్రం! అదే ఆత్మహత్య !!—అదే బెదిరింపు.

మూర్తిగారి వేపు ఆశగా చూసింది నడుస్తూనే పద్మావతి.

"ఐయామ్ లైక్ యువర్ బ్రదర్ ! చెప్పండి!" అన్నాడు మూర్తి.

"మా అమ్మ దగ్గరికి మీరు వస్తారా ?" తేలగా అడిగింది పద్మావతి.

శైలజకు మూర్తీ తనూ "ఇద్దరం" ఒక అక్కర్లేని 'బాదరబందీ' లో పడుతున్నామనిపించినా పద్మావతిని కాదనలేక పోయింది !

"పదండి వస్తాం !" అన్నది.

* * *

మూర్తిని జయమ్మగారు సాదరంగా పలకరించలేదు. అభిమానంగా చూడనూ లేదు. కాని మూర్తి చివరికి బోధపరచి—అంతా చెప్పాడు.

"మేమంతా స్నేహితులం పిన్నిగారూ ! మా భాస్కరం మా కందరికీ 'మమత' అనే దాన్ని దానివిలువను అర్థంచేశాడు. వాడికి పెంపుడుతల్లి ఐన జానికమ్మగారు మీరు అనుకున్నంత చెడ్డది కాదు. ఆమె పద్మావతిని పరాభవం చెయ్యదు. అదీగాక స్నేహధర్మంగా మేం వాణ్ణి యిప్పు డాదుకోవాలి. ....నేను వెళ్తాను .... పద్మావతిని నాతో పంపండి .... మీ అమ్మాయిని నేను అన్నదమ్ముడి బాధ్యతతో తీసుకువెళ్తాను .... ఒక్కసారి వాణ్ణి చూస్తుంది. అంతే."—

"కాని .... ఆడపిల్ల స్నేహానికి అవధులున్నాయి బాబూ ! ఆమెకు స్నేహం, ప్రేమ అన్నీ ఒక్క వ్యక్తిమీదనే ఉండాలి." జయమ్మగారు వారించింది.

"అవధులు ? అవన్నీ మీ కల్పితాలు. నిజంగా ఆ అవధులే ఉంటే అవి ఆడదానికి రక్తనాళాల్లో ప్రవహించేటంత సహజమైనవే అయితే — పద్మావతిగారు భాస్కరాన్ని అతని స్నేహాన్నీ పెంపొందించుకుంటుందా ?" మూర్తి ఉక్రోష పడ్డాడు. అరిచాడు ఇంచుమించు. "ఆడదాని పవిత్రతకు ఆడవాళ్లే పెద్ద పెద్ద అనర్థాలు, అవధులు కడుతున్నారు."—

"ఔను — మీరు అన్నది నిజమే ! ఎందుకంటే మీరు ఆడపిల్లకు రాగల అప్రదిష్ట చూడటం లేదు. ఏ తల్లి అయినా ఇలాగే చేస్తుంది. నేను దిక్కుమాలినదాన్ని గనుక నాకు యివన్నీ కష్టాలు! అందరి సలహాలు వచ్చాయి." జయమ్మగారు నొచ్చుకుంది.

"అమ్మా ! ఒక్కసారి చూసిరానీ — నన్ను వాళ్ల పిన్నిగారికి తలనొప్పి అని తెలిసినా భాస్కరం

గారు విలవిల లాడిపోయేవాడు. అలాంటిది ...." పద్మావతి నేదో సాహసప్రవృత్తి ఆవహించి అడుగుతోంది.

"వాళ్ల సంప్రదాయం మన సంప్రదాయం ..." జయమ్మగా రంటున్నది.

"అన్ని స్వకపోల కల్పితాలు .... కృత్రిమాలు, కుతంత్రాలు .... కేవలం సంస్కారం పిన్నిగారూ ... అదీ కావాలి .... మీ అమ్మాయి భాస్కరాన్ని ప్రేమించింది. అది మానసికమైన అపవిత్రత కాదా ? దాన్ని రూపుమాప గలరా ? మీరు?"

మూర్తి మాటలకు జయమ్మగారు ఉద్రేకపడి "పద్మావతీ! నీ యిష్టం వచ్చినట్లు తగలడు .... నాకు నీకూ అనుబంధం తెగిపోయింది .... వెళ్ళు ... వెళ్ళు. నీ జీవితం నీది ...." అని కేకలేసింది. కూల బడ్డది.

ఆమెను ఆ ముగ్గురూ ఓదార్చి ఓదార్చి అలిసిపోయారు .......

జయమ్మగారు నిస్పృహ యంగా "సరే ! గుంటూరుకు పోతాను నేను. ... నా పిల్లను నాకు నువ్వు తిరిగి అప్పగించు .... నేను దానికి వేరే సమ్మంధం చూసుకున్నాను" అన్నది ఎట్టకేల కామె.

మూర్తి, శైలజా, పద్మావతి కూడా అలసిపోయి 'ఔన'నీ 'కాద'నీ కూడా జవాబు చెప్పలేని స్థితిలో ఉన్నారు.

## 60

జయమ్మగారు పద్మావతిని బెజవాడలో మూర్తితో విగనివ్వడం 'త్యాగ' మనే అనుకుంది. అది ఆమె 'బలవంతాన చేసిం'ది— చేసేముందు రైలు ఎక్క ముందు "రాజు" పేర గుంటూరు రమ్మని ఉత్తరం రాసింది కూడా. మూర్తి ఆవేశం స్నేహితుడి మీది మమకారం రెండూ సంస్కారంవల్లా, వయస్సువల్లా వచ్చినవి. పద్మావతి తెగువకి తన బలహీనతే కారణం. కాని, ముగ్గురూ ఒకే రైల్లో ప్రయాణం చేస్తున్నారు. రైలు పరుగెడుతూ ఉంటే అది ఆ ముగ్గురి గుండెలమీదా పరిగెడుతున్నట్లుంది.

జానికమ్మగారు పద్మావతిని పరాభవం చేయదని ఎవరు హామీ యిస్తారు ? — చేస్తే ఏం చెయ్యాలి ? అన్న ప్రశ్నలు ముగ్గురి గుండెలూ దొలుచుతున్నాయి.

"కృష్ణలో దూకాలి" అదీ పద్మావతి సమాధానం.

"లెంపలు వేసుకుని జాగర్తగా పద్మావతిని చావకండా వాళ్ల తల్లికి గుంటూరులో అప్పగించాలి"— అదీ మూర్తి జవాబు.

"రాజు తెచ్చిన సమ్మంధం చేసి దీనిని భాస్కరం అనే వ్యక్తికి దూరంగా నాగపూర్ పంపించాలి." అదీ జయమ్మగారి ఆందోళన— ఆశ— కాని, పరాభవం చేస్తుందేమో అనుకుంటున్న జానికమ్మగారెక్క....డ ? ఎక్కడ?....

*   *   *

గుంటూరు రైలు ఎక్కుతున్న జయమ్మగారు కూతుర్ని రెక్క పట్టుకు తనకూడా లాక్కుపోదా మనుకుంది గాని ... పద్మావతి .... "తప్పక వస్తానమ్మా !" అంటూనే దూరంగా నిలబడిపోయింది.

**"నీ చెల్లెలైతే ఏం చేస్తావో అదే చెయ్యి బాబూ !** దిక్కు మొక్కూ లేని నీ పినతల్లి నిన్ను అడుగుతోందని భావించు" మంటోంది జయమ్మగారు రైలు కదుల్తూ ఉంటే నిస్పృహయంగా, దీనంగా .......

మూర్తి గుండెల్లో ఆ రైలు కొంచెం కొంచెం దొల్చుకు దూరుతున్నట్లుగా ఉంది, ఆ మాటలు వింటూంటే,

పద్మావతికి భయంగా తెగువగా సాహసంగా భయంగా ఆశగా దుఃఖంగా బాధగా తేలికగా బరువుగా బెంగగా, రకరకాలుగా ఉంది.

"సుబ్బారావుగారు లాయర్ అవడంల్ల ఆ యింటిముందు అటువంటి సందడి ఉండటానికి వీలులేదు. అని దూరంనించే గ్రహించాడు మూర్తి. గుండె ఝల్లుమంది కాళ్ళు వణికాయి.

రకరకాల బంధువులు .... సానుభూతిపరులు .... అయినవాళ్ళు, కానివాళ్ళు.....ఎవరికీ యిక 'కాని' ఒక ప్రాణి 'గతా' న్ని పురస్కరించుకుని అక్కడ వాలుతున్నారు ఒక్కరొక్కరే !

వరండాలో చాపమీద సుబ్బారావుగారు కుప్పలా కూలబడి ఉన్నాడు.

మూర్తినిగాని ప్రక్కనే ఉన్న పడుచునుగాని గమనించలే దాయన.

ఎవరూ చెప్పకండానే కళావిహీనమైన అక్కడి ప్రత్యణువూ "సంగతి"ని విడమర్చి చెబుతూ

---

"ఇదుగో! నన్ను పెళ్ళి చేసుకోక పోతే పర్వతంమీంది కెక్కి దూకి చచ్చిపోతా" అన్నాడు ప్రేమభిక్షుకుడు.

"చాల్లే! పట్టికోతలు" ప్రియురాలి సమాధానం.

'మందలపర్తి' (మాధవవరం)

---

వున్నాయి. మూర్తి కాళ్ళు బరువెక్కిపోయాయి. పద్మావతికి కళ్లు తిరిగాయి.

"నేను .... నేను .... మేము .... భాస్కరం స్నేహితులం ?"

తల ఎత్తా డాయన. అదీ శూన్యంలోకి చూస్తున్నట్లున్నా డాయన.

"భాస్కరమా ? ఇంకా ఎక్కడి భాస్కరం?" చెయ్యి తిప్పా డాయన.

మూర్తి చెప్పులు విడిచి ఆయన ప్రక్కనే కూచున్నాడు. "మీరు పెద్దలు ...." అన్నాడు. లోపలికి చీకటి తారట్లాడుతున్న గదుల్లోకి ఇరికా ఆశగా చూస్తూ. సుబ్బారావు పసిపిల్లవాడిలా వెక్కుళ్ళు అపుకుంటున్నాడు. మాటలు రావడంలేదు. దుఃఖమే వస్తోంది.

పద్మావతికి భాస్కరాన్ని వెంటనే చూడాలనిపించింది. ఎవరో బంధువులు అక్కడా అక్కడా పడిఉన్నారు. బహుశా అలిసిపోయి ఉంటారు.

మూర్తి పద్మావతిని "లోపలికి వెళ్లమ్మా" అన్నాడు అతి కష్టంమీద.

సుబ్బారావుగారు నిగ్రహించుకుని—లోలికి వెళ్లమని మూర్తికి కూడా సైగ చేశారు.

మూర్తి, పద్మావతిని యిద్దర్నీ ఒక ఏభై ఏళ్ల విధవావిడ ముందుకువచ్చి పలకరించింది.

**"పినతల్లిమీద ఇంత మమకారం నేను చూడలేదు....** అదో ఆ నట్టింట ఆ ప్రాణం పోయిందగ్గరే ఉన్నాడా అబ్బాయి ! .... ఏం చేస్తామమ్మా. మతి పోగొట్టుకుంటే మాత్రం ఆ సర్వాంతర్యామిలో కలిసిన జీవుడు తిరిగి వస్తాడా ? మన పిచ్చి గాని" అంటోందామె.

నట్టింట దీపమై వెలిగిన జానికమ్మగారు లేరు. ఆమె 'ఉనికి' చెరిగిపోయిన చోట దీప శిఖ వెలుగుతున్నది .....

భాస్కరం మోకాళ్లమీద తల ఆన్చుకుని శూన్యంలోకి చూస్తున్నట్లు ఆ దీపాన్నే చూస్తున్నాడు.

ప్రమిదలో దీపం నిశ్చలంగా వెలుగుతోంది ! నిశ్శబ్దంగా, నిర్జీవంగా కూచున్నాడు భాస్కరం.

మూర్తి కొయ్యబారిపోయాడు భాస్కరాన్ని చూస్తూ—పద్మావతిని వెళ్లమన్నట్లు నట్టింటి గుమ్మంలోనే నిలబడిపోయాడు తాను.

పద్మావతికి తన ఆత్మబంధువు ఎవరో తనకు దూరమై పోయినట్లు తోచింది. ఆమె జానికమ్మగారిని చూడలేదు కాని ఇప్పుడా ప్రమిదలోని దీపాన్ని చూడగానే .... ఎదను వెలితి నిండిపోయింది ఆమెలో......

ఒక్కొక్క అడుగే వేస్తూ భారంగా, భయంగా వెళ్లింది పద్మావతి.

మెల్లిగా భాస్కరం భుజంమీద చెయ్యి వేసింది.

చల్లగా తగిలిందది. ఉలిక్కిపడ్డాడు. వెంటనే "పిన్ని !" అన్నాడు భాస్కరం.

"నేను .... నే....ను...." గాద్గదికంగా అంటున్నది పద్మావతి.

భాస్కరం ఇటు తిరిగాడు కాని అతని కళ్ళు ఆమెను చూడటంలేదు. ఎటో చూస్తున్నాయి. "పొండి. మీరంతా పొండి!!.... పిన్ని నిద్రపోతోంది..... ఇష్ష ! ఆమెకు నిద్రాభంగం కాకూడదు..... ఊఁ ...." అంటున్నాడు. భాస్కరం. కళ్ళు వాచిపోయాయి. నిద్రాహారాలు లేవా దేహానికి. శాంతిలేదా మనస్సుకి !

మూర్తి వచ్చాడు.... "భాస్కరా! చూడు భాస్కరా ! నువ్వు ...."

ఎవడు భాస్కరం, ఎవడు నువ్వు ? ఏమీలేదు. ఎవరూ లేరు—

"పిన్నీ ! పిన్నీ" అంటున్న దతనిలో జీవశక్తి అంతా కలిసి—

"పిన్నీ ! పిన్నీ ! వీళ్ళు నిన్ను చంపేశారు పిన్నీ ! కాని, నాకు తెల్సు పిన్నీ నువ్వు నాకోసం వస్తావమ్మా !" భాస్కరం వాళ్లను విదిలించుకుని దీపం కేసే చూస్తూ వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

"మమ్మల్ని అన్యాయం చెయ్యకు. భాస్కరం మాకోసం ....... మా కోసం"

"ఎవరు మీరు ? .... భాస్కరం ఎవడు వాళ్ళ పిన్ని వాడితో చెప్పకుండా .... చెప్పకండా .."

వెక్కివెక్కి ఏడుస్తున్న భాస్కరాన్ని ఓదార్చడం రాక పద్మావతి ఏడుస్తున్నది.

ప్రక్కగదిలో పడున్న ముగ్గురు పిల్లల్లోనుంచి వసంత నిగ్రహించుకుని వాచిన కళ్లతో వచ్చింది. ముకుందరావు కూడా వచ్చాడు. మూర్తి నిస్పృహయంగా లేచాడు ......

వసంత "అన్నయ్యా !" అని భాస్కరం ఒళ్లో పడిపోయింది.

"పిన్ని వస్తుంది. వసూ ! వస్తుందిరా .... తల్లీ!

నాకు తెల్సురా .... నేనేరా చచ్చిపోయింది .... అమ్మ కాదూ ....'' భాస్కరం తనే జానికమ్మ గార్లై పోతున్నాడు.... వసంతను ఓదారుస్తున్నాడు. తాను ఏడుస్తున్నాడు.

పద్మావతి అలాగే స్థాణువులా ఉండిపోయింది. భాస్కరం జానికమ్మగారి ఉనికి చెరిగిపోయిన జాగా లోని 'జ్యోతి' లోని ఏదో శక్తి తనను లాగు తున్నట్లు అటే చూస్తున్నాడు.

* * *

అవతల మూర్తి సుబ్బారావుగారి దగ్గిర కెళ్లాడు. సరళా రామం ఏడ్చి ఏడ్చి యివతలికి వచ్చి తండ్రిని పెనవేసుకున్నారు.

''చూడు బాబూ! ఈ పిల్లల్ని నాకు ఒప్ప గించి వెళ్లిపోయింది. నన్ను కూడా తాను ఒక పసి పిల్లాడిలా సాకింది కదా? నేను వీళ్లకు ఎలా? ఎలా? ....'' ఆయన దుఃఖించుతూ ''జానకి గొప్ప అన్యాయం చేసింది బాబూ!'' అన్నాడు.

''ఛా! మీరే అలా యిద్దైతే భాస్కరం ఎలా చెప్పండి! ఈ పిల్ల లెలా యిదౌతారు. ?.... నేను .... నేను .... యిలా అవుతుందని....అవు తుందని .....'' మూర్తి మాటలకు సుబ్బారావు గారు కళ్ళు ఒత్తుకునిపిల్లల్ని కౌగలించుకున్నారు.

''భాస్కరాన్ని మనిషి చేస్తుం దనుకున్నాను.... కాని, వాణ్ణి వాణ్ణి చాలా అన్యాయం చేసింది జానకి ... కన్నతల్లి భూమ్మీద పడేసింది. తప్పు కుంది .... ఈ పెంచిన తల్లి వాణ్ని మనిషిని పూర్తిగా చేసి .... వాణ్ని నాకు గాకుండా తానే ఎత్తుకుపోయింది. నన్ను ఒక జీవచ్ఛవంగా ....''

''పిల్లలున్నారు .... మీరు నిగ్రహించాలి'' మూర్తి మాటలకు ఆయన తేరుకుని ''ఆ అమ్మాయి ఎవరో.... కాస్త వరసమ్మా! వీళ్లకి ....'' అంటూ గృహస్థధర్మాన్ని జ్ఞాపకం తెచ్చుకున్నాడు. అక్క డున్న ఒక చుట్టాన్ని కేకలేస్తూ ......

''ఆమె పద్మావతి అనీ భాస్కరం క్లాసుమేటు'' మూర్తి అన్నాడు. అంతలో...

పద్మావతి వచ్చింది మెల్లిగా అక్కడికి. సుబ్బా రావుగారికి మూర్తి పరిచయం చేస్తుండగా ఆమె పాదా లకు ఒంగి నమస్కారం చేసింది. ఆ పిల్ల యీ ప్రవర్తనకు ఆయన విస్తుబోయాడు.

''వద్దమ్మా! పాపాత్ముణ్ని .... నాకు వద్దు ... జానకిలాంటిదేవతను తినేశానమ్మా''అన్నాడుఆయన.

''నేను మీరు .... నేను .... మీరు ..... మీరు ఏమీ అనకపోతే ఇక్కడే ఉండిపోతాను ....'' అని

# ప్రేమకు పగ్గాలు

తల దించుకునే ఏదో అభూతశక్తి పలికిస్తున్నట్లు అంటోంది పద్మావతి.

సుబ్బారావుగారు చాలాసేపు గంభీరంగా ఉండి పోయారు.

''ఎందుకు తల్లీ! భాస్కరానికి వాళ్ల పిన్ని కావాలి ... అది రాదు... ఈ పిల్లలికి తల్లి కావా లమ్మా! ఇంకెవరు వచ్చినా ఆవిడ రాదు కదమ్మా? ఎందుకు కష్టాలు కోరి తెచ్చుకుంటావు?'' అన్నా రాయన.

'నేను! .... నన్ను క్షమించండి! నేను వెళ్ల లేను .... వెళ్లలేను ....'' పద్మావతి కన్నీటిబొట్లు రెండు ఆయన పాదాలమీద వెచ్చగా పడ్డాయి.

''నన్ను పొమ్మనకండి!''

''నాతో సహా నలుగురు పిల్లల్ని దిక్కులేని వాళ్లను చేసిందా దేవత! పైగా ఈ ఇంటి యజమానురాలైన తాను మాకు పసితనం తప్ప ఏమీ మిగల్చలేదమ్మా! .... అన్ని హక్కులూ ఆమె ఎవరికీ ఇవ్వకుండా తానే తీసుకుపోయింది. నేనూ భాస్కరం అంతా ఒకటే, తల్లీ ... ఉండమనీ, వెళ్లమనీ అనగల 'జానకి' లేదు ... ఇప్పుడింక నీ కెందుకీ కష్టాలు ....? మామీద సానుభూతా తల్లీ?'' ఆయన బరువుగా లేచి పిల్లల్నిద్దర్నీ ఎత్తు కుని అక్కణ్నించి కదిలాడు.

బేలగా, దీనంగా చూసిన పద్మావతిని మూర్తి ''ఊహూ ...'' అని తల తిప్పి వారించి ధైర్యం పలికి.....''చెల్లీ? నువ్వొక్కతెవే నమ్మా! అదృష్ట వంతురాలివి .... వాళ్ల ''పిన్ని'' గారిని నువు చూడ లేదు.....అందుకనే నువ్వే భరించాలి ఇదంతా. నీకు యీ శిక్ష తప్పదు .... వీళ్ల నందర్నీ ఆ 'దేవత' ప్రభావం నుంచి ఇవతలికి తేవాలీ, మన ప్రపంచం లోకి ''తేవాలీ' అంటే అది నీ ప్రేమవి కాదు, నీ సహనాన్ని, త్యాగాన్ని ...'' అంటున్నాడు మూర్తి.

''నాకు తెల్సు .... నాకు తెల్సు ....'' గొణు క్కుంది నిశ్చింతగా, నమ్మకంగా పద్మావతి.

''ఆలోచించుకో.... బెంగపడకు.'' మని మూర్తి నిట్టూర్చాడు. అంతలోనే పద్మావతి ''భాస్కరం గారు నన్ను .... నన్ను .... పోల్చనేనా లేదు'' అంటూ నిరాశపడి ఏడిచింది.

మూర్తి నిగ్రహించుకుని,

''ఛా! ఏమిటదీ? నువ్వా అవనే చేస్తే ఇక ఈ ఇంటికి వెల్తు రెక్కడ? ....'' అన్నాడు.

రెండు క్షణాల్లో పద్మావతి కళ్ళు తుడుచుకుని లేచింది — నిశ్చయంగా నిలబడి ''ఔను! పిల్ల లిద్దర్నీ ఎత్తుకువెళ్లారు....ఆయన ఏం చూసు కుంటారు?'' అంటూ పద్మావతి లేచి వెళ్లింది సుబ్బారావుగారు వెళ్లిన గదివేపు. వసంత, ముకుంద రావూ నిశ్శబ్దంగా ఎదురువచ్చా రామెకు.

పద్మావతి వసంతను కౌగలించుకుంది.

''ఏడవకూడదమ్మా!'' అన్నది ధైర్యంగా.

''అన్నయ్య ఆ గదిలోనే అలాగే ....'' వసంత పద్మావతి గుండెల్లో తల దూర్చుకుని ఏడుస్తోంది.

ముకుందరావు ఈ కొత్త స్త్రీ ఎవరో తెలియక కాస్త తికమక పడుతూనే పొడిగా అన్నాడు.

''భాస్కరం బావ గురించే మా కందరికీ యిప్పుడు బెంగ''

''ఆయనకు తెలుసు. మీరు బెంగపడకండి ఈ ముగ్గురు పిల్లల బాధ్యతా వారిమీద ఉంది! రెండు రోజులలో సర్దుకుంటారు.'' అన్న పద్మా వతి మాటలకు ముకుందరావు తనకు తెలియ కుండానే ఆశపడ్డాడు. అంతలోనే భాస్కరం గురించి ఇంత తెలిసినట్లు చెపుతున్న ఈ కొత్త స్త్రీమూర్తిని — ఆమె ఒడిలో విశ్వాసంగా తల దూర్చి దుఃఖ మాపుకున్న తన భార్యను చూస్తూ రెండు క్షణాలు విస్తుపోయాడు కూడా.

''కాని... ఈ ఇంటికి ఆడదిక్కు ఎవరూ లేరు'' .... వీళ్లా పిల్లలు .... బావ మతిపోయి....''

''ఇష్ష!.... మీకు దండం పెడతాను... ఆమాట అనకండి .... ఈ ఇంటికి ఆడదిక్కూ ఉంది .... వారికి ... వారికి .... మతీపోలేదూ'' పద్మావతి ఆవేశంలో ఇంకేమీ అనలేదు. అన్నా విన డానికి ముకుందరావు అక్కడ లేదు. ఆశ్చర్యంగా బరువుగా అడుగులేస్తూ అవతలికి వెళ్లిపోయాడు.

'మీరు చాలాఆలస్యంగావచ్చారు...'తరువాతిమాట లను అస్పష్టంగా మింగేసిందిఏడుస్తూన్న వసంత.

''ఔను .... ఔను .... పాపిష్టిదాన్ని తల్లీ! నేనూ ... కాని, ఇక ఈ దేహం ఇక్కణ్ణుంచి ప్రాణా లతో వెళ్లదమ్మా! మీరు వద్దంటే నేను ఆవిడ దగ్గరికే వెళ్తాను తప్ప; ఇక మీ అన్నయ్యని మిమ్మల్నీ వదిలి వెళ్లనమ్మా ....'' గట్టిగా కౌగిలించుకుంది వసంతని పద్మావతి.

సుబ్బారావుగారు వసంత వెక్కిళ్లు విని వచ్చా డక్కడికి కాని, గట్టిగా కౌగలించుకుని వెక్కివెక్కి ఏడుస్తున్న ఆ ఆడపిల్లల్ని ఓదార్చగల ఓపిక లేక అలానే చూస్తూ ఊరుకున్నాడు. **సమాప్తం★**

---

# కంసకథ

14 వ పేజీ తరువాయి

హీనతను నిందించుకొనిన వాడయిన కంసుడికి, ఎదురింటికి పక్కింటి గుమ్మం ముందు నులక మంచంమీద కూచుని హుక్కా పీలుస్తున్న సిక్కు వృద్ధుడూ, సందు మొగదల వేడి వేడి 'టికీ' లను (కట్‌లెట్‌ల వంటివి) 'చోలే' తో (గుగ్గిళ్ల వంటిది) కలిపి అమ్ముతున్న బండివాడూ మొద లయిన ఆడేతర శాల్తీలు కూడా కన్పించాయి.

ఈలోపుగా గదిలో నుండి మాటలు వినపడి నట్లుంటే అటు చూశాడు కంసుడు.

''.... అంతగా కావాలంటే రేపు సాయం కాలం కాస్సేపు 'కనాటింగ్' చేసి ఆ తర్వాత సత్య జితుణ్ణి చూసి వద్దాం'' అన్నాడు చలపతి సూ ళోకి దారం ఎక్కిస్తూ—

''కనాటింగా ?!!''

''అదేనోయ్ .... కన్నాట్ ప్లేస్, కన్నాట్ సర్కస్ అనబడే—ఆ వృత్తాకారంలో ఉన్న బజారు వీధుల వెంబడి తిరగడం, మరోచోట అర్ధ రూపాయకు దొరికే వస్తువుని అక్కడ రూపాయి పెట్టి కొనడం,— వగైరా పనులకు సంక్షిప్త నామధేయం క్రింద— కనాటింగ్ .... అంటారు.''

''ఓ''! అన్నాడు కంసుడు.

ఈలోగా హోటలువాడు కేరియర్ తెచ్చాడు. అన్నంతోబాటు, నిప్పులమీద కాల్చిన గోధుప్పిండి రొట్టెలనూ తిన్నారు మామా అల్లుళ్లు.

ఆ రాత్రి తెల్లవారింది.

ఇద్దరూ ఆరింటికి లేచి టూత్‌బ్రెష్—పేస్టు లతో పళ్ళు తోముకొంటూ వీధివైపు నిల్చు న్నారు. ఎదురింటి పక్కగా సందు మలుపు దగ్గర—ఒకడు చిన్న తోపుడు బండిమీద జంప కానా పరచి బట్టలను ఇస్త్రీ చేస్తున్నాడు.

''వాడిని 'ప్రెస్‌వాలా' అంటారోయ్. రజక మహారాజుల ధాటికి జడిసిన ఆత్మలు చాలవరకు బట్టల్ని ఇంట్లోనే ఉతుక్కుని .... ఇదుగో, ఇలా వీధుల్లో వస్తారు, వీళ్ల చేతికిచ్చి ఇస్త్రీ చేయించు కుంటారు.... ''

''సంచార రజకాలయం అన్నమాట!'' అన్నాడు. 'మొబైల్ లాండ్రీని' తెన్గించిన కంసుడు.

సరిగ్గా ఆ క్షణాన్నే—రోడ్డుమీద 'బర్‌ర్రుర్రు' మంటూ స్కూటరుమీద వెళ్తున్నా డొక దక్షి ణాది పురోహితుడు! గోచి పోసి కట్టిన ధోవతి, మీద తువ్వాలు, నుదుట విభూతి, చేతికి బంగారు కడియం, స్కూటర్ వెనుక తగిలించి ఉన్న సంచిలో దర్భకట్ట!! కంసుడి ఆశ్చర్యం ఆకాశాన్నందు కుంది ....

.... కాఫీ తాగుతుండగా చెప్పాడు చలపతి. "ఆయన ఒక అరవ పురోహితుడోయ్ ! వాళ్లకో సంఘం ఉంది.—అంటే అంటే మనవాళ్లల్లా నలుగురు కలిసి ఓ సంఘం, మరో రెండున్నర మనుషులకు ఇంకో సమితి, ఆపైన శంకర్రావొకడొచ్చి స్థాపించే మండలి .... అని .... అలా పెట్టుకోరు అరవ్వాళ్లు. వాళ్ల కొకే సంఘం ఉంటుంది. అది చక్కగా పనిచేస్తూంటుంది. ఒకవేళ రెండో సంఘం ఉన్నా రెండూ కలిసి బాగా నడుస్తుంటాయి."

"అయినా ట్రేడ్ యూనియన్ లాగున పురోహితుల సంఘ మేవిటీ—అని ?"

" .... పురోహితుల అవసరం ఉన్నవాళ్లంతా నెలకో రూపాయి రుసుము చెల్లించి ఆ సంఘంలో సభ్యులుగా ఉంటారు. ఏదో వ్రత మనీ, తిధి అనీ అవసరం వస్తే ఠంచన్‌గా పురోహితు డొచ్చి వెళ్తాడు. ఆ విషయంలో ఇబ్బందేమీ ఉండదు—"

"మరి .... అదేవిధంగా ఆంధ్ర పురోహితుల సంఘం లేదేవిటీ ?"

"ఆంధ్ర పురోహితులు 'ఆంధ్రులు' కదుటోయ్—" అని స్నానానికి వెళ్లిపోయాడు చలపతి.

ఆ సాయంకాలం ఆఫీసు లయింతర్వాత—రీగల్ వద్ద కలుసుకున్నారు కంసుడూ చలపతీ .... కనాట్ సర్కస్, ఇన్నర్ సర్కిల్, ఔటర్ సర్కిల్ అంతా తాపీగా తిరిగారు. ఒక మిఠాయి దుకాణంలో కూచుని 'చోలే' తో బాటు 'కుల్చా' (బన్నులా ఉండే మైదా రొట్టె) తిన్నారు. 'చాయ్' తాగారు.

దారిలో చలపతి ఓ సావు 'లీచీ' లు (పెళుసయిన తోలుక్రింద మంజులా మెత్తగా ఉండే తియ్యటి పండ్లు) కొన్నాడు. అవి తింటూ సినిమా థియేటర్ వైపు నడిచారు.

నాలుగు రోడ్లు కలిసేచోట గుండ్రంగా ద్వీపం లాటిది ఉంది. దాన్ని చూపించి—" ఇది చూశావా... ఇలా వృత్తాకారంలో ఉన్న రోడ్ల జంక్షన్‌ని ఈ ఊళ్లో "గోల్ చక్కర్" అంటారోయ్..... మన హైదరాబాదులో "చౌరాస్తా" అంటారే అలాగన్నమాట. ఈ గోల్ చక్కర్ నుండి నాలుగూ అయిదూ రోడ్లు వృత్త కేంద్రం నుండీ వ్యాసార్థాలూ, చక్రపు ఇరుసునుండి ఆకుల్లాగా వ్యాపిస్తాయి. అందుకనే ఈ రోడ్లని "రేడియల్ రోడ్డు" అంటారు—" అని వివరించసాగాడు చలపతి.

రేడియస్ అంటే వ్యాసార్థం. వ్యాసార్థం అనగానే 'పై ఆర్ స్క్వేర్' అన్న హైస్కూలు లెక్కలూ, దానితోబాటే మొట్టికాయల మేష్టారూ గుర్తుకొచ్చారు కంసుడికి. అప్రయత్నంగా నెత్తి మీదికి వెళ్లింది అతడి కుడిచెయ్యి. తన ఆలోచనల మధ్య నుండి బయటపడిన కంసుడికి 'భారత దేశపు జనాభా—దాని తగ్గుదలకు చర్యలు—' అన్న మహత్తర విషయంమీద చలపతి ఇస్తున్న ఉపన్యాసం లాటిది వినపడింది.

"…. కనుక ఎప్పుడో 1976 లో మన దేశ జనాభా రెట్టింపు అయిపోతుందన్న భయంకరమయిన నిజాన్ని ఇప్పుడే గుర్తించి ఎంతో దీర్ఘదృష్టితో—దేశమంతటికీ సేవ చెయ్యడానికి ఎటూ అవకాశం లేదు గనుక—కనీసం ఢిల్లీ జనాభా నయినా అదుపులో ఉంచుదామని, డి. టి. యు. అనబడే ఈ ఢిల్లీ నగర బస్ సర్వీస్ వాళ్లు అనన్యమయిన కృషి చేస్తున్నారు. రోజుకు ఎంత లేదన్నా అయిదారుగురి చొప్పున నగర జనాభాని తగ్గించేస్తుంటారు ఈ బస్సుల వాళ్లు ....

"మనుష్యుల దేహాలతో రోడ్లని సిమెంటు చేయాలన్న నమ్మకం గల స్కూటర్లవాళ్లు, వెధవ దేహం నిటారుగా ఉంటే నేం, అడ్డంగా రోడ్డుకి సమానాంతరంగా ఉంటే నేం అన్న వేదాంతియులయిన ఢిల్లీ పాదచారులూ—ముగ్గుర్ని, నలుగుర్ని ఒకే సైకిలుమీద ఎక్కించుకుని తీసుకు వెళ్లే వీరులు— వీళ్లందరూ యధాశక్తిని బస్ సర్వీస్ వారికి సాయం చేస్తుంటారు. కాని, ఈ గోల్ చక్కర్ లున్నాయి చూశావ్వూ—ఇక్కడికి వచ్చేసరికి చచ్చినట్లు వేగం తగ్గించాలి. లేకపోతే బోల్తా కొట్టితీరవలసిందే .... కనుక ఈ గోల్ చక్కర్లవలన, 1976 సంవత్సరంమీద బొత్తిగా చూపులేని ట్రాఫిక్ రూల్స్ వలన, బస్సులవాళ్ల మహదాశయానికి విఘాతాలు కలుగుతున్నాయి. అందు ఫలితంగా జనాభా అనవసరంగా పెరిగిపోతున్నది. ఒక్క గది అద్దె 75 రూ. లు అయింది! అయినప్పటికీ అకుంఠితమయిన దీక్షతో బస్సు వాళ్లు తమ పని తాము చేసుకుంటూ పోతారు" అని చలపతి సీరియస్‌గా చెబుతున్నపుడు తాను నవ్వడం బాగుండదేమో నని జంకాడు కంసుడు.

.... సినిమాహాలు చేరి 'క్యూ' లో నిల్చున్నారు. టిక్కట్లిస్తున్నారు. ఈలోగా ఓ పొడుగాటి శాల్తీ వచ్చి క్యూ మధ్యలోకి కలవబోయింది. "అయ్యబాబోయ్—క్యూ!"—అని ఎవరో అరిచారు హిందీలో. ఆ పొడుగు శాల్తీ—"నేను గంటాయి నిల్చున్నాను. ఇపుడే సోడా తాగడానికి వెళ్లానర్రా" అంది. ఎవరో ఆ శాల్తీ చెయ్యి పట్టుకు లాగారు. శాల్తీ చెయ్యి ఆ ఎవరో చెంపమీద వేగంగా పడింది. హఠాత్తుగా ఆ ఎవరో చేతిలో కత్తి (!) .... ఆ .... కత్తియే, మెరిసింది. "మార్ డా లూంగా!" వగైరా పదజాలాలు విరిశాయి. ఈ 'రోమాంతిక' దృశ్యం గాంచిన కంసుడితో చలపతి అన్నాడు— "ఇదే నబ్బాయి పంజాబీల కోపం అంటే .... ఇది తెనుగువాళ్ల ఉత్సాహం లాంటిది. రయ్‌మని సత్యభామలా రాజుకుంటుంది."

పోలీసులు పొడుగు శాల్తీనీ, (గడ్డమూ కత్తితో సహా) 'ఎవరో' నీ లాక్కెళ్లారు.

మామా అల్లుళ్లిద్దరూ లోపలికెళ్లి కూచున్నారు.

చిన్న చిన్న దీపాలు — యవ్వనంలో గుండె చప్పుడు లాటి ఇంగ్లీషు పాటలు— ఉల్లిపొరలు— తెల్ల భుజాలు— మెత్తటి సీట్లు— అబ్బాయిల మీదికి వాలిపోతున్న అమ్మాయిల తలలు—నెక్ టైలు—గడ్డాలు—మగాడలు—ఆడ మగలు— ఆలు మగలు.

దీపా లారిపోవడంతో వెండితెరకు ప్రాణం వచ్చింది. అయిదారు నిముషాల దాక తెరమీది విషయా లేవీ ఎక్కలేదు కంసుడి బుర్రలోకి.

ఇంటర్వెల్‌లో .... సేమియా కప్పిన ఐస్ క్రీము తిన్నారు పిల్లిద్దరు. దాన్ని 'కుల్ఫా' అన్నాడు చలపతి.

ఇంటర్వెల్ అయింది.

సినిమా కూడా అయింది.

జనగణమన పాడింది రికార్డు. వెండి తెరమీద మూడు రంగులు రెపరెప లాడాయి. దేశభక్తి బలవంతాన వచ్చిపోయింది ....

బస్ స్టాపు చేరారు చలపతీ, కంసుడూ, మరో రెండువందల మందీ .... మూడు బస్సు లొచ్చాయి. వెళ్లాయి. రణరంగంలో స్వైర విహారం చేస్తున్నట్లుంది.

హఠాత్తుగా కంసు డనుకున్నాడు—"చలపతి ఏడీ ?" అని. అవును, చలపతి ఏడీ ? లేడు. చలపతి లేడు. నట్టు నడిసముద్రాన నౌక ముక్కలయి పోయినట్లుంది .... బహుశ చలపతి ఆ మూడో బస్సులో ఎక్కిపోయి ఉంటాడేమో— అవును .... పోయే ఉంటాడు .....

చుట్టుపక్కల చూచాడు కంసుడు. చలపతి లేకపోతేనేం, జనం దట్టంగా ఉన్నారు.

నాలుగో బస్ వచ్చింది. దాని రాకను, అల్లంత దూరంలోనే పసిగట్టిన కంసుడు తన శక్తులన్నిటినీ కూడగట్టుకుని, హుంకరించి, దూకాడు జన సముద్రంలోకి—కుడి ఎడమల, తలక్రిందుల, కాళ్లూ, చేతులూ, మొహాలూ మోచేతులూ .....

ఆ అదీ ! ఆ కమ్మీ అందింది. ఆ ! ఆ ! ఇదిగో కుడి పాదం బొటనవేలు బస్‌మీద ఆనింది.

'అమ్మయ్య' అనుకోబోయాడు కంసుడు. కాని, అంగుళం ముందుకు వెళ్లడానికి లేకుండా దట్టమయిన మనుష్యుల గోడ.

సరిగ్గా ఈ సందర్భంలో ఆ జన మహాసముద్రంలో కంసుడి వెనకాల నిల్చునిఉన్న పాతికేళ్ల పంజాబీ సుకుమారి ఒక్కర్తె—'ఏమిటి ఈ శాల్తీ, తానూ ముందుకు పోదు, ఇంకొకర్నీ పోనివ్వదూ—' అనుకుని ఎడంచేతి బొటనవేలితో ఆ శాల్తీని ముట్టుకుంది.


కంసుడు పడ్డాడు ఎక్కడో కాదు—నలుగురితో కలిసి రోడ్డుమీద.

బస్సు కదిలింది—పంజాబీ సుకుమారితో సహా.


కంసుడు లేచి నిల్చుని కీళ్లన్నీ పరిశీలించుకున్నాడు మోచేతి దగ్గర చొక్కా కాస్త విడిపోయినట్లయింది అక్కడ వెచ్చగా తడిగా కూడా ఉందనిపించింది.

.... "హా !" అని వేదాంతికంగా, పై పెదవితో సగం చిరునవ్వొకటి వెలిగించి—"స్కూటర్" అని చప్పట్లు కొట్టాడు క్రొత్త ఢిల్లీలో క్రొత్తవాడయిన కంసుడు !




కుంతలా
ఆయుర్వేద
శతమూలికలచే తయారైన
కేశరంజక తైలము
★ మీ తెల్ల వెంట్రుకలను క్రమముగా నల్లబరచును
★ మీ వెంట్రుకలను పొడవుగను ఒత్తుగను పెంచును
★ బట్టతల "చుండు" శిరోభారము కండ్లమంటలు మొదలగు శిరోవ్యాధులను నివారించును.
KUNTHALA
కుంతలా ప్రొడక్ట్స్ (ఆయుర్వేద స్పెషలిస్టులు) కర్నూలు (ఆం.ప్ర)

స్టాకిసులు కావలెను.


ఆడుతున్నా
లేక
విశ్రమిస్తున్నా...,
వారు సర్వదా
పెరుగుతూనే
వున్నారు!
Kalzana
కల్జానా-డి
విటమిన్‌తో బలవర్ధకమైన కాల్షియం
కాబోయే తల్లులకు, పిల్లల్నిపెంచే తల్లులకు, పెరిగే శిశువులకు
శైశవదశలో పిల్లలు వేగంగా పెరుగుతారు. ఆ సమయంలో, బలమైన పళ్ళ, ఎముకలకోసం, జీవితానికి కావలసిన బలంకోసం పిల్లలకు కల్జానా-డి కావాలి. అందేరనే మీరు మీ పిల్లలకు పెరిగే సమయంలో కల్జానా-డి ఇవ్వాలి. పసందైన రుచిగల కల్జానా-డి, విటమినులతో బలపడిన పరిశుద్ధమైన కాల్షియం...అంటువ్యాధులను ఎదుర్కొనడంలో, కాల్షియంను మరింత బాగా వంటికి పట్టించడంలో, అద్భుతమైన జవసత్వాలు యివ్వడంలో సాయపడుతుంది. మీ బిడ్డలకు కల్జానా-డి యివ్వండి. కొత్త శక్తి, ఉత్సాహాలలో వారు ఆడు కొనడం చూడండి.
GR.KD.60.TEL

## పట్టు పరికిణీ

23 వ పేజీ తరువాయి

[illegible] ఖావాలా మెరుస్తున్నాయి. లక్ష్మి సంతోషం కట్టలు తెంచుకున్నది. మాటి మాటికీ పరికిణీ వంక చూసుకుంటూ, దాన్ని హృదయాని కత్తుకుని మురిసిపోతోంది. అది తొడుక్కుంటే తనెలా ఉంటుందో, తన నేస్తాలంతా ఏమంటారో ఊహించుకుని ఉత్సాహం పట్టలేక పోతోంది. ప్రపంచాన్ని జయించినట్లూ, ఆకాశంలోని చందమామ తన సొత్తైనట్లూ ఉంది. దాని ప్రాణానికి. ఆ వెలపిన పరికిణీ తనదయితే.

సందుమలుపులో ఆఫీసునుండి వస్తున్న మోహన్ ఇద్దర్నీ చూశాడు. లక్ష్మి చేతిలో పరికిణీ చూసి,

'పాపం. బయటికి అలా ఉంటుందిగాని దాని మనసు మెత్తనే. నాతో వాదించినా పరికిణీ ఇచ్చేసిందే. ఆ పిల్ల సంతోషం పట్టలేక పోతోందని చెప్పాలి సుశీలతో, అనుకున్నాడు తన భార్యే ఇచ్చి ఉంటుదని నిర్ధారణ చేసుకుని.

ఇంట్లో అడుగు పెడుతూనే.

'మంచి పని చేశావు అయినా నాకు తెలియదూ నువ్వు చాలా జాలి గుండె దానివని. ఇయ్యనంటూనే రెండిటిలో మంచిదిచూసి ఇచ్చావు' అన్నాడుభార్యతో.

'ఏమిటండీ మీరనేది' అంది ఆశ్చర్యంగా. అర్థం కాక. గిన్నెలవాడు పరికిణీ ఇవ్వడం ఆమె లేదు.

'అదే పట్టు పరికిణీ లక్ష్మికి ఇచ్చావుకదూ. నేను సందు మొగలో చూశాను. నా దగ్గ రెందుకు దాస్తావు. నేనూ సంతోషిస్తానుగా. ఆ పిల్ల పాపం ఎలా మురిసిపోతుందో తెల్సా' అన్నాడు సుశీల కళ్లల్లోకి చూస్తూ. తనను ఆశ్చర్య పర్చడానికి ఆమె ఏమీ తెలియనట్లు నటిస్తోందని అతగాడి నమ్మకం.

ఇంతలోవీధిలోంచివచ్చిన రాణి ఈ మాటలువిని, 'అమ్మ ఇయ్యలేదు నాన్నా. సుశీ లమ్మగారు అది ఇచ్చి గిన్నె కొంది. గిన్నెలవాడు ఆ పరికిణీ లక్ష్మి కిచ్చేశాడు ఉత్తినే. డబ్బు వద్దన్నాడు కూడా' అంది కళ్లు తిప్పుతూ.

గతుక్కుమన్నాడుమోహన్. అయితేసుశీలమనసు మార్చుకొనిఇవ్వలేదన్నమాట. గిన్నెకొంటోగానిఊరుకో లేదు.

'వాడే నయం మనకంటే. తినడానికి లేకపోయినా జాలి హృదయ మున్నాయి' అన్నాడు కుర్చీలో కూలబడుతూ.

'అవునులెండి. అలాగే అనండి. మీ కంటికి నేనో రాక్షసిని. నాకు హృదయం ఎలా ఉంటుంది? జాలి ఎలా ఉంటుంది. ఈ రాతి గుండె దాన్నెందు కట్టుకున్నారు!' అంటూ ఆరంభించింది. సుశీలమ్మ కళ్లు వత్తుకుంటూ, ముక్కు తుడుచుకుంటూ.

అమ్మ ఎందు కేడవాల్సి వచ్చిందో అర్థంకాని రాణి ఇద్దర్నీ ఆశ్చర్యంగా చూస్తూ నిల్చుంది. ★

---

## మనిషి - మిథ్య

19 వ పేజీ తరువాయి

"పిల్లందరూ నాతోపాటు ఈవేళే ఆఫీసులో చేరారు" అన్నాడు.

మృణాళిని పకపకా నవ్వింది. ప్రసాదరావు తల చేత్తో తడుంకున్నాడు. మిగిలిన ముగ్గురూ ఖంగారు పడ్డారు.

"చాలా బాగుంది బావా నీ పరిచయం. పరిచయం చేసే పద్ధతి ఇదేనా ? నన్నిక్కడే గుమ్మాని కవతలే నిలబెట్టి—"

"సారీ .... లోపలికి రా" అన్నాడు ప్రసాదరావు.

"వీరు శంకరం, వీరు వాసుదేవరావు, వీరు లక్ష్మీపతి, మృణాళిని మా మావయ్య కూతురు" అని పరిచయం చేశాడు.

"మావయ్య వచ్చారా ?" అడిగాడు ప్రసాదరావు.

"ఇంకా రాలేదు."

"అబ్బే, ఏంలేదు. మా వాళ్లకి అద్దెకో పోర్షను కావాలని అంటేనూ, మావయ్య కేమైనా తెలుస్తుందేమోనని ....."

"అరగంటలో రావచ్చు."

"వొచ్చేస్తారు. సరేనండి. ఆయనొచ్చేవరకూ మనం యిక్కడే కూర్చుందాం. ఆయనొచ్చిం తర్వాత ఆ విషయమేదో చూద్దాం" అన్నాడు ప్రసాదరావు.

మృణాళిని గుమ్మం దాటుతూ బావా అని పిలిచింది. బావకీ పిలుపు వినిపించలేదు. ఆపిల్ల వెళ్లిపోయింది. అతను గోడనున్న కేలండర్ల ప్రాముఖ్యత వివరించాలనే ఉద్దేశ్యంతో అన్నీ శ్రద్ధగా చూశాడు. ఒక కేలండరు చేతిలోకి తీసుకున్నాడు.

"ఇదిగోనండి, ఇది ఓ టాయిలెట్ సోప్ కేలండరు. దీంట్లో వైజయంతిమాల అందంగా ఉందిగదూ. అన్నట్టు గురూగారూ—నిజంగా వైజయంతిమాల యీ—సబ్బునే వాడుతుందంటారా ? లేకపోతే—"

హాల్లో నుంచుని మృణాళిని ఈమాటు కాస్త గట్టిగా 'ప్రసాదం' అని పిలిచింది. ఆ పిలుపుతో అతను చెప్పబోయేది ఆగిపోయింది. కేలండరు పుచ్చుకునే మృణాళిని దగ్గరి కెళ్లాడు. మళ్లా కాసేపటికి వొచ్చి, కేలండరు టీపాయ్ మీద పెట్టి,

"జస్టే మినిట్. ఇప్పుడే వస్తాను. ఈలోగా మీరు మాటాడుతుండండి" అన్నాడు గది దాటుతూ.

ముగ్గురూ మెల్లిగా నవ్వుకున్నారు.

"సందడి చేస్తున్నాడు" అన్నాడు లక్ష్మీపతి.

"బాధ్యతలు నెత్తిన పడేంతవరకూ సందడి చేస్తూ గడపడం చాలామందికి ఉన్న లక్షణమే" అన్నాడు వాసుదేవరావు.

"అతనివల్లనైనా యిల్లు దొరికితే బాగుండును. అన్నాడు శంకరం.

మరో పది నిముషాల్లో దాదాపు డ్యాన్సు చేస్తున్నట్టు నడుస్తూ కాఫీలు పట్టుకొచ్చాడు. ప్రసాదరావు. ముగ్గురికీ కాఫీలిచ్చి చేతులు దులుపుకుంటో—

"నేను మీకు కాఫీ యివ్వలేదని కోప్పడింది మృణాళిని. మీరేమీ అనుకోవద్దు. మరిచిపోయాను. అంతే."

"చాలా శ్రమనిస్తున్నాం" అన్నాడు వాసు.

"మృణాళినికి కాఫీ కాయడమంటే వక్కపొడి నోట్లో వేసుకున్నంత పని. మా అత్తయ్య ఉంటే ఇవన్నీ ఆవిడే చూచుకునే దనుకోండి. ఆవిడేమో ప్రస్తుతం మా ఊళ్లో ఉంటుంది. ఇంటిపనులన్నీ మృణాళిని నెత్తిమీద పడ్డాయి. ఆడపిల్లయి పుట్టిన తరువాత— ఏవంటారు ? ఇంటి పనులూ, వంట పనులూ తప్పనిసరిగా నేర్చుకోవాలిగా" ఈ కాసిని మాటలూ ముగిసిన వెంటనే ప్రసాదరావు చూపు మళ్లా కేలండర్మీద పడింది. వెంటనే నిద్రా తీసుకుని,

"ఇంతకీ వైజయంతిమాల ఆ సబ్బునే వాడుతుందాని అనుమానం" అన్నాడు ప్రసాదం.

"అయ్య బాబోయ్ — మీరా విషయం వదలిపెట్టండి బాబూ — ఆవిడే సబ్బు వాడితే మన కేవిటిలేండి" అన్నాడు లక్ష్మీపతి.

"అహ. మాటవరసకి అడుగుతున్నా. వాళ్ళు వాడేది ఒహటి చెప్పే దొహటీను."

"నేనూ మాటవరసకి అంటూన్నా—ఎన్ మార్కు బీడీల కేలండర్లెప్పుడైనా చూశారా ? దానిమీద మరి మన ...." లక్ష్మీపతి మాట ముగియకముందే ప్రసాదం ఘొల్లున నవ్వేస్తూ,

"చంపారు గురూ .... ఇదీ ఒక పాయింటే సుమా హ .... హ .... హ ...." అన్నాడు ప్రసాదం.

అతన్ని చూచి అందరూ నవ్వుకున్నారు. సరిగ్గా అదే సమయానికి ప్రసాదం మావయ్యగారు వచ్చారు. ప్రసాదరావు సక్రమమైన పద్ధతిలో అక్కడున్న వాళ్లందర్నీ వాళ్ల మావయ్యకి పరిచయం చేశాడు. తర్వాత వాళ్లు వచ్చిన పనీ చెప్పాడు. ఆయన రెండు నిముషాలు ఆలోచించి, ప్రసాదరావుకి కొన్ని గుర్తులు చెప్పి, ఆ యింటికి వెళ్లి కనుక్కోమన్నారు.

గంపెడాశతో బయటపడ్డారు మిత్రులు. ఆయన చెప్పినిల్లు చూడగానే బావుందనిపించింది. చిన్న డాబా ముందు అందమైన కాంపౌండునూ. లక్ష్మీపతి లోపలికెళ్లి ఇంటివారిని పిలిచి అద్దె విషయం అడిగాడు. ఆ యింటాయన అడిగిన ప్రశ్నలకి జవాబుచెప్పి బయట కొచ్చాడు.

"ముప్పై ఐదు రూపాయిలు అద్దెట. నయాపైసా గూడా తగ్గేది లేదని ఖరారుగా చెప్పేడు. ఒప్పుకున్నాను. ఒక పది రూపాయలు అడ్వాన్సుగా యిచ్చి ఈవేళే చేరుతున్నామని చెప్పి వచ్చాను" అన్నాడు లక్ష్మీపతి.

ఆరోజే ఇంట్లో దిగేరు మిత్రులు.

* * *

రోజులు దొర్లుతున్నాయి.

ఆఫీసులో పరిస్థితులు రోజురోజుకీ అధ్వాన్నంగా తయారవుతున్నాయి. అందరూ 'నలుగురి' పైన ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నారు. వాళ్ళు చేసిన ప్రతి పనికీ వేలెట్టి చూపిస్తున్నారు. ఏమి జరిగినా 'ఈ కొత్తవాళ్లతో వచ్చిన చిక్కే యిదండీ. మనం చెపితే వినరు. వాళ్లకి తోచదు. చస్తున్నాం వీళ్లతో' అని విసుక్కుంటున్నారు.

తెలియంది అడుగుతే సరిగ్గా చెప్పడం అటుంచి మొహం చిట్లించుకోడంలాటి పిచ్చి పనులు చేస్తున్నారు. చాటుగా 'కొత్త పక్షులు పట్టే దద్దమ్మలు సుమా !' అని గూడా అనుకుంటున్నారు.

ఆఫీసరు యివన్నీ పట్టించుకోడు. ఆయనకి కావలసింది పని. అంతేగాని, ఆవతలవాడు చస్తున్నాడా, బ్రతుకుతున్నాడా, వాడి చుట్టూ ఉన్న పరి

# మనిషి - మిథ్య

స్థితులేమిటసలు అనే ధ్యాస ఆయనకు లేదు. ఆయన విషయం అది.

హెడ్ క్లార్కు నుంచి ప్యూను వరకూ ప్రతీ వాడూ వాళ్లని అలక్ష్యం చెయ్యడం నేర్చుకున్నారు. ఒకప్పుడు వాళ్లూ కొత్తవాళ్లే, కొత్తవాళ్లయిన తర్వాత పనంతా ఒక్కసారిగా ఎలా తెలుస్తుందనే యింగితం లేకుండా వీళ్లని దెప్పిపొడుస్తూ "మే మందరమూ ప్రయోజకులం, అది చేస్తాం, ఇది పొడిచేస్తాం" అంటూ ప్రగల్భాలు పలకడమూ అలవాటయ్యింది. ఇలాంటి పరిస్థితుల్లో మరొహడూ మరొహడూ అయితే ఏనాడో కాలికి బుద్ధిచెప్పి ఉండేవాడు. నలుగురూ ఒకటై ఒకే మాటమీద నడుస్తున్నారు గనుక, ఎదురు నిలిచి తట్టుకోగల సత్తా ఉన్నది గనక — దేన్నీ ఖాతరు చెయ్యకుండా నెట్టుకొస్తున్నారు.

శంకరం చక్కటి కథలు రాస్తున్నాడనే విషయం తెలిసి, అతనిపైన ఈర్ష్య చూపడం మొదలెట్టారు. ఒకడు బాగుపడుతున్నాడంటే విని బాధపడే జనం ఆ ఆఫీసులో చాలామంది ఉన్నారు.

వాళ్ల చుట్టూ వాళ్లే ఒక చిన్న పరిధి గీసుకుని అదే లోకమని భావించే మానవులూ ఉన్నారు. వాళ్లకి తెలిసిందల్లా బజార్లో వీసెడు వంకాయ లెలా యిస్తున్నారనే విషయ మొక్కటి! ఇలాటి వాళ్లతో ఏది మాటాడినా చిక్కే మరి.

మొదట్లో ఈ వాతావరణాన్ని అసహ్యించుకున్నారు నలుగురూ. తర్వాత సర్దుకోడం అలవాటు చేసుకున్నారు. పదిమంది మధ్యా తమ మాటకి విలువలేనప్పుడు గొంతు చించుకుని తమ గోడు చెప్పుకుంటే ఏం లాభం? లక్ష్మీపతి అంటాడు.

"అయినా వంద మాటలతో పనేమిటి గురూ? ఒక్క వాత చాలదూ? ఆ రోజు వస్తుంది, వాతా పెడతాము. అంతవరకూ సహనం కావాలి. లెటజ్ వెయిటండ్ సీ!"

ఒకరోజున టైపిస్టుమీద ఆకాశ మంతెత్తున లేచి ఎగిరి పడ్డాడు శాస్త్రి. ఆ సమయానికి ఆఫీసరు లేకపోవడంతో, అతని మాటలు ఆఫీసంతటికీ వినిపించేలా అరిచేశాడు. ఇంతా వింటూ నోరు నొక్కుకు కూర్చున్నాడు హెడ్ క్లార్కు. ఆయన గ్గూడా శాస్త్రి నెదిరించే ధైర్యం లేకపోవడం దారుణమే మరి.

అసలు జరిగిన విషయం యిది. కుసుమ అని ఓ టైపిస్టు ఆ ఆఫీసులో పనిచేస్తుంది. ఆవిడకు రెండు రోజులు సెలవు కావలసివచ్చి అర్జీ పెట్టింది. సెలవు మంజూరయ్యింది గాని, శాస్త్రి చిరాకు మాత్రం తారస్థాయిని అందుకుంది.

"మీరిలా సెలవుమీద సెలవు పెట్టేస్తే ఆఫీసు పొజిషనేంగానూ అని 'ఆయన' మండిపడ్డారు. ఏదో చెప్పి సేంక్షన్ చేయించాను. మీరేమో టెంపరరీ కేండిడేట్. ఈ తాత్కాలిక ఉద్యోగానికే సెలవులు మీ యిష్టం వచ్చినట్టు పెట్టేస్తే ఎలా? మీరు మీ పద్ధతి మార్చుకోవాలండీ" అని అన్నాడు.

పాపం, ఆవిడ తలొంచుకుని ఓపిగ్గా అతను అన్న ప్రతి మాటనీ జాగ్రత్తగా ఆలకించింది. అతని ధోరణి చూస్తుంటే ఆఫీసరులా మాటా

కాదు. అసలీ విషయంలో అతనికేం సంబంధం ? సంబంధం ఉన్న ఆఫీసరు ఏమన్నాడో నిజానికి ఎవరికీ తెలీదు. శాస్త్రి తన చేతికి చిక్కిన అవకాశాన్ని చాలా తెలివిగా ఉపయోగించుకుంటున్నాడు. పోక్షాత్తు తనపైనుద్యోగి, ఆఫీసరు తర్వాదే ఆఫీసరంతటివాడు హెడ్ క్లార్కుని తనముంత పెట్టుకుని పెత్తనం చెలాయించడం అతని వళ్లో వడ్డ అవకాశం కాదూ ?

కుసుమ తన సీట్లోకెళ్లి కూర్చుంది. కూర్చున్న దన్న మాటేగాని దించిన తలని మళ్లీ ఎత్తనే లేదు.

లంఛవర్లో ఈ విషయమై శాస్త్రి తన బృందానికి లెక్చరిచ్చాడు. మధ్య మధ్య విట్లూ గట్రా వాడుతూ. వింటూ కొందరు నవ్వేరు, కొందరు హర్షించేరు, మరికొందరు మవునం వహించేరు.

"ఈ పద్ధతి నాకేం బాగులేదు" అన్నాడు శంకరం.

"ఒకడికి బాగుండేద్చిం దేవిట్" అన్నాడు పతి.

"వాళ్లవి రోజులు గురూ !" ప్రసాదం మాట అందించాడు.

"అదీ చూద్దాం !" అన్నాడు పతి కసిగా.

—మరో గంటకి ఆఫీసయిపోతుం దనగా ఆఫీసరు ఇంటికి వెళ్లిపోయారు. శాస్త్రి హెడ్ క్లార్కు సీటు దగ్గర నుంచుని పతిని పిలిపించేడు. పతి వెళ్లాడు.

"మీరు వేళకి అన్నట్టు సరిగ్గా అయిదు గంటలకే వెళ్లిపోతున్నారు గదూ !" అన్నాడు శాస్త్రి.

"చిత్తం" పతి వినయం వటించాడు.

"మాకు రెండు సంవత్సరాల సర్వీసున్నది. హెడ్ క్లార్కుకు చెప్పందే ఈరోజు వరకూ మేము ఇంటికి వెళ్లము."

"అలాగా."

"చాలా సీరియస్‌గా చెప్తున్నాను. మీరు మీ ఇష్టం వచ్చినట్టు వెళ్లిపోడానికిది ఆఫీసను కున్నారా? లేక ...." శాస్త్రి రెచ్చిపోయాడు.

"కాస్త ఆగండి" మాట మధ్యని అడ్డు వచ్చాడు పతి.

ఏమిటన్నట్టు అతనివైపు చూశాడు శాస్త్రి.

"మీకు కందముక్కా, కత్తిపీటా ఈ రెండు వస్తువులు తెలుసా ?" అని తాపీగా అడిగాడు పతి.

ఈ మాటలో ఆఫీసులో అందరూ ఉలిక్కి పడ్డారు. తర్వాత సంభాషణ ఎలా జరుగుతుందో వినాలని కుతూహల పడ్డారు.

"మాకూ చాతనవును మాటలు" అన్నాడు శాస్త్రి ఏమనాలో తోచక.

"అలాగా పాపం ! మరేమీ లేదు. మన తెలుగులో ఈ రెంటి గురించీ ఒక చక్కటి వాడుకున్నది, కందకు లేని దురద కత్తిపీట కెందుకూ ఆవటాని చెప్పుకుంటారు" అన్నాడు పతి.

శాస్త్రి బిక్కమొగం పెట్టాడు. చివరి సీట్లో కూర్చున్న ప్రసాదం ఫక్కున నవ్వేసి తల వంచుకుని సీరియస్‌గా గీతలు గీస్తున్నాడు.

హెడ్ క్లార్కు గుటకలు మింగాడు.

"మిష్టర్ పతి మీరిక మీ సీట్లోకి వెళ్లండి" అన్నారాయన.

"అయితే మీరు చెప్పదలుచుకునేది ఏమీ లేదుగా. దట్సాల్‌రైట్" అంటూ పతి తన సీట్లోకి వొచ్చి కూర్చున్నాడు. అతను కూర్చున్న తర్వాత హెడ్‌క్లార్కు ప్రసాద్ని పిలిచేరు. ప్రసాదం అతి వినయాన్ని నటిస్తూ హెడ్ క్లార్కు దగ్గర కొచ్చాడు.

"మిష్టర్ ...."

"ప్రసాదరావ్."

"ఐనో మేన్ !"

"దెన్ థాంక్స్."

మరింత బిత్తరపోయారు హెడ్ క్లార్కు. కాస్త ఆలస్యంగా అన్నారు.

"ఇది ఆఫీసనుకున్నారా ? మీ కాలేజీ అనుకున్నారా ?"

"ఆఫీసనుకున్నాన్ సార్ !"

"మరి మీ నవ్వు లేమిటీ, ఆ గోలేమిటీ ?"

"మరేనండి—ఉన్నమాట అన్న తర్వాత మెచ్చుకోలేక ఉండలేం చూడండి మరి."

"ఊ మీరప్పుడే పెద్దవాళ్లయిపోతున్నారు."

"మరేనండి. ఈ ఆఫీసులో అందరూ అదే అవుతున్నారండీ ...... ఇదంతా ఎందుకుగాని సార్.... ఏమైనా చెప్పదలుచుకుంటే, మేము చేసింది తప్పని మీకు తోస్తే మీరు చెప్పండి. వింటాం. ఆఫీసర్తో చెప్పించండి. తప్పయితే దిద్దుకుంటాం. అంతేగానీ ప్రతివాళ్లూ మామీద అధికారం చెలాయించాలంటే మాత్రం— గొప్ప కష్టం లేండీ !"

ప్రసాదం ఇంత ఉద్రేకంగా మాటాడుతాడని ఆఫీసులో ఎవరూ అనుకోలేదు. ఈ హఠాత్పరిణామానికి అందరూ ఆశ్చర్యపోయారు. హెడ్ క్లార్కు ముఖం చిన్నబోయింది. ఆయన ఏమీ మాటాడలేక పోయారు.

ఆఫీసైన తర్వాత నలుగురూ యధావిధిగా బయట కొచ్చేరు.

"మన తిరుగుబాటుకీ రోజు నాంది" అన్నాడు పతి.

"మరే .... మనం నల్లులం, దోమలం, చీమలం అని తేలిగ్గా చూస్తుంటే మనకేనా ఆత్మాభిమానం లేనిది" అన్నాడు ప్రసాదం.

"వసుధా, హెడ్ క్లార్కు మంచివాడే ఆయన్ని పాడుచేస్తుంది ఈ శాస్త్రి."

ఇంటికొచ్చిన తర్వాత ఆఫీసు విషయాలు మరి కొన్ని మాటాడుకున్నారు. వాటిల్లో కుసుమ విషయం వచ్చింది. ఆమెను చాలామంది చాటుగా గేలి చెయ్యడం విన్నారు. ఆమె ఎల్లాంటి పరిస్థితుల్లో ఈ ఉద్యోగం చేస్తోందో ఆమెకీ, దైవానికీ తెలియాలి గాని ప్రచారంలో ఉన్న వదంతి ఇది : ఆమె భర్త ఆమె శీలాన్ని శంకించి విడిచి వెళ్లి పోయాడనీ, ఉద్యోగం చేస్తూ గూడా తన పెడదారి వదలిపెట్టలేదని గూడా అంటున్నారు. దీనిలో నిజం, నిజాని కెవ్వరికీ తెలీదు.

చాలాసేపు ఆవిడ విషయమే మాటాడుకున్నారు. ఆ తర్వాత ముగ్గురూ హోటల్‌కి, ప్రసాదం వాళ్ల మావయ్య ఇంటికి వెళ్లిపోయారు.

తర్వాతరోజు ఆఫీసులో చాలా మార్పు వచ్చింది. ఎవరి పని వాళ్లు మౌనంగా చేసుకుపోయేరు. వాతావరణం ఇంత హఠాత్తుగా మారినందుకు సంతోషించేరు మిత్రులు నలుగుతూను. రోజూ ఇంత హాయిగా గడుస్తే ఎంత బాగుంటుందని గూడా అనుకున్నారు.

ఆ సాయంత్రం రూంలో బాతాఖానీ జరుగుతూండగా ప్రసాదం హఠాత్తుగా లేచి,

"వాస్తా .... నా కవతల బోల్డు పనుంది" అన్నాడు.

"ఏమిటో విశేషం" అడిగాడు పతి.

"మొన్న మా అత్తయ్య వచ్చింది గురూ !"

"అవుతే."

"మే మందరం కలసి సినిమాకి వెళ్లాలి" అన్నాడు ప్రసాదం.

"అన్నట్టు నీ పెళ్లి భోజనం మా కెప్పుడు పెట్టిస్తావయ్యా మహానుభావా ! హోటల్ తిండి తినలేక ఛస్తున్నాం" అన్నాడు పతి.


"పోవయ్యా మహానుభావా ! నీతో ఏం మాటాడినా గొప్ప చిక్కు" అనేసి గబగబా వెళ్లిపోయ్యాడు ప్రసాదం.

రూంలో నవ్వులు ప్రారంభమయ్యాయి.

* * *

జీతాలిచ్చే రోజు.

జీవితంలో తొలిసారిగా జీతం పుచ్చుకున్నాడు శంకరం. ఆవేళ అందరి మొహాల్లోనూ కళా




హాయ్యో అయ్యో ఎంతగట్టిగాకొట్టేడో! నాబాబు చెయ్యికందిపోలేదుకదా

కాంతు ఋట్టిపడుతున్నాయి. రూపాయిని నయో పైసలా చూస్తున్నారు. ఎవరో కొంతమంది దుర దృష్టవంతులు మాత్రం దిక్కుమొహం వేశారు. నెల పొడుగూతా చేసిన అప్పులు తీర్చుకునేసరికి వాళ్ల తల ప్రాణం తోకకి వచ్చింది. అప్పులిచ్చిన ఆసాముల కాళ్లా వేళ్లా పడి మరో నెలకి వాయిదా వేయమని కోరుకోడం, వడ్డీ తీసుకుంటూ గూడా వాయిదా పెంచడం యిష్టంలేదన్నట్టు అవతల వాళ్లు విసుక్కోవడం చాటుగా, గుట్టుగా గొడవ తల సాగుతూనే ఉన్నాయి.

ఏ బాదరబందీ లేని గుమాస్తాలకి వచ్చిన జీతా న్నెలా ఖర్చుపెట్టాలో తెలీక తికమక పడుతున్నారు.

మంచినీళ్ల ప్రాయంగా ఖర్చుపెట్టుకోడానికి ఈ బెజవాడ మంచి అనువైన ఊరు. నాలుగు డబ్బు లుండాలే గాని, కాలం సరదాగా గడవటానికి ఏ ఆటంకమూ రానేరాదు. కావలసి నన్ని థియేటర్లు, వాటిల్లో తరచూ మారు తూండే సినిమాలూ, హోటళ్లు వగైరాలకు కొదువలేదు.

జీతం పుచ్చుకున్న మిత్రులు నలుగురూ కాంటీన్లో కూర్చుని ఆ సాయంత్రం ప్రోగ్రాం ఆలోచించడంలో మునిగిపోయారు. చివరికి ప్రసాదం సూచించిన ప్రోగ్రాంని అందరూ ఆమో దించారు. లీలామహల్లో, హేమాహేమీ లందరూ కలిసి నటించిన 'గన్స్ ఆఫ్ నెవరోన్' సినిమాని పావనం చెయ్యాలని ప్రసాదం ప్రతిపాదించాడు గ్రెగరీపెక్, డేవిడ్‌నివెన్, ఆంథోనీ క్విన్‌లూ వాళ్ల నటనా చాతుర్యమూ గురించి తనకు తెలిసినదంతా చెప్పి ఆ సినిమాకి వెళ్లడానికి వాళ్లనీ వప్పించాడు

సాయంత్రం కార్యక్రమం నిర్ణయించుకుని బయట కొస్తూండగా కుసుమ వాళ్లకి ఎదు రైంది. ఎందుచేతనో ఆమె తమని చూస్తూ తటా పటాయించడం గమనించారు ఆమె శంకరాన్ని ఉద్దేశించి—

"మీతో కాస్త పనుంది" అన్నది.

శంకరం ఆగిపోయేడు. మిగతా మిత్రులు ఆఫీసులోకి వెళ్లిపోయారు.

"నాకో చిన్న సాయం చేయగలరా ?" కుసుమ అడిగింది.

"చెప్పండి."

"మా యింటిదగ్గర మావయ్య ఉన్నాడు. ఆయనకీ మధ్యనే పక్షవాతం దాపురించడంవలన ఆర్థికంగా యిబ్బంది పడుతున్నారు. రెండు రోజుల క్రితం అత్తయ్య ఉత్తరం వ్రాసింది. ఒక వంద రూపాయలుంటే సర్దమని. వందరూపాయలిచ్చే స్తోమతు నాకు లేదు. నా అవసరాలు తీరగా ఒక ఏభై రూపాయలు మాత్రం పంపగలను. తతిమా పైకాన్ని ఎవర్నయినా అడిగి తీసుకుందామంటే— అడగ్గానే యిస్తారనే నమ్మకం నాకు లేదు. మిమ్మల్ని ఈ పరిస్థితుల్లో అడక్క తప్పింది కాదు. ఒక్క ఏభై రూపాయలు సర్దండి. ఆ పైకం మెల్లిగా చెల్లించుకుంటాను."

శంకరం వెంటనే జవాబు చెప్పలేదు.

"మీకూ అవసరాలుంటే పోనీండి" ఆమె సిగ్గుపడుతూ అన్నది.

"ఉహూ .... ఇప్పట్లో తల మునిగే అవసరా లేమీ లేవు లేండి. వచ్చినా—ఆదుకునేందుకు మావాళ్లున్నారు." అన్నాడు నవ్వుతో. అయితు

కప్పు తెచ్చి ఆమె చేతిలో పెట్టాడు. అదిఅ తీసుకుంటూ,

"చాలా థాంక్స్. ఈ మేలు మరిచిపోలేను. అవసరానికి ఆదుకున్నారు. కృతజ్ఞురాలిని."

"అంత పెద్ద మాటలనకండి. తోటి ఉద్యోగులం కాబట్టి ఒకరి కొకరు సాయపడక తప్పదు మరి." అన్నాడు శంకరం.

కుసుమ వెళ్ళిపోయింది. ఈ తతంగమంతా దూరం నుంచి గమనించిన శాస్త్రి తన అనుచరుల వైపు చూచి చిరునవ్వు, మొహంలో తగిలించుకున్నాడు. అనుచరులు అతన్ని అనుసరించేరు.

ఆఫీసయిం తర్వాత మిత్రులు గదికి వచ్చారు. స్నానాలు ముగించి సినిమాహాలుకి దారితీశారు. జీతాలిచ్చిన రోజేమో, అందునా పేరుపొందిన సినిమా నేమో జనం రద్దీగా ఉన్నారు. టిక్కట్లు తీసుకుని థియేటర్లోకి వెళ్ళారు.

సినిమా నడుస్తోంది.—

ప్రసాదం కామెంటు చేస్తూనే ఉన్నాడు. 'గొప్పగా ఉంది' 'వహ్వ .... థ్రిల్లింగ్—సుపర్బ్—మార్వలెస్' అంటూ తనకు నచ్చిన సన్నివేశాలక్కు ముగ్ధుడై పరిసరాలు మరిచిపోయి అంటున్నాడు. అక్కడికీ పతి హెచ్చరిస్తూనే ఉన్నాడు 'గొడవ చెయ్యకు బాబూ!' అని.

ప్రసాదం సినిమా చూడటంలో చిన్నప్పుడు యిప్పుడు ఒకే స్థితిలో ఉన్నాడు. ఏమాత్రం మారలేదు. స్టంటు పిక్చర్లూ, వార్‌పిక్చర్లూ అంటే అతనికి చాలా మోజు. తెరమీద జరుగుతూన్న స్టంటు వగైరాలను చూస్తూ హాల్లో గోళ్ళు గిల్లుకోడం అతని కిష్టం ఉండదు. వీలైనంతవరకూ తానుగూడా పక్కనున్న వాడ్ని కుదిపేస్తూ దాదాపు స్టంటు లాటిది చేస్తాడు.

ఇప్పుడు అతను చేస్తున్న పనీ అదేను. ఆ పని వల్ల బాధపడేది పతి. ఒక పక్కన కోపమూ, మరో పక్కన నవ్వూ వస్తున్నాయి అతనికి.

ప్రసాదం ఇలాంటి సినిమాలని "టిష్యూ" పిక్చర్' అంటాడు. టిష్యూ అనగా తుపాకి శబ్దమని అతని భావం. తుపాకి మోతలంటే అతని కిప్పటికీ యిష్టమవడానికి సాక్ష్యం అతనికి అతనేను.

ప్రసాదం చేస్తున్న అల్లరికి ఆ క్లాసు తాలూకు ప్రేక్షకులు కాస్త విసుక్కున్నారు. అంతమాత్రం చేత 'మాస్టారూ మీరు మీ నోరు మూసుకుని కూర్చుంటారా? లేక మెడపెట్టి అవతలకి గెంటేయమంటారా?' అని చెప్పటానికి క్లాసు ప్రేక్షకులకి మనసొప్పడంలేదు. ఇది 'అలుసు' గా తీసుకుని మరీ విజృంభించాడు ప్రసాదం.

ఇక సహించలేని వెనక వరసలోని ఒకానొక పెద్దమనిషి "కీప్ క్వయిట్ ప్లీజ్" అన్నాడు మందలింపుగా. ఈ హెచ్చరిక ప్రసాదానికి తల కొట్టినంత పనైంది. ఇక సినిమా చూసే ఓపిక అతనికి నశించింది. దీనికి తగ్గ ప్రతీకారం చెయ్యాలని అతను నిశ్చయించుకున్నాడు. అయిదు నిముషాలకో తడవ లేచి నిలబడి, బయటికి వెళ్ళి గేటుదగ్గర



సిగరెట్టు సగం వరకూ కాల్చిపారేసి మళ్ళీ వచ్చి కూర్చోడం మొదలెట్టాడు.

వెనుకవరుసలోని గురుడు ఈవిధమైన 'డిస్టర్బెన్స్' కి లోలోన మండిపడి పోయేడు.

ఇంటర్వెల్లో, దీపాల వెలుతుర్లో తనవైపు అతను గుడ్లురిమి మింగేసేంత కోపంగా చూశాడు. ఇది చూచి తన చొక్కా తాలూకు కాలరుని రెండు వేళ్ళతో అందంగా పట్టుకుని అతని మొహంముందు దులిపినట్టు ఒక్క దులుపు దులిపాడు ప్రసాదం. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత తన మనుష్యులకోసం చూశాడు. వాళ్ళు అప్పటికే బయటకు వెళ్ళిపోయారు టీ తాగేందుకు. వాళ్ళు లేకపోవడంతో, కాస్త కలవరపడి, గబగబా బయటకొచ్చేశాడు.

మిత్రులతో కలసి టీ త్రాగుతూండగా మృణాళిని మరొక అమ్మాయితో కనిపించింది. చేతులో కప్పు పట్టుకునే మృణాళిని దగ్గరకు వేగంగా నడిచి

మేనేజర్ గుమాస్తాతో: ఏమయ్యా! ఈ సిగరెట్టు ముక్క నీదేనా!

అమ్మా క్షమించాలి. అది నాది కానే కాదు. పైగా దాన్ని ముందుగా చూసింది తమరే! గుమస్తా వినయంగా సమాధానం చెప్పాడు.

రమాదేవి (పరివల్లి)

ఆమెను చేరుకుని మొహంనిండా నవ్వు నవ్వుతూ "సినిమాకి వస్తున్నట్టు చెప్పనేలేదే?" అని అడిగాడు.

ఆమె ఏమీ బదులు చెప్పకుండానే పక్కనున్న యువతితో "మా బావ ప్రసాదరావ్" అని పరిచయం చేసింది. ఆమె నమస్కారం చేసింది. ప్రసాదం ప్రతి నమస్కారం చేద్దామనుకున్నాడు గానీ చేతిలో టీ కప్పు ఉండడంచేత కుదరక కంగారుగా తలూపాడు.

అంతలోనే మృణాళిని పక్కనున్న అమ్మాయి అందంగా 'హల్లో' అని విష్ చేసింది. ఈ హల్లో ఎవరికో అర్థంగాక చుట్టూ చూశాడు ప్రసాదం తమ దగ్గరికి వస్తున్న శంకరాన్ని చూచి 'ఆహా .... నీకా' అని సరిపెట్టుకున్నాడు. శంకరం తమలో చేరాడు.

"మీకీ ఊర్లో ఉద్యోగం వచ్చినట్టు అక్కయ్య ఉత్తరం రాసింది. ఊళ్ళోనే ఉంటూ మమ్మల్ని మరిచిపోయారంటే ఆశ్చర్యంగా ఉంది సుమాండి" అన్నది శారద.

శంకరం నవ్వి ఊరుకున్నాడు.

పిల్ల కళ అర్థంకాక, అప్పటికే చల్లారిపోయిన టీని గబగబా నాలుగు గుటకల్లో తాగేశాడు ప్రసాదం.

"ఇతను ప్రసాదరావని—" శంకరం ప్రసాదాన్ని పరిచయం చేయబోతూండగా—

"నో బ్రదర్ .... మా పరిచయం మృణాళిని ద్వారా యిందాకే జరిగింది. కానీ .... ఈవిడగారి పేరేమిటో?" అన్నాడు ప్రసాదం మూతి తుడుచుకుంటూ.

"మిస్ శారద. మా బంధువులు" అన్నాడు శంకరం. ఆ తర్వాత శారదని మిగిలిన యిద్దరి మిత్రులకీ పరిచయం చేశాడు శంకరం.

శారద తమయింటి చిరునామా చెప్పి వీలైనప్పుడు తప్పకుండా రమ్మని ఆహ్వానించింది శంకరాన్ని.

"మీ పాట వినడానికైనా వస్తాను సరా?" అన్నాడు శంకరం.

"అవుతే గొప్పగా పాడుతారన్నమాట" అన్నాడు ప్రసాదం.

"రేడియో ...."

"అదేంలేదు గానీ .... మీరు తప్పకుండా ఒకమాటు మా యింటికి రావాలి. అమ్మగారూ, నాన్నగారూ మిమ్మల్ని చూడాలని రోజూ అనుకుంటున్నారు" అన్నది శారద శంకరం మాటకి అడ్డుపడుతూ.

బెల్లు మోగింది. సెలవు తీసుకుని అందరూ థియేటర్లో అడుగుపెట్టారు కానీ, వాసు గేటు దగ్గరే నిలబడి—

"నేను రూమ్‌ కెడతాను. మీరు పిక్చరు చూచి రండి" అన్నాడు.

మిత్రులు ఆ మాటకి ఆశ్చర్యపోయేరు.

"ఎందుకు?" అన్నాడు ప్రసాదం.

"సినిమా చూడ బుద్ధిపుట్టి కావడంలేదు" అన్నాడు.

"వాట్ .... ఇంత గొప్ప పిక్చర్ని—"

"అదికాదు ప్రసాదం—నా మనసు బాగోలేదు."

"నేనింకా గొడవ చేయనుగా" అన్నాడు ప్రసాదం నొచ్చుకుంటూ. వాసు అతని భుజాన్ని తట్టి అనునయంగా—

"నీ గొడవవల్ల కాదు—నా మనసే బాగోలేదు. అంతే." అనేసి వెళ్ళిపోయాడు వాసు. అత నెందుకు వెళ్ళిపోయాడో అర్థంగాక మిగిలిన సినిమానంతా అంతంతమాత్రంగానే చూశారు. సినిమా అయిన తర్వాత తిన్నగా రూమ్‌ కొచ్చారు.

తలుపులు తీసేఉన్నాయి. దొడ్లో లైట్లు వెలుగుతున్నాయి. పతి శంకరంవైపు చూశాడు. శంకరం ప్రసాదం వంక చూశాడు, ప్రసాదం పెదిమి విరిచాడు అయోమయంగా.

దొడ్డి గుమ్మం దగ్గరికి వచ్చారు. నూతి గట్టు పైన కూర్చున్న వాసుని చూశారు. మెల్లిగా అతని దగ్గరికి వెళ్ళారు. అతనేదో ఆలోచిస్తున్నాడు. అతని చేతిలో అయిదు రూపాయల కాగితం రెపరెప లాడుతోంది.

"వాసూ" అతని భుజంమీద చెయ్యి వేసి పిలిచాడు పతి. (సశేషం)

# న్యూఢిల్లీ లేఖ

7 వ పేజీ తరువాయి

చాలా అద్భుతమయినది. కాని, పరిసరాలు దానిని ఇంకా అద్భుతంగా చేశాయి— చూసేవారిని చకితుల్ని చేసే ద్వారం, వెనకాల ఆకాశంలోకి లేచి పోతున్న సమాధి తెల్లని గుమ్మటం, ఈ ద్వారంలో మంచి పల్లకీలో వచ్చాడు ముసిలి రాజు, అతని ముందు రాణి, కొడుకులు మరొక పల్లకిలో వెళ్లగా ఈ విధంగా రాజరికం చిహ్నం ఒకటి తన సజీవ సమాధికి వెళ్లిపోయింది హాడ్సన్ ముందుకి వచ్చాడు, ఒరనుంచి బయటికి తీసిన కత్తితో, రాజుని తన ఆయుధాలు వదులుకోమన్నాడు. ఆ వృద్ధుడు; తమరేనా 'హాడ్సన్ బహదూర్' అని అడిగాడు, రాయబారి ఇచ్చిన అభయాలని మరొకసారి స్వయంగా ఇవ్వమన్నాడు. ఇది అతను కోరినట్లే జరిగింది, హాడ్సన్ రాజుగారు, జీనత్ మహల్‌వల్ల పుట్టిన కొడుకుల ప్రాణాలకి భయం ఉండదని హామీ ఇచ్చాడు. చక్రవర్తి ఆయుధాలు ఇంగ్లీషువాని స్వాధీనం అయ్యాయి. అతను వాటిని తన 'ఆర్డర్లీకి' ఇచ్చేశాడు. ఖయిదీని రక్షిద్దామని ఎవరయినా ప్రయత్నిస్తే రాజుని కుక్కని కాల్చి చంపినట్లు చంపేస్తానన్నాడు. అందరూ నగరం వైపు నడిచి వెళ్లిపోయారు. చాలా నెమ్మదిగా ఉంది అయిదు మైళ్ల నడక. ఏదయినా ప్రమాదం కూడా సంభవించి ఉండవచ్చు, ఎందుకంటే పల్లకీల వెంట ఒక పెద్ద గుంపు పోగయింది. వారు సంభ్రమంతో, ఆశ్చర్యంతో— ఆవేశంతో మాత్రం కాదేమో—కొంత దూరంవచ్చి 'లాహోర్ గేటు' రాగానే జారుకున్నారు. హాడ్సన్, అతని ఖయిదీ చాందినీ చవుక్ పెద్దవీధి వెంబడే నగరం ప్రవేశించారు.

"అతను స్వాధీనం చేసుకున్న ఖడ్గాలలో ఒకటి నాదార్‌షా పార్శ్వాన్ని అలంకరించింది, మరొకటి జహంగీర్ చక్రవర్తి ధరించినది."

ఈ వ్యక్తి కోసమే పోయిన వారం ఢిల్లీ ప్రజలు ఏడ్చారు.

**ఒక పెద్ద ప్రశ్నవుంది: తిరుగుబాటు విజయవంతమై బ్రిటిషువారు ఇండియా వదిలిపోయినట్లయితే ఏమయ్యేది? భారత దేశ పరిస్థితి ఎంత బలహీనంగా ఉందంటే బ్రిటిషు వారి బదులు ఫ్రెంచివారు, లేక పోర్చుగీసు వారు వచ్చేవారు. ఇక్కడివారి మధ్య పోటీలు ఎలా ఉన్నాయంటే రష్యన్‌లని కూడా పిలిచేవారేమో! బ్రిటిషువారికి ఢిల్లీలో సాయంచేసిన దెవరు? బహదూర్‌కుషా కొడుకు మామగారైన మీర్జా ఎలాహీబక్షీ.**

ఢిల్లీ సామ్రాజ్యం పునరుద్ధీపించాలనే కోరిక తన కెప్పుడూ లేదని తనే వప్పుకున్నాడు. విదేశీయులకి సహాయం చేస్తే తనకి మంచిదనుకున్నాడు. రాజుగారి శ్రేయోభిలాషికింద నటిస్తూనే ఈ ద్రోహం చేశాడు,

**దేశాన్ని ఒకటిచేసి, ఒక కేంద్రాధికారాన్ని స్థాపించి, చక్కటి పరిపాలనని, సమాచార ప్రసార సౌకర్యాలని, శాసనసభల ద్వారా పనిచేసే ప్రజాస్వామ్య పద్ధతులని మనకు వదలివెళ్లారు బ్రిటిష్‌వాళ్లు. ఇప్పుడు బహదూర్‌ని నెపోలియన్‌తో పోల్చడం తేలిక. భారత దేశం కూడా చైనా, బాల్కన్ పరిస్థితికి లోనయి ఉండవచ్చుననే సంగతి మర్చిపోతున్నారు.**

మొగల్‌లు బ్రిటిషువారి వలె కాక భారతదేశంలో స్థిర పడిపోయారని మెచ్చుకున్నారు ప్రధాన మంత్రి. వారే ఈ పని చేస్తే ఏమయ్యేదో? బెంగాల్‌లో క్లయివ్ వంశం, ఉత్తర ప్రదేశ్‌లో వారెన్ హేస్టింగ్స్ వంశం, బొంబాయిలో ఎలిఫిన్‌స్టన్ వంశం స్థాపితాలయ్యేవా? అయితే అవీ మొగల్ వంశాల లాగే నశించిపోయి ఉండేవి కాని భారత స్వాతంత్ర్యానికి అడ్డు తగిలేవి. నిజమే! గతం అందాలలో ఒకటి అది గతంగా ఉండటమే! మర్చి పోవటంలోనే మానవజాతి పురోగమనం ఇమిడి ఉంది! ★

# రాజధాని కబుర్లు

10 వ పేజీ తరువాయి

దని కూడా అన్నారు. అదనపు భూమిశిస్తు చట్టం వలన, రైతులోకం ఎన్నో బాధలకు గురి అవుతోంది. దీన్ని కూడా ప్రతిఘటించటానికి భారీ ఎత్తున, ప్రజా బాహుళ్యం సిద్ధపడేలాగున తగిన చర్యలు తీసుకోవటానికి కూడా ఆలోచనలు జరుగుతున్నాయని అన్నారు.

అసెంబ్లీ శీతాకాలపు సమావేశం ప్రారంభమయింది. ఉభయ శాసన సభల సమావేశంలోనూ, గవర్నరుగారు మామూలుగా చేయవలసిన ఉపన్యాసం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారు, ఇంతవరకు సాధించిన ఘనకార్యాలన్నింటిని ఏకరువు పెట్టటం, ఇక ముందు చేయబోయే కార్యక్రమాన్ని సూచన ప్రాయంగా తెలియపరచటం, జాతీయ రక్షణ నిధికి మన రాష్ట్రం ఇచ్చిన నాలుగున్నర కోట్ల రూపాయలు, రాష్ట్ర ప్రజల దృఢ విశ్వాసాన్ని తెలియపరుస్తాయన్నారు. భారీ పరిశ్రమల సత్వర నిర్మాణాన్ని గురించి ఆశాభావాన్ని వెలిబుచ్చారు. రాజమండ్రి కాగితం మిల్లును ప్రయివేటు యాజమాన్యానికి అప్పగించటాన్ని సమర్థించారు. యాభై లక్షల రూపాయలు వెచ్చించి గోదావరి మీద రైలురోడ్డు వంతెన ఒకటి నిర్మించటానికి ప్రభుత్వంవారు నిశ్చయించారు. పంచాయితీ రాజ్యంలోనూ, ఆరోగ్య, విద్యాశాఖల్లోనూ, ఎన్నో అభివృద్ధి పథకాలు సాధించారు. కుటీర, చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రభుత్వంవారు కృషి చేస్తున్నారు. బంగారం పనివారలకు, ప్రభుత్వం వారు ఆర్థిక సహాయం చెయ్యటానికి నిశ్చయించారు. పంచవర్ష ప్రణాళికల అమలుకు కాయశుద్ధిగా ప్రభుత్వంవారు కృషి చేస్తున్నారు. ఇలాంటి మాటలే గవర్నరుగారి ప్రసంగం నిండా.

ఈ ప్రసంగంలోని విషయాల్ని గురించి చర్చలు జరుగుతున్నాయి. ప్రతిపక్షంవారు ఈ ప్రసంగంలో ఉండాలసిన ముఖ్య విషయాలు లేవని తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఉత్తేజంగానూ, ఆశాజనకంగానూ, లేదని కొంతమంది అభిప్రాయం. ప్రభుత్వంవారు మాత్రమ్ ఈ ప్రసంగం చాలా నిర్మాణాత్మకం గానూ, విషయాలన్నింటినీ చర్చించి సమగ్రంగానూ ఉన్నదని గట్టిగా [illegible]స్తున్నారు. కారణం వారు తయారు చేసి గవర్నరుగారి కిచ్చింది కాబట్టి, ఇంకా తర్జన భర్జనలు సాగుమానే ఉన్నాయి. ఈ శీతాకాలపు శాసనసభా సమావేశాలు, డిసెంబరు 15 వ తేదీ దాకా షుమారు జరుగుతూ ఉంటాయి. చర్చల్లోనూ, ప్రశ్నల కాలంలోనూ, ఎన్నో విషయాలు బైట పడుతూ ఉంటాయి. ప్రజలంతా ఆసక్తిగా నిరీక్షిస్తూ ఉండటం సహజం.

— ఐ. ఎల్. ఎన్. ★

# అవి - ఇవి - అన్ని

## భరణీ పిక్చర్సు 'వివాహబంధం'

భరణీ పిక్చర్సువారు "సాత్‌పాక్ కె బాంధా" అనే బెంగాలీ చిత్రాన్ని తెలుగులో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి "వివాహ బంధం" అని నామకరణం చేశారు. అక్టోబరు 29 వ తేదీ నుండి నవంబరు 7వ తేదీ వరకు వాహినీ స్టూడియో 1వ ఫ్లోర్‌లో రిటైర్డు ప్రిన్సిపల్ గారి ఇల్లు మేడ మీద సెట్ వేసి షూటింగ్ జరిపేరు. భానుమతి పాడిన రెండు పాటలను రికార్డు చేశారు. మరికొన్ని దృశ్యాలను కూడా చిత్రీకరించారు.

భారతిగా— భానుమతి, అరుణగా— వాసంతి, చంద్రశేఖరంగా— యన్. టి. రామారావు, రఘుగా, ప్రభాకరరెడ్డి, లెక్చరర్‌గా— నాగయ్య, మాణిక్యాంబ (లెక్చరర్ భార్యగా) కన్నాంబ ఇంతవరకు పాల్గొన్నారు.

దర్శకుడు : కె. హేమాంబరధరరావు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరిలో ప్రారంభించ నున్నట్లు నిర్మాతలు తెలియ జేశారు.

## శ్రీ పద్మాలయావారి మూఢనమ్మకాలు

శ్రీ పద్మాలయావారు నిర్మించిన "మూఢ నమ్మకాలు" చిత్రం ఈ నెలలోనే విడుదల కానున్నది. ఈ చిత్రంలో బి. సరోజాదేవి, జెమినీ గణేశన్ తంగవేలు, మొదలగువారు నటించారు. ఈ చిత్రానికి మాటలు పాటలు : రాజశ్రీ, కూర్పు: రామదాసు, దర్శకుడు : శ్రీనివాస్, నిర్మాత: సంగీత దర్శకుడు : ఎం. ఎస్. శ్రీరాం.



జగపతిపిక్చర్స్ ప్రొడక్షన్ నెం 3లో ఒక దృశ్యం.

ఈ చిత్రానికి రచన— విశ్వేశ్వరరావు, పాటలు: సి. నారాయణరెడ్డి, సంగీతం : ఎం. బి. శ్రీనివాస్, సంగీత పర్యవేక్షణ : పి. భానుమతి, ఛాయ: అన్నయ్య, కళ : రాజేంద్రకుమార్, నిర్మాత — దర్శకుడు : పి. రామకృష్ణ.

## మిత్రద్రోహి

మహానంది పిక్చర్సు వారు నిర్మిస్తున్న "మిత్రద్రోహి" చిత్రానికి, ఆ కంపెనీకి, దర్శకుడు శ్రీ ప్రత్యగాత్మకు ఎటువంటి సంబంధం లేదని ప్రత్యగాత్మ తెలియ జేశారు.

## బ్రహ్మచారి

రఘురాం ఫిలింస్‌వారు తమ తృతీయ చిత్రం పేరు "బ్రహ్మచారి" అని నిర్ణయించారు. ఈ ఈ చిత్రంలో యన్. టి. రామారావు, కృష్ణకుమారి, కథానాయక నాయకులుగా ఉంటారు.

## శ్రీ సింహాచలక్షేత్ర మహిమ

"ఓహో ! ఏలిక— ఇదే వేడుక
ఈ వసంత వినోదాలు నీ కానుక. . .
ఆకాశంలో తారను నీ కోసం భువి జారేను
మేలుకువలో కలను
కలలో నీ చెలిని
ఔనన్నా, కాదన్నా నీ దానను. . . . . ."

పై పాటను రాజశ్రీ వ్రాయగా పి. సుశీల తన బృందంతో పాడగా రికార్డు చేయబడింది. పురూరవ చక్రవర్తి (కాంతారావు) ఎదుట శిరీష జిప్సీ (మారు వేషం)లో నృత్యం చేస్తుండగా చిత్రీకరిస్తారు.

శ్రీ సరస్వతీ మూవీస్ అండ్ శ్రీ వెంకటేశ్వర ఫిలింస్ (ప్రయివేట్) లిమిటెడ్ వారు నిర్మిస్తున్న "శ్రీ సింహాచలక్షేత్ర మహిమ చిత్రంలో పై పాటను చిత్రీకరిస్తారు. ఈ చిత్రాన్ని డిసెంబరు, 63వ సంవత్సరానికి పూర్తి చేయనున్నట్లు నిర్మాతలు తెలియ జేయనున్నారు.

ఈ చిత్రంలో కాంతారావు, రేలంగి, చలం, రాజనాల, నాగయ్య, నల్లరామమూర్తి, రాజబాబు, కృష్ణకుమారి, గిరిజ, ఎల్. విజయలక్ష్మి, సూర్యకాంతం (గెస్టు) రామకృష్ణ (గెస్టు) ఆర్టిస్టులు.

మాటలు, పాటలు : రాజశ్రీ, సంగీతం : టి. వి. రాజు, ఛాయ : ఆర్. మధు, కళ : బి. ఎన్. కృష్ణ, నృత్యం : చిన్నీ—సంపత్, కూర్పు : మార్తాండ్, కథ, దర్శకత్వం : బి. వి. ప్రసాద్.,

## సెట్ మీద "గుడిగంటలు"

హరి హాల్లో పచార్లు చేస్తూ 'ఎవరో నన్ను కవ్వించి పోయే దెవరో' అని పాడుతుంటాడు. వాసు వస్తాడు.

"అంతే ! అంతేలే ! పేరు కనుక్కోకుండా ప్రేమించిపారేస్తే— ఎవరో— ఎవరో— అనే పాడుకోవాలి."

"నువ్వా !"

గుర్తుకొచ్చింది ! కూనిరాగాలు ఆరంభం. ఆ !

"వాహ్ ! పిల్లల గోల నీ కెందుకు చెప్పు ? పక్కని చినదాని కోసం బెంగెట్టుకోవడం ఎంత బాగుంటుందో, ఆ నొప్పి ఎంత తీయగా ఉంటుందో అసలు ఆ జోలికి పోనివాడికి నీకేం తెలుస్తుంది.?"

"లేదు బ్రదర్ ! నిన్నటి వరకు అంతే కావి, నిన్నటినుంచీ ...... "

"ఏమిటీ ! పడ్డావా ! ప్రేమలో పడ్డావా! వండర్‌ఫుల్— కాని .... చూడు ఇందులో నువ్వు క్రొత్తవాడివి. బొత్తిగా అనుభవం లేదు గదా ! ఎందుకైనా మంచిది. ప్రేమపాఠాలు నా దగ్గర ప్రయివేటు చెప్పించుకో."

"నీ మొహం ! ఎద్రసు తెలియకుండా— పేరడక్కుండా— పార్టీచ్చేసిన నువ్వే చెప్పాలి ప్రేమ పాఠం.

"ఆల్‌రైట్ ! నేను ఫూల్‌నే. నాకు తెలీదు. పెద్ద నువ్వు ఏపాటి కనుక్కున్నావ్. నువ్వు చెప్పు, చూద్దాం. నీ ప్రేయసి పేరు, ఊరూను."

"ఓ యస్ ! పేరు కస్తూరి. చార్మింగ్ యంగ్ థింగ్."

"కస్తూరి ....... "

"పేరే వండర్‌ఫుల్‌గా ఉంది కదూ ! నువ్వు చెప్పుతావే మాయలేడి— గీడీ—ఈ అమ్మాయి ముందు అవన్నీ ఎందుకూ పనికిరావు."

"ఊ .... " నవ్వుతాడు హరి.

"ఎంత ధీమా !, ఎంత పొగరు ! ఎంత విగరు! ఎంత నిర్లక్ష్యం !"

"ఎంతేమిటి ?"

"నీ తలకాయంత ! హరి ఆ అమ్మాయిని మించిన పిల్ల ఈ హోల్ వరల్డ్‌లో లేదంటే నమ్ము."

"నమ్మను—మాయ తర్వాత—అను !"

"అసలు—మాయ గీయ నథింగ్— కస్తూరి ముందు మాయ అసలు నిలబడదు. కస్తూరి ఈజ్ గాడెస్ !"

"మాయ ఈజ్ ఏంజిల్ ! దేవతే అలా దీపాలు వెలిగినట్టుంటుంది.

"కస్తూరి ఈజ్ గ్లాడెస్! కస్తూరి నవ్వు కోటి

దీపాల వెలుగు—దేవతే ఊర్వశి ......"

"నా మాయ—అచ్చు రంభే."

"నీ మొహం, నువ్వు పెద్ద రంభని చూశావా?"

"నువ్వు ఊర్వశిని చూశావా ?"

"చూడలేదు. కస్తూరిని చూస్తే ఎవర్నీ చూడనక్కరలేదు."

"నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు మాయా ఈజ్ మాయా !"

"నువ్వు లక్ష చెప్పు—కోటి చెప్పు కస్తూరి ఈజ్ కస్తూరీ."

"మాయా ఈజ్ గ్రేటర్ !"

"కస్తూరి ఈజ్ది గ్రేటెస్ట్! కస్తూరి ముందు నీ మాయా గీయా దిగదుడుపుకు కూడా పనికి రావు !"

"వాసూ ! ...." గర్జించి కాలర్ పట్టుకుంటాడు. వదిలేస్తాడు.

"అరె .... అదేన్రా ? హరీ !"

"ఓ .... అయామ్ సారీ ! అయామ్ సారీ—!"

"ఇట్సాల్‌రైట్ ! సిల్లీ ఫెలో ఈ యింట వైభవంగా పెళ్లి జరిపి—ఈ యింటికి మహాలక్ష్మిని ప్రతిష్ఠిస్తాను. ఆ అమ్మాయి దొరకాలంటే నిజంగా అదృష్టం ఉండాలి హరీ !"

"కాదు—నీవంటివాడు భర్త కావడానికి ఆమె పెట్టి పుట్టాలి. చెప్పు—వాసూ ! ఎవరా కస్తూరీ ?"

"మన నరుగుపాడు—ఎస్టేట్ గుమస్తా లేడూ! సుబ్బయ్యగారు—ఆయన కూతురు !"

"అయితే ఇంకేం క్షణాలమీద పని !"

"తొందరపడకు హరీ ! మనకు డబ్బుంది కదా అని పిల్లను కొనగలమా ? యిష్టాయిష్టాలు...!"

"అవన్నీ నా కొదిలెయ్ ! ఒప్పించే పూచీ నాదిగా ?"

ఇంతలో మేనేజరు ప్రవేశించి సుబ్బయ్యగారు వచ్చినట్టూ, వాసుని చూడాలని అంటునట్టూ తెలియజేస్తాడు. హరి వాసూలు మొహా మొహాలు చూసుకుంటారు.

"ఏం ?"

"ఆల్‌రైట్! క్రైౖ!"

"నువ్వు రాకు— నేను మాట్లాడుతాను" అని వాసూతో హరి చెప్తాడు. వాసు లోపలికి వెళ్తాడు. సుబ్బయ్యగారిని రమ్మనమని మేనేజరు ద్వారా హరి కబురుచేస్తాడు హరి సోఫాలకేసి వెళ్తాడు.

"నమస్కారం ! సుబ్బయ్యగారూ ! ఇలా దయ చేయండి !" (సుబ్బయ్య తెల్లబోతాడు.)

"చి . .. చిత్తం."


"వీరు మిస్టర్ హరనాథ్ ! మన చినబాబుగారి ప్రాణస్నేహితులు" అంటూ హరిని సుబ్బయ్యకు పరిచయం చేస్తాడు.

"ఓహో ! చిత్తం ! చిత్తం ! నమస్కారం !"

"కూర్చోండి !"

"చిత్తం ! ఆ ముఖం ! ఆ తేజం చూస్తేనే తెలుస్తుంది బాబుగారి ప్రాణస్నేహితులని. సత్సాంగత్యం అన్నారు ! దొరగారు గనుక ఆపద బాంధవుడిలా అడ్డుపడకపోతే— ఈపాటికి నేనూ నా కుటుంబం సర్వనాశనం అయిపోయేవాళ్లం."

"చినబాబుగారి హృదయమే అటువంటిది. ఆయన ఒక్క మీ ఇల్లే కాదు—మనలాంటి కుటుంబా



"కలవారి కోడలు"లో ఎన్. టి. రామారావు

లెన్నో నిలబెట్టారు. ఇప్పుడాయన్నే ఒక ఇంటివాడ్ని చేసి—ఆయన ఇంట దీపం వెలిగించే బాధ్యత అదృష్టం మనకి లభించింది.—ఏమంటారు !"

"చిత్తం !"

"తమరు శుభం అని దీవిస్తే చాలు !"

"నేనా .... నేను దీవించడమా—బాబూ తమరు—తమరనే దేమిటో బోధపడటంలేదు—మన్నించాలి !"

"బోధపడటాని కేమీ లేదు. మీ అమ్మాయి కస్తూరిని చినబాబుగారి కిచ్చి—వివాహం జరిపించాలి !"

"ఆఁ ! ఏమిటి ? ఏమన్నారు బాబూ ! నా బిడ్డని అయ్యగారికి జమీందారుగారికిచ్చి వివాహం! నా తల్లిని యీ యింటికి రాణిని చెయ్యమనా ?"

"అక్షరాలా అంతే !"

"బాబూ ! వృద్ధుడ్ని— అవమాన దుఃఖంతో గుండె చితికిపోయింది. నాతో పరిహాసాలు వద్దు."

"సుబ్బయ్యగారు ! నేను పరిహాసా లాడటం లేదు. మనసారా అడుగుతున్నాను. చినబాబుకు మీ అమ్మాయి నచ్చింది. మీ రంగీకరిస్తే ముహూర్తము పెట్టిస్తాను. ఏమంటారు ?"

"ఏమంటాను బాబూ ! ఏమనగలను ? భగవంతు డంతటివాడు వచ్చినా నాకళ్లడాలానంటే—నేనేమనగలను ? సరే ! అనే యోగ్యత మాత్రం నా కేది ?

"తమకు సమ్మతమేగా ..... ముహూర్తం పెట్టేయ్యొచ్చుగా ..... !"

"ఇదంతా మా తల్లి అదృష్టం !"

(వాసు ప్రవేశిస్తాడు.)

"సుబ్బయ్యగారూ ! ఒక్కమాట. నే నీవేళ



"1972" చిత్రం సెట్‌మీద ఒక దృశ్యం. (రూప)

మీకు ధనసహాయం చేస్తున్నానని మొహమాటం పడి మాత్రం ఒప్పుకోకండి. విదానంగా ఆలోచించి చెప్పండి నేను మీకు యజమానిని కావచ్చు గాని మీ కుటుంబానికి కాదు. అందువల్ల ఇంటికి వెళ్లి సంప్రదించండి!"

"చిత్తం!"

"అదేదో తొందరగానే తేల్చండి!"

"మేనేజరుగారూ! పాతికవేలు రొక్కం తీసుకెళ్లి వా రింటికి ఒప్పజెప్పండి!"

"యస్సార్!"

"సెలవు బాబూ!"

"మంచిది!"

మేనేజరు, సుబ్బయ్య కలిసి వెళ్లిపోతారు. హరి, వామాలు మిగులుతారు.

"ఊc— నీవయ్యా పెళ్లికొడుకా? రేపు పెళ్లయితే అయ్యగారి దర్శనం బొత్తిగా కరువై పోతుంది కాబోలు."

"కాబోలు—పెళ్లిపెద్దా—కాబోలు!"

ఈ సన్నివేశం రాజలక్ష్మివారి "గుడిగంటలు" చిత్రంలోనిది ఈ సన్నివేశంలో వాసూగా ఎన్. టి. రామారావు, హరిగా జగ్గయ్య, గుమాస్తాగా నాగయ్య, మేనేజరుగా కె. వి ఎస్. శర్మ పాల్గొన్నారు.

ఇంకా కిష్టు (కృష్ణారావు) గా రేలంగి, భద్రయ్యగా రమణారెడ్డి, కస్తూరిగా కృష్ణకుమారి, సుభద్రగా వాసంతి, కళ్యాణిగా గిరిజ, నటిస్తున్న యీ చిత్రంలో శాంతకుమారి, సీతారాం వగైరాలు ఉన్నారు.

మాటలు • ముళ్లపూడి వెంకటరమణ, పాటలు : ఆరుద్ర, ఆత్రేయ, సి నారాయణరెడ్డి, చిరంజీవి, సంగీతం : ఘంటసాల, ఛాయ : పి. నాగేశ్వరరావు, కళ : కృష్ణారావు, నృత్యం • పసుమర్తి, కూర్పు : ప్రకాష్, అసోసియేట్ డైరెక్టర్ : వి రామచంద్, దర్శకుడు : వి. మధుసూధనరావు, నిర్మాతలు . సుందర్‌లాల్ నహతా అండ్ డూండీ.

## సినిమా థియేటర్ శ్రీ రేలంగిచే ప్రారంభోత్సవం

గుడివాడలో శ్రీ వెంకటేశ్వరా థియేటర్ నూతనంగా నిర్మించి, నవంబరు 4వ, తేదీ ఉదయం గం. 10—50 ని. లకు శ్రీ రేలంగి వెంకట్రామయ్యచే ప్రారంభోత్సవం చేయించారు సభకు మంత్రి శ్రీ యం. ఆర్. అప్పారావు గారు అధ్యక్షత వహించారు.

## జైహింద్ స్టూడియో సత్యం ప్రత్యేక బహుమతులు

ఇటీవల మద్రాసు సోషల్ అండ్ కల్చరల్ క్లబ్‌వారు నిర్వహించిన నాటక, నాటిక పోటీలలో శ్రీ సారథికి చందన అశోక స్థానము, చాక్లెటిఫిన్‌కారియర్, రెండు రూపాయలు ప్రత్యేక బహుమతులుగా జైహింద్ స్టూడియో సత్యం కీ॥శే॥ టి. అశ్వర్థ నారాయణగారి జ్ఞాపక చిహ్నంగా ఇచ్చేరు. వాటిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గా. శ్రీ సంజీవరెడ్డిగారు శ్రీ సారథికి అందజేశారు. ఆ విధంగానే ప్రసిడెంటు పట్టయ్యకు ఒక చందన అశోక స్థానం, ఒక స్పెన్సర్ చుట్టల పెట్టె కీ॥ శే॥ దవులూరి ప్రసాద్‌రావు జ్ఞాపక చిహ్నంగా జూనియర్ ఆర్టిష్టుల తరఫున అందజేశారు. వీటిని కూడ ప్రసిడెంటు పట్టయ్య పాత్రధారికి శ్రీ సంజీవరెడ్డిగారు అందజేశారు.

సి. ధర్మారావు. ★



నర్తనశాలలో కాంతారావు

## హైదరాబాద్ సినిమా

9 వ పేజీ తరువాయి

ప్రప్రథమంగా బేగంపేట విమానాశ్రయంలో షూటింగు జరిపారు

ప్రధానమైన డాక్టర్ చక్రవర్తి పాత్రను శ్రీ నాగేశ్వరరావుగారే పోషిస్తున్నారు. జగ్గయ్య, గుమ్మడి, జానకి, కృష్ణకుమారి, మురళీకృష్ణ ప్రభృతులు కూడా నటిస్తున్నారు

చిత్ర నిర్మాణంలో సిద్ధహస్తులయిన శ్రీ డి. మధుసూధనరావుగారు దర్శకులు. శ్రీ ఆదుర్తి సుబ్బారావుగారు ఈ చిత్రాన్ని అత్యాధునికంగా రూపొందించే సన్నాహాలు చేస్తున్నారు.

విమానాశ్రయంలో షూటింగ్ ప్రారంభం చేసిన సమయంలో అక్కడ చేరిన బహుకొద్ది మందిలో నేనూ ఉన్నాను. శ్రీ మధుసూధనరావు ఆదుర్తి సుబ్బారావుగారలు అక్కడ చేసిన ఏర్పాట్లు, షూటింగు నిర్వహించిన తీరూ నిజంగా వారి సామర్థ్యానికి నిదర్శనాలుగా కనుపించాయి ఇన్ని చిత్రాలను వెలువరించిన అనంతరం కూడా వారి సామర్థ్యము, ఉత్సాహము రవంతయినా సడలలేదనటంలో ఆశ్చర్యంలేదు.

నాగేశ్వరరావు (చక్రవర్తి) లండన్ ప్రయాణాన్ని, తిరిగి రాకను విమానాశ్రయంలో చిత్రీకరించారు. కథ ప్రకారం శ్రీ నాగేశ్వరరావు ఎఫ్. ఆర్. సి యస్. చదివేందుకు లండన్ వెళ్లుతాడు.

అక్టోబరు నెలలోనే ఐదు పాటలను రికార్డు చేయటం జరిగింది ఎడిటింగ్, తదితర పనులన్నీ షూటింగ్‌తోపాటు, శరవేగంతో సాగిపోతున్నాయి.

వాశిరాజు ప్రకాశం ★


## మనము-మనదేహస్థితి

11 వ పేజీ తరువాయి

ప్రేరేపణవల్ల జీర్ణకోశ భాగములు ఏవిధంగా మార్పుచెందుతవో తెలుసుకుందాము :—

| అంగము | సింపతెటిక్ ప్రేరేపణ | పేరాసింపతెటిక్ ప్రేరేపణ |
|---|---|---|
| పెరాటెడ్ గ్రంధి | చిక్కని రసం కొద్దిగా తయారౌతుంది | ఏమీ జరగదు |
| నోటిలో లాలాజల గ్రంధులు | ఏమీ జరగదు. | పుష్కలంగా స్యందిస్తవి |
| జఠరాశయ గ్రంధులు | తెలియదు | పుష్కల స్యందనం |
| పేంక్రియస్ | ఏమీలేదు. | పుష్కల స్యందనం |
| ప్రేగు | తరంగచలనం తగ్గుతుంది టోన్ తగ్గుతుంది. ప్రేగు విస్తరిస్తుంది. | తరంగచలనం అధికమై, టోన్ ప్రేగు బిర్రెక్కుతుంది. |
| స్పింక్టర్సు | బిగుసుకుంటవి | తెరుచుకుంటవి |
| లివరు | లివరులో ఉండే గ్లయికోజన్ గ్లూకోజుగా మారి రక్తంలోకి పోతుంది | ఏ ఫలితమూ లేదు. |
| పిత్తాశయము దాని నాళము | మందగించుతవి. | ఉద్రిక్తము లౌతవి |
| ఉదరంలో రక్తనాళములు | సంకోచము | ఏమీలేదు. |
| సాధారణ మెటబాలిజం | అధికమౌతుంది. | " |
| ఎడ్రినల్ గ్రంధి కార్టెక్సు స్యందనం | అధికమౌతుంది. | " |
| మానసికశక్తి | అధికమౌతుంది. | " |

(సశేషం)





Edited, Printed and Published by S. Radhakrishna at the AndhraPatrika Press; 6 &7 Thambuchetty Street Madras-1. Chief Editor S. Sambhu Prasad.



'గురువునుమించిన శిష్యుడు'లో కృష్ణకుమారి

Regd No. 4479, ANDHRA SACHITRA VARA PATRIKA.



ఇ. వి. సరోజ